

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 4-1-2026 | పేజీలు: 8 + 8 | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 299 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.12.30 తదుపరి విదియ, నక్షత్రం: పునర్వసు మ.3.11 తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.10.35-12.04, దుర్ముహూర్తం: సా.4.21-5.05, అమృతఘడియలు: మ.1.00-2.27, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 5.49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru






సంక్రాంతి
శుభాకాంక్షలు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 4-1-2026 | Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ

ఆంధ్రజ్యోతి

పాఠకులకు గమనిక



నేటి సంచికతో పాటు ఆదివారం అనుబంధానికి బదులుగా 2026 పంచాంగం క్యాలెండర్ ఉచితంగా అందుకోండి

- మేనేజింగ్ డైరెక్టర్

వస్త్రధారణ స్వేచ్ఛే.. మహిళా సాధికారతా?

..వస్త్ర ధారణ విషయంలో కట్టుబాటు అవసరమా? లేదా? స్వేచ్ఛ అంటే ఏమిటి? వంటి అంశాలు నటుడు శివాజీ పుణ్యమా అని మళ్లీ చర్చనీయాంశం అయ్యాయి.

..వస్త్రధారణ వ్యక్తిగతం. ఎవరి ఇష్టం వారిది అనడంలో సందేహం లేదు. అయితే, సమాజంలోని స్థితి గతులు, మన దేశ సంస్కృతి సంప్రదాయాలను కొంచెమైనా పరిగణనలోకి తీసుకోవాలి.

..అభిమానం ముసుగులో ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే ఇబ్బంది పడేది ఎవరో నాగబాబు, ప్రకాశ్ రాజ్‌లకు తెలియదా? జన సమూహంలోకి వెళ్లినప్పుడు చీర కట్టులో వెళితే మంచిదని సలహా ఇవ్వడం తప్పు ఎందుకవుతుంది?

..దురదృష్టవశాత్తు మహిళా సాధికార తకు నిర్వచనాన్ని కొందరు మార్చివేస్తు న్నారు. వస్త్రధారణకు, మహిళా సాధికా రతకు సంబంధం ఏమిటి? శరీర భాగాలను... అది స్త్రీలైనా, పురుషులైనా ప్రదర్శించడం వాంఛనీయమా?



..మంచి చెప్పడానికి అర్హత, హోదా అవసరం లేదు. ఫ్యాషన్‌బుల్‌గా ఉండాలనుకోవడం వేరు, వల్గర్‌గా ఉండాలనుకోవడం వేరు. మంచి మాటలను తప్పు పట్టే వారు ముందుగా మహిళా సాధికారతకు నిర్వచనం తెలుసుకోవాలి.

..మంచి చెప్పడానికి ప్రయత్నిం చినందుకు చింతించాల్సిన అవ సరం శివాజీకి లేదు. అభిప్రా యాలు చెప్పుకోవడానికి నాగ బాబు, ప్రకాశ్ రాజ్‌లకు ఎటు వంటి స్వేచ్ఛ ఉందో శివాజీకి కూడా అంతే స్వేచ్ఛ ఉంది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

మళ్లీ అవే తప్పులు

జగన్ సర్కారును కూల్చిన అడ్డగోలు 'రీ సర్వే'

ఆ గ్రామం పేరు కురుకూరు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని వ్యవసాయ గ్రామమిది. ఏపీ సర్వే-సరిహద్దుల చట్టం ప్రకారం గ్రామంలో భూముల సర్వే చేస్తామని సెక్షన్ ఆరు కింద నోటీసు ఇచ్చింది సర్వే సెటిల్‌మెంట్ శాఖ. సర్వేయర్లు భూములు కొలిచారు. రైతులకు నోటీసులు ఇచ్చారా? లేదా అన్నది దైవాధీనం. సర్వే పూర్తయింది. కానీ ఊర్లో ఏ ఒక్క రైతు భూమినీ సరిగ్గా కొలవలే దని, రీ సర్వే అంతా తప్పుల తడకగా వచ్చిందని తేలింది. దీంతో రైతుల గగ్గోలు! మండలంలో మరో మూడు గ్రామాల్లోనూ ఇదే సేమ్ సీన్! జగన్ ప్రభుత్వం లోనూ అచ్చం ఇలాగే జరిగింది. రీ సర్వేలోని తప్పులే అంతిమంగా జగన్ సర్కారు పతనానికి ప్రధాన కారణ మయ్యాయి. అవే తప్పులను ఇప్పుడు అధికారులు అక్షరం పొల్లుపోకుండా అమలు చేస్తున్నారు. ఇదే పరి స్థితి కొనసాగితే ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బం దులు తప్పవు. రీ సర్వే తప్పులను తొక్కిపెడుతున్న అధికారులు ఇదే కోరుకుంటున్నారా?!



- అయినా, ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే కొలతలు
- దీంతో అడుగడుగునా తడబాట్లు.. రైతుల గగ్గోలు
- ఊర్లకు ఊర్లే మార్చేస్తున్న అధికారులు
- సర్కారు చెబుతున్న 'రైతుల ప్రమేయం' గాలిలోనే
- తప్పు జరుగుతోందని తెలిసినా పెద్ద బాస్‌లు గప్‌చుప్
- ఎవరైనా నోరెత్తితే సస్పెండ్ చేస్తామని హెచ్చరికలు
- అవేవీ బయటపడకుండా దాటవేతలు
- కలర్‌ఫుల్ ప్రజంటేషన్లతో సర్కారు కళ్లకు గంతలు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇది చివ్వరం గ్రామం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలో ఉందిది. ఈ గ్రామంలో భూములను అధికారులు సర్వే చేసి, కొత్త రికార్డులు సిద్ధం చేశారు. అయితే, అవన్నీ తప్పులతడకలుగా ఉన్నా యంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమ గ్రామంలో మళ్లీ రీ సర్వే అయినా చేయాలని, లేదంటే, పాత రికార్డునే కొనసా గించాలని పట్టుబడుతున్నారు. ఈ పంచా యితీ శ్రీకాళహస్తి ఎమ్మెల్యేదాకా వెళ్లింది. అధికారులను ఆయన పిలిచి మాట్లాడారు. తప్పులు వచ్చిన మాట వాస్తవమే అని, వాటిని సరిదిద్దుతామని అధికారులు నివే దించారు. లేదు... రైతులను ఆందోళనకు గురిచేస్తున్న రీ సర్వేను రద్దుచేసి తాజాగా మరోసారి సర్వేచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తాజాగా జరుగుతున్న భూముల సర్వేలో ఊర్లకు ఊర్లనే మార్చేస్తున్న

మిగతా 5వ పేజీలో...



వెనెజువెలా రాజధాని కారకస్‌లో బాంబు పేలుళ్లు



మదురో తరలింపుపై ట్రంప్ విడుదల చేసిన ఫొటో

వెనెజువెలాపై దాడి

- కారకస్‌లో విమానాలతో అమెరికా బాంబు దాడులు
- అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిలియా నిర్బంధం
- వారిని యుద్ధనౌకలో న్యూయార్క్‌కు తీసుకొస్తున్నాం: ట్రంప్
- అమెరికా చట్టాల ప్రకారం మదురోపై విచారణ జరుపుతాం
- అమెరికా విదేశాంగ మంత్రి, అటార్నీ జనరల్ ప్రకటన
- అమెరికా చర్య మాపై సామ్రాజ్యవాద దాడి 2
- వెనెజువెలా ఉపాధ్యక్షురాలు డిల్సీ రోడ్రిగేజ్ మండిపాటు
- కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చమురు దోచే కుట్ర
- వెనెజువెలాకు సంఘీభావంగా వామపక్షాల ప్రకటనలు

అసలు లక్ష్యం చమురే

- వెనెజువెలాలో 303 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు
- 1999లోనే చమురు కంపెనీలను జాతీయం చేసిన చావెజ్
- అప్పటి నుంచి ఆ దేశంపై ఆగ్రహంతో ఉన్న అమెరికా

'భోగాపురం' రెడీ!

- నేడు ట్రయల్ రన్
- ఢిల్లీ నుంచి తొలి వాణిజ్య విమానం రాక
- రికార్డు సమయంలో పనులు.. 96% పూర్తి 5
- ఎయిర్‌పోర్టులో పూర్తిగా స్మార్ట్ టెక్నాలజీ
- జూన్‌లో ప్రారంభోత్సవం

బర్సే దేవా లొంగుబాటు

- సహచరులతో కలిసి తెలంగాణ డీజీపీ ఎదుటకు 2
- ఛత్తీస్‌గఢ్‌లో 2 ఎన్‌కౌంటర్లు
- 14 మంది మావోయిస్టుల మృతి

వెనెజువెలాపై అమెరికా దాడి అప్రజాస్వామికం

» సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

బీచ్‌రోడ్డు(విశాఖపట్నం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): వెనెజువెలాపై అమెరికా సామ్రాజ్యవాద దాడి అప్రజాస్వామికమని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ రోడ్డులో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ట్రంప్ రాజకీయాలు ప్రపంచాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. అమెరికా దుర్మార్గాలను ఖండించాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత పిలుపునిచ్చారు.

ఎన్సీఈఆర్టీకి డీమ్డ్ యూనివర్సిటీ హోదా!

న్యూఢిల్లీ, జనవరి 3: పాఠశాల పాఠ్యపుస్తకాలు, పాఠ్యప్రణాళిక రూపకల్పనలో సుదీర్ఘ కాలంగా సంబంధం ఉన్న ఎన్సీఈఆర్టీ త్వరలో మరో విభిన్నమైన సంస్థాగత పాత్ర చేపట్టనుంది. ఎన్సీఈఆర్టీకి ఈ నెలాఖరు నాటికి డీమ్డ్ యూనివర్సిటీ హోదా మంజూరయ్యే అవకాశం ఉందని కేంద్ర విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించి ప్రాథమిక సన్నాహాలు పూర్తయ్యాయని, యూజీసీ రాబోవు సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

10 నుంచి ఉపాధి హామీ 'బచావో సంగ్రామ్'

న్యూఢిల్లీ, జనవరి 3: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజీఎన్ఆర్ఈజీఏ)ను పునరుద్ధరించాలని, దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ 45 రోజుల పాటు దేశవ్యాప్త ఆందోళనలు నిర్వహించనుంది. ఎంజీఎన్ఆర్ఈజీఏ బచావో సంగ్రామ్ పేరిట ఈనెల 10 నుంచి వచ్చే నెల 25 వరకు ఈ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరామ్ రమేశ్ శనివారం ఢిల్లీలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

కెనడాలో వర్క్ పర్మిట్ల సంక్షోభం!

న్యూఢిల్లీ, జనవరి 3: కెనడాలో వర్క్ పర్మిట్ల సంక్షోభం తీవ్రమవుతోంది. నెలల వ్యవధిలోనే లక్షలాది మంది వర్క్ పర్మిట్ల గడువు ముగుస్తుండటంతో చట్టబద్ధత లేకుండా నివసించే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది. 2025 సంవత్సరం చివరి నాటికి 10.53 లక్షల మంది వర్క్ పర్మిట్ల గడువు ముగిసిపోగా, 2026లో మరో 9.27 లక్షల మందికి ఈ కాలపరిమితి తీరనుంది. ఈ నేపథ్యంలో 2026 మధ్య నాటికి దాదాపు 20 లక్షల మంది వలసదారులు కెనడాలో నివసించడానికి చట్టబద్ధ హోదా కోల్పోనున్నారు. ఐఆర్‌సీసీ గణాంకాల ప్రకారం వీరిలో సగం మంది భారతీయులే ఉండే అవకాశం ఉంది.

ఇమిగ్రేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తే శిక్ష తప్పదు

» హెచ్-1బీ దరఖాస్తుదారులకు అమెరికా హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 3: భారత్‌లోని అమెరికా ఎంబసీ హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుదారులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఇమిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘిస్తే తీవ్రమైన క్రిమినల్ శిక్షలు విధిస్తామని 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొంది. అమెరికాలోకి అక్రమ వలసలను అంతం చేయడంతో పాటు దేశ సరిహద్దులను, పౌరులను రక్షించడానికి ట్రంప్ యంత్రాంగం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది.

రాజస్థాన్ బడుల్లో పత్రికా పఠనం తప్పనిసరి

జైపూర్, జనవరి 3: పాఠశాల విద్యార్థుల్లో పఠనాసక్తిని, సామాజిక అంశాలపై అవగాహనను పెంపొందించడం, పదసంపదను మెరుగుపర్చడమే లక్ష్యంగా రాజస్థాన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇకపై ప్రతిరోజు వార్తాపత్రికలను చదవడం తప్పనిసరి చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ప్రకారం.. ఉదయం ప్రార్థన అనంతరం విద్యార్థులు కనీసం 10 నిమిషాల పాటు వార్తా పత్రికలను చదవాలి. ఉన్నత, ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు కనీసం రెండు పత్రికలకు చందా తీసుకోవాలి. వాటిలో ఒకటి ఇంగ్లిష్, మరొకటి హిందీ పత్రిక అయి ఉండాలి.

వెనెజువెలాపై అమెరికా దాడి

శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రాజధాని కారకస్‌పై బాంబులు

» అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిలియా నిర్బంధం



మదురో, సిలియా దంపతులు, వెనెజువెలాలోని అతిపెద్ద మిలిటరీ కాంప్లెక్స్ ఫ్యూయర్టే టీయూనా వద్ద బాంబు పేలుడు

కారకస్, జనవరి 3: వెనెజువెలాపై సైనిక చర్య తప్పదని కొన్నాళ్లుగా చెబుతూ వస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నంత పనిచేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత అమెరికా సైన్యం 'ఆపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్' పేరుతో వెనెజువెలాపై భీకర బాంబుదాడులతో విరుచుకుపడింది. ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన సతీమణి సిలియా ఫ్లోరిస్‌ను నిర్బంధంలోకి తీసుకుంది. అమెరికా సైన్యం ఈ మొత్తం ఆపరేషన్‌ను అత్యంత సమన్వయంతో అరగంటలోనే పూర్తిచేయటం విశేషం. సైనిక చర్య విజయవంతమైందని, మదురోను, సిలియాను యూఎస్ఎస్ ఐవో జిమా యుద్ధ నౌకలో న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. మదురోను తన సైనికులు నిర్బంధించటం ప్రత్యక్ష ప్రసారం ద్వారా టీవీ షో చూసినట్లుగా చూశానని ట్రంప్ తెలిపారు. తర్వాత కొద్దిసేపటికి, మదురో కళ్లకు గంతలు కట్టి, బేడీలు వేసి తీసుకువెళ్తున్న ఫొటోను ట్రంప్ విడుదల చేశారు. ఈ దాడిని వెనెజువెలా ఉపాధ్యక్షురాలు డిల్సీ రోడ్రిగెజ్ ఖండించారు. ఇది తమదేశంపై జరిగిన సామ్రాజ్యవాద దాడిగా అభివర్ణించారు. అమెరికాలోకి మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాలకు మదురోనే నాయకుడని ట్రంప్ చాలాకాలంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. మదురోపై మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలతో 2020లో న్యూయార్క్ దక్షిణ జిల్లాలో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఆయన అమెరికాకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 గంటలకు కారకస్‌పై అమెరికా సైన్యం యుద్ధ విమానాలు, సాయుధ హెలికాప్టర్లతో విరుచుకుపడింది. ముందుగా సైనిక స్థావరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఆ వెంటనే అధ్యక్షుడి నివాసంపై దాడిచేసి మదురో దంపతులను అదుపులోకి తీసుకుని, మెరుపు వేగంతో దేశ సరిహద్దులు దాటించింది. ఏం జరుగుతుందో తెలుసుకొనేలోపే రాత్రి 2 గంటలకల్లా ఆపరేషన్‌ను ముగించి అమెరికా మిలిటరీ తమ స్థావరాలకు వెళ్లిపోయింది. అమెరికా సైనిక ఆపరేషన్ తర్వాత వెనెజువెలాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజలు వీధుల్లో వచ్చి నిరసన తెలుపగా, కొంత మంది సంబరాలు చేసుకున్నారు. కాగా, అమెరికా సైనిక చర్యను, చైనా, ఫ్రాన్స్, చిలీ, రష్యా, క్యూబా, బొలీవియా, ఇరాన్ ఖండించగా, అర్జెంటీనా స్వాగతించింది.

డ్రైవర్ నుంచి దేశాధ్యక్షుడి స్థాయికి..

నికోలస్ మదురో అతిసామాన్యుడి స్థాయి నుంచి దేశాధ్యక్షుడిగా ఎదిగారు. 1962, నవంబర్ 23న ఆయన జన్మించారు. మధురో తండ్రి కార్మిక సంఘం నాయకుడిగా పనిచేయటంతో ఈయన కూడా వామపక్ష భావాలతోనే పెరిగారు. 1992లో సైనిక కమాండర్‌గా ఉన్న హ్యూగో చావెజ్ నాటి ప్రభుత్వాన్ని కూలదోసేందుకు సైనిక తిరుగుబాటుకు ప్రయత్నించగా అది విఫలమైంది. ప్రభుత్వం చావెజ్‌ను జైల్లో పెట్టడంతో ఆయనను విడుదలచేయాలని దేశ వ్యాప్తంగా జరిగిన వామపక్షాల నిరసనల్లో మదురో కీలకపాత్ర పోషించారు. 1998లో చావెజ్ దేశాధ్యక్షుడు అయ్యాక ఆయన ప్రభుత్వంలో మదురో కీలకపాత్ర పోషించారు. చావెజ్ 2013 మార్చి 5న మరణించారు. అంతకు కొద్దిరోజుల ముందే ఆయన మదురోను తన వారసుడిగా ప్రకటించారు.

అసలు లక్ష్యం చమురే!

» వెనెజువెలాలో 303 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు



న్యూఢిల్లీ, జనవరి 3: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను ఆయన నివాసం నుంచే అమెరికా సైన్యం శుక్రవారం రాత్రి నిర్బంధించి తీసుకుపోవటంపై ప్రపంచవ్యాప్తంగా మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. మదురో తన దేశంలో డ్రగ్స్ కార్టెల్స్‌ను నడుపుతూ.. అమెరికాలోకి అక్రమంగా మత్తుపదార్థాలు రవాణా చేస్తున్నారని ఆ దేశం ఎప్పటి నుంచో ఆరోపిస్తోంది. అయితే, అసలు కారణం అది కాదని.. వెనెజువెలాలో ఉన్న విస్తారమైన చమురు, గ్యాస్, బంగారం నిల్వలను దక్కించుకొనేందుకే మదురోను గద్దె దింపిందనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధిక చమురు నిల్వలు ఉన్న దేశాల్లో వెనెజువెలా ఒకటి. ఆ దేశంలో 303 బిలియన్ బ్యారెళ్ల చమురు ఉందని అంచనా. సహజవాయువు కూడా అదే స్థాయిలో ఉంది. బంగారం, ఇతర విలువైన ఖనిజాలకు కూడా వెనెజువెలా కేంద్రంగా ఉంది. అయితే, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా వాటిని భారీగా వెలికితీయలేకపోతోంది. వెనెజువెలాలో వామపక్ష నాయకుడైన హ్యూగో చావెజ్ 1998 ఎన్నికల్లో అధ్యక్షుడిగా గెలిచి, 1999లో అధికారంలోకి రాగానే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న పరిశ్రమలను జాతీయం చేశారు. అందులో అమెరికా, యూరప్ దేశాలకు చెందిన చమురు కంపెనీలు అధికంగా ఉన్నాయి. దీంతో ఆగ్రహించిన అమెరికా.. ఆ దేశంపై కఠిన ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య వైరం ముదురుతూ వచ్చింది. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయ్యాక ఇది మరింత తీవ్రమైంది. మదురోను అధికారం నుంచి దింపేసి తన కీలకబొమ్మలాంటి పాలకులను అక్కడ ఉంచి ఆ దేశంలోని వనరులను దక్కించుకోవాలనేది అమెరికా ప్రణాళిక అని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ట్రంప్‌తోపాటు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శనివారం చేసిన ప్రకటనలు అందుకు ఊతమిచ్చేలాగానే ఉన్నాయి. వెనెజువెలా తదుపరి పాలకుడిని తానే నిర్ణయిస్తానని, అక్కడ న్యాయబద్ధమైన ప్రభుత్వం ఏర్పడేవరకు తామే స్వయంగా వెనెజువెలాను పాలిస్తామని ట్రంప్ ప్రకటించగా, ఆ దేశం లాక్కున్న తమ చమురు (కంపెనీల జాతీయం ద్వారా)ను తిరిగి తీసుకుంటామని వాన్స్ తెలిపారు. కాగా, వెనెజువెలాపై అమెరికా దాడిని భారత్‌లోని కమ్యూనిస్టు పార్టీలు కూడా ఖండించాయి. ఈ మేరకు సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యూసీఐ(సీ) తదితర పార్టీలు ప్రకటనలు జారీ చేశాయి.

లోకం తీరు





నికోలస్ మదురో సత్యసాయి భక్తుడు

2005లో పుట్టపర్తికి వచ్చి బాబా ఆశీర్వచనాలు

పుట్టపర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వెనెజువెలా అధ్యక్షుడు మదురో సత్యసాయిబాబాకు భక్తుడు. 2005లో మదురో విదేశాంగ మంత్రిగా ఉన్నపుడు ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌తో కలిసి పుట్టపర్తికి వచ్చి సత్యసాయిబాబా నుంచి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అప్పట్లో సత్యసాయిని ప్రత్యేకంగా కలిశారు. సైమన్ బొలివర్, హ్యూగో చావెజ్ ఫొటోలతో పాటు సత్యసాయి నిలువెత్తు ఫొటోను కూడా తన అధ్యక్ష ప్యాలెస్‌లో ఉంచారు. మదురో కంటే ముందు ఆయన భార్య సాయికి భక్తురాలిగా ఉండేవారు. ఆమె ప్రభావంతో ఆయన కూడా బాబా భక్తుడిగా మారారు. 2011లో సత్యసాయి శివైక్యం అయినపుడు వెనుజువెలా జాతీయ అసెంబ్లీలో సంతాప తీర్మానం ప్రవేశ పెట్టడంలో మదురో కీలక పాత్ర పోషించారు. మరే దక్షిణ అమెరికా దేశం ప్రకటించనట్లుగా ఒకరోజు సంతాపదినం కూడా అప్పట్లో ప్రకటించి ఆధ్యాత్మిక గురువు పట్ల తన భక్తి చాటుకున్నారు. సత్యసాయి మహాసమాధిని కూడా దర్శించారు. 2025 నవంబరు 23న సాయిబాబా శతజయంతోత్సవం సందర్భంగా.. బాబాను ఉద్దేశించి 'కాంతి స్వరూపుడు' అన్నారు. ఇతర విదేశీ ఎన్‌జీవోలను దేశం నుంచి పంపివేసినా, మదురో అండతో సత్యసాయి సంస్థ మాత్రం వెనుజువెలాలో సేవలు అందిస్తూనే ఉంది.



డీజీపీ కార్యాలయంలో లొంగిపోయిన దేవా, మావోయిస్టులు

బర్సే దేవా లొంగుబాటు

తన సైన్యంతో కలిసి తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన పీఎల్‌జీఏ చీఫ్

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి, అతడి భార్య సహా 20 మంది సరెండర్

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కీలక నేత, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) చీఫ్ బర్సే సుక్కా అలియాస్ దేవా, పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి అలియాస్ వెంకటేశ్, ఆయన భార్య సహా 20 మంది మావోయిస్టులు శనివారం డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. వీరు అధునాతమైన 48 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. దళ నిర్వహణ కోసం మావోయిస్టు పార్టీ అప్పగించిన రూ.20 లక్షల నగదును సైతం దేవా ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. పీఎల్‌జీఏ చీఫ్ హిడ్మా ఇటీవల ఏపీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన తర్వాత.. ఆ బాధ్యతను దేవా చేపట్టారు. దేవాతోపాటు లొంగిపోయిన వారిలో అతని అంగరక్షకులైన 10 మంది పీఎల్‌జీఏ సైన్యం, కంకణాల రాజిరెడ్డి అతని భార్య ఈశ్వరి (ఏపీ), అర్బన్ పార్టీ సభ్యుడైన దార సారయ్య ఉన్నారు.

దేవా, హిడ్మాలది ఒకే ఊరు..

దేవా, హిడ్మా ఇద్దరిదీ ఒకే గ్రామం. హిడ్మా ప్రభావంతో 2003లో దేవా మావోయిస్టు పార్టీలో చేరారు. పీఎల్‌జీఏలో ఒక బెటాలియన్‌కు కమాండర్‌గా వ్యవహరించేవారు. ప్రస్తుతం దేవా లొంగుబాటు తర్వాత పీఎల్‌జీఏలో 60 లోపే ఉంటారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. దేవా వాడుతున్న ఇజ్రాయెల్ తయారీ టావర్ రైఫిల్ ప్రస్తుతం ఏపీ, తెలంగాణ పోలీసుల వద్ద కూడా లేదని, దీనిని కేంద్ర భద్రతా బలగాల నుంచి ఎదురుకాల్పుల ఘటనల్లో దక్కించుకుని ఉంటారని భావిస్తున్నట్లు తెలిపారు. శనివారం లొంగిపోయిన మావోయిస్టులపై మొత్తం రూ.1.90 కోట్ల రివార్డు ఉందని, ఇందులో తక్షణ సాయం కింద వీరందరికీ రూ.25 వేల చొప్పున నగదు ఇస్తున్నామని చెప్పారు. కాగా, ఆధునిక సాంకేతికత, కమ్యూనికేషన్ సదుపాయాలు మెరుగైన ప్రస్తుత పరిస్థితుల్లో సాయుధ పోరాటం పనిచేయదని, అడవుల్లో మిగిలిన మావోయిస్టులు వచ్చి లొంగిపోవాలని రాజిరెడ్డి కోరారు.

14 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లో రెండుచోట్ల ఎదురుకాల్పులు

చర్ల/చింతూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా, బీజాపూర్ అడవుల్లో శనివారం ఉదయం జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతిచెందారు. సుక్మా జిల్లా కుంట డివిజన్ కిష్టారం అడవుల్లో కుంట ఏరియా కమిటీ కమాండర్ మంగడుతో పాటు అతడి టీం సభ్యులు ఉన్నట్లు బలగాలకు సమాచారం అందింది. దీంతో సుక్మాకు చెందిన డీఆర్‌జీ బలగాలు కూంబింగ్ చేపట్టి.. మావోయిస్టులు ఉన్న ప్రదేశాన్ని చుట్టుముట్టాయి. అనంతరం ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు మృతిచెందారని సుక్మా ఎస్పీ కిరణ్‌చవాన్ తెలిపారు. మృతుల్లో మంగడు, కమిటీ సభ్యుడు సచిన్ మగ్దూన్ ఉన్నట్టు గుర్తించారు. మిగతా వారిని గుర్తించాల్సి ఉంది.



కుటుంబ సభ్యులతో కలిసి గ్లాస్‌బ్రిడ్జిపై ఆమ్రపాలి

గ్లాస్ బ్రిడ్జిపై ఆమ్రపాలి

విశాఖపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి కుటుంబ సభ్యులతో కలిసి ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. రుషికొండ బీచ్‌ను సందర్శించిన ఆమె శుక్రవారం రాత్రి లంబసింగి వెళ్లారు. అక్కడ తెల్లవారుజామున చెరువులవేనం వెళ్లి మంచు మేఘాలను వీక్షించారు. పరిసర ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రాలకు వెళ్లి శనివారం మధ్యాహ్నం విశాఖపట్నం వచ్చారు. కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జిని సందర్శించారు. బ్రిడ్జిపై నుంచి విశాఖపట్నం ప్రకృతి సోయగాలు చాలా బాగున్నాయని, సముద్రం పైకి వెళ్లినట్టుగా ఉందని తెలిపారు.

కార్పొరేట్లకు తాయిలాలు.. ప్రజలకు యమపాశాలు: సీపీఐ

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న లక్షల కోట్ల తాయిలాలు.. ప్రజలకు యమపాశాలుగా మారుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య విమర్శించారు. ప్రైవేట్ రంగంలోని వోడాఫోన్-ఐడియా కంపెనీ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.8,695 కోట్ల బకాయిలకు మారటోరియం కల్పిస్తూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయించడం సరికాదని ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2032 నుంచి 2041 లోపు వీటిని చెల్లించాలని, అప్పటి వరకు వీఐ కంపెనీకి వడ్డీమాఫీ చేస్తూ ప్రకటించడం కార్పొరేట్లకు కొమ్ముకాయడమేనని అన్నారు. 2014 నుంచి మోదీ ప్రభుత్వం రూ.2.50 లక్షల కోట్లకు పైగా బడా మోసగాళ్ల బ్యాంకు రుణాలు మాఫీ చేసిందని పేర్కొన్నారు. ఆ లోటును పూడ్చేందుకు ప్రజలపై పన్నులు, అధిక ధరల భారాలు మోపుతున్న మోదీ సర్కార్ వైఖరి గర్హనీయమని ఈశ్వరయ్య మండిపడ్డారు.

గోవిందరాజస్వామి ఆలయ గోపురంపై మందుబాబు హల్‌చల్

అర్ధరాత్రి గుడిలోకి వెళ్లి పైకెక్కి వీరంగం

- మూడు గంటలు శ్రమించి కిందకు దింపిన సిబ్బంది
- నిందితుడు తెలంగాణ వాసిగా గుర్తింపు
- ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- భద్రతా వైఫల్యం నేపథ్యంలో ఇద్దరు ఆలయ సిబ్బందిపై వేటు



తిరుపతిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

తిరుపతి/కామారెడ్డి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం నడిబొడ్డున ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో మరోసారి భద్రతా వైఫల్యం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఓ వ్యక్తి భద్రతా సిబ్బందికి తెలియకుండా ఆలయంలోకి ప్రవేశించి ఏకంగా ఆలయ ప్రధాన గోపురంపైకి చేరుకున్నాడు. కలశాలు ఊడబెరుకుతూ హంగామా చేశాడు. ఆలస్యంగా గుర్తించిన ఆలయ భద్రతా సిబ్బంది పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సాయంతో మూడు గంటలు శ్రమించి మందుబాబును గోపురంపై నుంచి కిందకు తీసుకొచ్చారు. కాగా తీవ్ర సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం టీటీడీకి చెందిన ప్రధాన ఆలయాల్లో ఒకటి. నగరం నడిబొడ్డున ఉన్న ఈ గుడిని శుక్రవారం రాత్రి 10 గంటలకు మూసివేశారు. సుమారు 11.15 గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించాడు. వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఏర్పాటు చేసిన పందిరి నిమిత్తం గోడకు నిలిపిన కర్రలు, నిచ్చెన సాయంతో ఆలయ ప్రధాన గోపురం మూడవ అంతస్తు వద్దకు చేరాడు. గోపురం పైనుంచి శబ్దాలు వినిపించడంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది జమేదార్ పట్టాభి రెడ్డి, డ్యూటీ గార్డు గోపురంపై ఓ వ్యక్తి ఉన్నట్టు గుర్తించారు. అతన్ని కిందకు దించడానికి యత్నించి విఫలమయ్యారు. ఆలయంలోని ఇతర సిబ్బందిని కూడా రప్పించినా ఫలితం లేకపోయింది. మందుబాబు కిందకు దిగకపోగా తనకు 90 ఎంఎల్ కావాలంటూ కేకలు పెట్టాడు. ఆలయ సిబ్బంది గోపురం పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా ఎవరైనా పైకి వస్తే తాను కిందకు దూకేస్తానంటూ మందుబాబు బెదిరింపులకు దిగాడు. సమీపించిన సిబ్బంది ఒకరిని కిందకు తోసేయడానికి యత్నించాడు. ఆపై గోపురంపై అమర్చిన ట్యూబ్ లైట్‌ను పగలగొట్టడంతో పాటు గోపురం చివరి అంతస్తు చేరుకుని రెండు కలశాలను తొలగించేందుకు విఫలయత్నం చేశాడు. దీంతో అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఆలయ సిబ్బంది ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులుకు సమాచారమిచ్చారు. ఆయన పోలీసు, అగ్నిమాపక సిబ్బందిని వెంటబెట్టుకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. అతన్ని కిందకు దించడానికి వారి ప్రయత్నాలు కూడా విఫలం కావడంతో చివరికి అగ్నిమాపక సిబ్బంది వాటర్ క్యానన్ ప్రయోగించడంతో ఎట్టకేలకు మందుబాబు గోపురంపై నుంచి కిందకు దిగాడు. అతన్ని ఈస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో మందుబాబు పేరు కుత్తాడి తిరుపతి (42) అని, తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పదేళ్ల క్రితం హైదరాబాద్ భరత్ నగర్ వలస వెళ్లిన అతనికి భార్య, ఇంటర్ చదివే కుమార్తె, 9వ తరగతి చదివే కొడుకు ఉన్నట్టు గుర్తించారు. అక్కడ భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుని బతికేవారని తేలింది. ఇంట్లో భార్యతో గొడవపడి అలిగి పది రోజుల కిందట తిరుపతి చేరుకున్నాడని, అలిపిరి సమీపంలోని భూదేవి కాంప్లెక్సు ఆవరణలో ఉచిత భోజనం తిని అక్కడే ఉంటున్నట్టు గుర్తించారు. మద్యం మత్తులో గుడిలోకి వెళ్లానే తప్ప మరే ఇతర ఉద్దేశం లేదని నిందితుడు పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. కాగా ఆలయ జమేదార్ పట్టాభి రెడ్డి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు తిరుపతిపై కేసు నమోదు చేశారు. ఆ ప్రాంత సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నిందితుడు శుక్రవారం రాత్రి 9 గంటల తర్వాత ఆలయం వెలుపల ఐదారుసార్లు అటూఇటూ తిరుగాడినట్టు గుర్తించారు.

గతంలోనూ భద్రతా వైఫల్యాలు

తిరుపతిలోని కీలక టీటీడీ ఆలయమైన గోవిందరాజస్వామి గుడిలో గతంలోనూ భద్రతా వైఫల్యాలు చోటు చేసుకున్నాయి. 2019 ఫిబ్రవరి 2వ తేదీన ఓ వ్యక్తి చీకటి పడ్డాక ఆలయంలోకి ప్రవేశించి ఆలయ ఉత్సవ మూర్తులకు అమర్చిన రెండు కిరీటాలను అపహరించాడు. 1.3 కిలోల బరువున్న రెండు కిరీటాలు బంగారం, విలువైన రాళ్లతో చేసినవి. కిరీటాలు మాయమయ్యాయని ఆలస్యంగా గుర్తించిన ఆలయ సిబ్బంది అప్రమత్తమయ్యేటప్పటికే కిరీటాలను చోరీ చేసిన వ్యక్తి తిరుపతి దాటేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని మహారాష్ట్రకు చెందిన ఆకాష్ ప్రతాప్ సరోడిగా గుర్తించారు. అదే ఏడాది ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. అయితే అప్పటికే అతను కిరీటాలను కరిగించేయడంతో పాటు కొంత బంగారాన్ని విక్రయించేశాడు. పోలీసులు కరిగించిన బంగారాన్ని రికవరీ చేశారు. అప్పట్లో భద్రతా వైఫల్యానికి ఆలయ సిబ్బందిపై టీటీడీ చర్యలు తీసుకుంది. 2021 నవంబరు 27న మరో దుండగుడు ఆలయంలో చోరీకి విఫలయత్నం చేశాడు. రాత్రి వేళ ఆలయంలోకి ప్రవేశించిన నిందితుడు ప్రాంగణంలోని వినాయక మందిరం, ధ్వజస్తంభాల వద్ద ఉన్న రెండు హుండీలను పగలగొట్టేందుకు విఫలయత్నం చేశాడు.



గోవిందరాజస్వామి ఆలయ గోపురంపై తిరుపతి

జమేదార్‌పై చర్యలు: సీవీఎస్‌వో మురళీకృష్ణ

తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి విచారిస్తున్నాం. ఆలయ జమేదార్ పట్టాభిరెడ్డిపై చర్యలు తీసుకుంటాం. ఆలయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తాం. భవిష్యత్తులో భద్రతా వైఫల్యాలు పునరావృతం కాకుండా పక్కా ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకుంటాం.


ఒకే రోజు రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనాలు

- శుక్రవారం ఉత్తర ద్వార ప్రవేశం చేసిన 83,032 మంది

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో ఎన్నడూలేని విధంగా ఒకే రోజు 83,032 మంది భక్తులు వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకున్నారు. సాధారణంగా శుక్రవారం నిత్య కైంకర్యాలతో పాటు అభిషేక సేవ సందర్భంగా సర్వదర్శనాలను నిలిపేస్తారు. దీంతో దర్శన సమయం చాలా తక్కువగా ఉంటుంది. అయితే ఎక్కువ మంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించాలని టీటీడీ చేపట్టిన చర్యలతో శుక్రవారం రికార్డు స్థాయిలో 83,032 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. ఇక, గడిచిన నాలుగు రోజుల్లో 2.85 లక్షల మందికి శ్రీవారిని దర్శించుకుని వైకుంఠద్వార ప్రవేశం చేసే అవకాశం దక్కింది. రూ.14.77 కోట్ల హుండీ ఆదాయం లభించింది. మరోవైపు శనివారం ఉదయం నుంచి అదనపు క్యూలైన్లన్నీ పలచగా కనపడ్డాయి. కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు మాత్రమే సర్వదర్శన భక్తులతో నిండుగా కనిపించాయి.

టీటీడీ ట్రస్టులకు రూ.3 కోట్ల విరాళం

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి చెందిన పలు ట్రస్టులకు రూ.3 కోట్లు విరాళంగా అందాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్ విరాళం డీడీని శనివారం ఉదయం తిరుపతిలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు అందజేశారు.



టీటీడీ ఈవోకు డీడీ అందజేస్తున్న పీఎంఎస్ ప్రసాద్

నృసింహుని సేవలో జస్టిస్ శ్రీనరసింహ

మంగళగిరి సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ శనివారం సతీసమేతంగా గుంటూరు జిల్లాలోని మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. తొలుత దిగువ సన్నిధిలో లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎగువ సన్నిధిలో పానకాల నృసింహస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. న్యాయమూర్తి వెంట మంగళగిరి న్యాయాధికారులు కె.సురేష్ బాబు, ఎం.ప్రసన్న లక్ష్మి తదితరులు ఉన్నారు.



జస్టిస్ శ్రీనరసింహ దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, అధికారులు

అప్పన్న సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు

సింహాచలం (విశాఖపట్నం), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ సిన్హా శనివారం దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు దేవాలయ ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారులు సత్యశ్రీనివాస్, వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. న్యాయమూర్తుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాలను పర్యవేట్టంగా చుట్టారు. కప్పస్తంభ ఆలింగనం, గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలివ్వగా, అధికారులు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



కప్పస్తంభం వద్ద జస్టిస్ గోపాలకృష్ణారావు



రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న న్యాయమూర్తుల బంగ్లాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ఏప్రిల్ నెలాఖరుకు అందుబాటులోకి పలు భవనాలు

- అమరావతిలో నిర్మాణాలను పరిశీలించిన మంత్రి నారాయణ

తుళ్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో నిర్మాణంలో ఉన్న ప్రధాన కార్యదర్శులు, న్యాయమూర్తులు, మంత్రుల బంగ్లాలు ఏప్రిల్ నెలాఖరు నాటికి అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ చెప్పారు. శనివారం ఉదయం అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడం వలన పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ భవనాలన్నింటినీ తొలుత సాధారణ పరిపాలన శాఖకు అప్పగిస్తామని తెలిపారు. సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూ సేకరణ నోటిఫికేషన్ వచ్చే బుధవారం ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు.

నల్లమలలో పులుల లెక్కింపు ప్రారంభం

- తొలి బ్లాక్‌లో 320 చోట్ల కెమెరా ట్రాప్స్ ఏర్పాటు
- పరిశీలించిన ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్



లెక్కింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్

ఆత్మకూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నల్లమలలోని నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో శనివారం నుంచి పులుల లెక్కింపు ప్రక్రియ మొదలయింది. తొలి బ్లాక్‌లో జరుగుతున్న ఈ లెక్కింపు ప్రక్రియను ఎన్ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ విజయకుమార్, నంద్యాల జిల్లా ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావ్.. ఇందిరేశ్వరం, గుమ్మితం తదితర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్స్ పాయింట్లను పరిశీలించి అటవీ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. విజయకుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్‌టీఆర్ పరిధిలోని ఆత్మకూరు, నంద్యాల, గిద్దలూరు, మార్కాపురం డివిజన్ల పరిధిలో మే 31వ తేదీ వరకు పులుల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నట్టు తెలిపారు. ఇందుకోసం మొత్తం 1,176 కెమెరా ట్రాప్ పాయింట్లను గుర్తించి ప్రతిచోటా ఎదురెదురుగా రెండు కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే ఆత్మకూరు డివిజన్‌లో 477 కెమెరా ట్రాప్స్ పాయింట్లను గుర్తించి అందులో తొలి బ్లాక్‌లో ఆత్మకూరు రేంజ్‌లో 151, నాగలూటిలో 84, శ్రీశైలం రేంజ్‌లో 35 చొప్పున మొత్తం 320 చోట్ల కెమెరా ట్రాప్స్ అమర్చినట్టు తెలిపారు. తొలిబ్లాక్‌లో ఫిబ్రవరి 15వ తేదీ వరకు కెమెరా ట్రాప్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు.

రాష్ట్రంపై మంచు దుప్పటి

- నేడు, రేపు రవాణా సేవలకు స్వల్ప అంతరాయం

విశాఖపట్నం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అధిక పీడన ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లోని అనేక ప్రాంతాల్లో శనివారం ఉదయం దట్టంగా మంచు కురిసింది. కొన్నిచోట్ల ఉదయం పది గంటల వరకూ మంచు తెర కొనసాగింది. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపింది. విశాఖ ఎయిర్‌పోర్టు రన్‌వేపై విజిబిలిటీ 800 మీటర్లకు పడిపోయింది. ఆదివారం నుంచి మరో నాలుగైదు రోజుల వరకు మంచు తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. ఆది, సోమవారం ఉదయం పూట మంచు ప్రభావంతో రవాణా సేవలకు స్వల్ప అంతరాయం ఏర్పడుతుందని, జాతీయ రహదారులపై వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాగా ఆగ్నేయ, దానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. రానున్న రెండు రోజుల్లో ఉపరితల ఆవర్తనం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి వచ్చే అవకాశం ఉందని, అయితే కోస్తా, రాయలసీమల్లో వర్షాలకు అవకాశం లేదని ఆయన తెలిపారు.

చనిపోతూ.. ఐదుగురికి ప్రాణం!

- రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలుడు బ్రెయిన్‌డెడ్
- కుటుంబం అంగీకారంతో అవయవదానం
- తిరుపతి శ్రీపద్మావతి హృదయాలయలో ఓ యువతికి బాలుడి గుండె అమర్చిన వైద్యులు
- వివిధ ఆస్పత్రులకు ఇతర అవయవాల తరలింపు

కర్నూలు హాస్పిటల్/తిరుపతి(వైద్యం), జనవరి 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్ డెడ్‌కు గురైన ఓ 15 ఏళ్ల బాలుడు.. తాను చనిపోతూ అవయవదానం ద్వారా మరో ఐదుగురికి ప్రాణం పోశాడు. వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలానికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థి గత నెల 31న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కర్నూలు కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 2వ తేదీన వైద్యులు బాలుడి బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ ట్రస్టు సభ్యులు, కిమ్స్ వైద్యులు బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి, బాలుడి అవయవదానానికి అంగీకారం తీసుకున్నారు. విద్యార్థికి చెందిన ఒక కిడ్నీ, లివర్‌ను కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌లో ఉంచారు. శనివారం గ్రీన్ చానల్ ద్వారా మరో కిడ్నీని నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు, గుండెను తిరుపతి శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి తరలించారు. ఊపిరితిత్తులను సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌కు అంబులెన్స్‌ల ద్వారా తరలించారు.



తిరుపతి విమానాశ్రయం నుంచి గుండెను తరలిస్తున్న వైద్య సిబ్బంది

20 ఏళ్ల యువతికి ఆ బాలుడి గుండె

తిరుపతి శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రి వైద్యులు శనివారం 20 ఏళ్ల యువతికి విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్స చేశారు! బ్రెయిన్ డెడ్‌కు గురైన కర్నూలు జిల్లా బాలుడి గుండెను ఆమెకు అమర్చారు. అంతకుముందు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కృష్ణా జిల్లాకు చెందిన ఆ యువతికి గుండె మార్పిడి శస్త్రచికిత్స చేయాలని శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించి, ఆమె వివరాలను జీవన్‌దాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి శుక్రవారం తన బృందంతో కలిసి కర్నూలు చేరుకున్నారు. అక్కడ బ్రెయిన్‌డెడ్‌కు గురైన బాలుడి నుంచి గుండె సేకరించి, ప్రత్యేక హెలికాప్టర్‌లో శనివారం సాయంత్రం రేణిగుంటలోని విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న ప్రత్యేక అంబులెన్సులో గ్రీన్‌చానల్ ద్వారా 5.10 గంటలకు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే గుండె మార్పిడి శస్త్ర చికిత్సను ప్రారంభించారు. ఆపరేషన్‌కు దాదాపు 6-8 గంటల సమయం పట్టింది. ఆపరేషన్‌కు ముందు ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు 22 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

అన్నమయ్య జిల్లా కేంద్రం మార్పుపై పిల్

- హైకోర్టును ఆశ్రయించిన న్యాయవాది

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుండి మదనపల్లెకు మార్చడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది బి.వెంకట నారాయణ రెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. జిల్లా కేంద్రం మార్పు విషయంలో రెవెన్యూ శాఖ గతేడాది డిసెంబర్ 30న జారీ చేసిన జీవోతో పాటు తుది గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఏపీ డిస్ట్రిక్ట్ ఫార్మేషన్ చట్టం-1974లోని సెక్షన్ 3(5)కి అనుగుణంగా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయలేదన్నారు. ప్రజలు, భాగస్వామ్య పక్షాల నుంచి అభ్యంతరాలు స్వీకరించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా అన్నమయ్య జిల్లా పరిపాలన కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలని కోరారు. జిల్లా కేంద్రం మార్పు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన జీవోతో పాటు గెజిట్ నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యాలయాలు, రికార్డులను మదనపల్లెకు మార్చే విషయంలో తదుపరి చర్యలు తీసుకోకుండా అధికారులను నిలువరించాలని కోరారు. రెవెన్యూ, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శులు, భూపరిపాలన శాఖ ప్రధాన కమిషనర్, అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు.

6న పశు వైద్య సంఘాల సమావేశం

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పశువైద్య వృత్తికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి రాష్ట్ర స్థాయి సంఘాల సమావేశం ఈనెల 6వ తేదీ ఉదయం గుంటూరులోని ఏపీ వెటర్నరీ కౌన్సిల్ కార్యాలయంలో జరుగుతుందని కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య తెలిపారు. వెటర్నరీ అధికారుల సంఘం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్, నిరుద్యోగ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, ఏపీ వెటర్నరీ అసిస్టెంట్స్ అసోసియేషన్, వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు, వెటర్నరీ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్‌లతో ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఆయా సంఘాల ప్రతినిధులు హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని శనివారం ఓ ప్రకటనలో కోరారు.

బీసీ గణన పూర్తిచేసేలా ఆదేశించండి

- స్థానిక ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలి
- హైకోర్టులో ఆలిండియా బీసీ ఫెడరేషన్ పిటిషన్.. రేపు విచారణ

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ గణన పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ ఏపీ స్టేట్ యునిట్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని అధికరణ 342(ఏ)(3) ప్రకారం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల జాబితాను రూపొందించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీల జాబితాను తయారు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఏపీలో బీసీ జనాభా 50శాతం కన్నా ఎక్కువ ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్ మాత్రమే కల్పిస్తున్నారని తెలిపారు. 2023లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను తక్షణమే పూర్తిచేయాలని కోరారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో అమలు చేస్తున్న విధంగానే కేటగిరీల వారీగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ వర్తింపజేయాలన్నారు. తద్వారా బీసీల్లోని ఉపకులాలకు సైతం రాజకీయంగా సమాన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాకి అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచడంతో పాటు తమిళనాడులో అమలు చేస్తున్న విధంగానే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారు. పెంచిన రిజర్వేషన్లకు చట్టపరంగా ఎలాంటి ఇబ్బంది రాకుండా రాజ్యాంగంలోని అధికరణ 31బీ కింద 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయితీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, విద్యాశాఖ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, ఏపీపీఎస్సీ కార్యదర్శి, కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం విచారణ జరపనున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

వస్త్రధారణ స్వేచ్ఛే.. మహిళా సాధికారతా?

మన దేశంలో వైద్య వృత్తిలో ఉన్న వారికి భారతీయ వైద్య మండలి డ్రెస్ కోడ్ నిర్ణయించింది. పురుషులైతే జీన్స్ ప్యాంట్, టీ షర్టులు వంటి ఫ్యాషనబుల్ దుస్తులు ధరించకూడదు. మహిళలైతే మితి మీరిన అలంకరణ చేసుకోకూడదు. గోళ్లు పెంచుకొని నెయిల్ పాలిష్ వేసుకోకూడదన్న నిబంధనలూ ఉన్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. రోగులకు వైద్యులపై గౌరవ భావం ఏర్పడాలి. వైద్యో నారాయణో హరిః అంటారు. అంటే వారిలో దేవుడిని మాత్రమే రోగులు చూడాలన్న ఉద్దేశంతో ఇలాంటి నియమ నిబంధనలు పెట్టారు. యాప్రాన్ ధరించి కనపడే వైద్యుల పట్ల మనకు తెలియకుండానే గౌరవ భావం ఏర్పడుతుంది. న్యాయమూర్తులకూ డ్రెస్ కోడ్ ఉంది. న్యాయమూర్తులను చూడగానే లేచి నిలబడి గౌరవించాలన్న ఉద్దేశంతో డ్రెస్ కోడ్ పెట్టి ఉంటారు. వస్త్రధారణ విషయంలో మాకు స్వేచ్ఛ లేదా అని న్యాయమూర్తులు, వైద్యులు వంటి ఉన్నత వృత్తుల్లో ఉన్నవారు చిట్టి పొట్టి దుస్తులు ధరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి.

నిండు సభలో ఒక మహిళ చీర లాగినందుకు మహాభారత సంగ్రామం జరిగింది. అది ద్వాపర యుగం. మహిళలు జన సమూహంలోకి వెళ్లినప్పుడు చీర కట్టుకుంటే మంచిది అన్నందుకు మాటల యుద్ధం జరుగుతోంది. ఇది కలియుగం! యుగ ధర్మంలో ఎంత తేడా! మహిళల వస్త్రధారణపై సినీ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై ప్రస్తుతం తెలుగునాట మాటల యుద్ధం జరుగుతోంది. శివాజీ చేయరాని తప్పు చేసినట్టుగా కొంతమంది అభినవ కందుకూరి వీరేశలింగం పంతుళ్లు కొద్ది మంది మహిళల తరఫున వత్తాసు పలుకుతున్నారు. సమాజంలో అత్యధికులు శివాజీకి మద్దతుగా నిలిచారు. మొత్తంగా సోషల్ మీడియాలో ఇదొక ప్రధానాంశంగా మారింది. ఒక ప్రారంభోత్సవ కార్యక్రమానికి పొట్టి దుస్తులతో వచ్చిన సినిమా నటి నిధి అగర్వాల్ అభిమానుల అత్యుత్సాహం వల్ల ఇబ్బందిపడ్డారు. ఆ సంఘటనను దృష్టిలో ఉంచుకొని మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ కొన్ని వ్యాఖ్యలు చేశారు. జన సమూహంలోకి వెళ్లినప్పుడు సినిమా హీరోయిన్లు ఒళ్లు కనపడకుండా చీర కట్టుకుంటే హుందాగా ఉంటుందన్నది ఆయన అభిప్రాయం. సినిమా అంటేనే గ్లామర్ ఫీల్డ్. ప్రారంభోత్సవాలకు పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించి హీరోయిన్లను పిలిచేది కూడా గ్లామర్‌తో వారు ప్రజలను ఆకర్షిస్తారనే. ఈ క్రమంలో కొన్ని అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా నిధి అగర్వాల్, సమంత వంటి వారు అభిమానుల అత్యుత్సాహంతో ఇబ్బంది పడ్డారు. దీంతో హీరోయిన్లు ఇబ్బంది పడకూడదంటే వస్త్రధారణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సినీ నటుడు శివాజీ ఉచిత సలహా ఇచ్చారు. అంతే... 'మేం ఎలాంటి దుస్తులు ధరించాలో చెప్పడానికి నువ్వెవరు?' అంటూ కొంత మంది సినిమా పరిశ్రమకు చెందిన మహిళలు మండిపడ్డారు. వారికి మద్దతుగా నాగబాబు, ప్రకాశ్‌రాజ్ వంటి అభినవ వీరేశలింగం పంతుళ్లు నోరు విప్పారు. 'వస్త్రధారణ విషయంలో మహిళలను కట్టడి చేయడం ఏమిటి? ఎటువంటి దుస్తులు ధరించాలో నిర్ణయించుకొనే హక్కు మహిళలకు లేదా?' అని మండిపడ్డారు. పురుషుల వక్ర, సంకుచిత దృష్టికి ఇదే నిదర్శనమని నిందించారు. మహిళా సాధికారత అంటే అంగాంగ ప్రదర్శనే అన్నట్టుగా శివాజీని విమర్శించినవాళ్లు మాట్లాడారు. దీంతో కందకు లేని దురద కత్తిపీటకు ఎందుకు? అని భావించిన శివాజీ ఇకపై తన నోటికి తాళం వేసుకుంటున్నట్టు ప్రకటించారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఎవరు తప్పు? ఎవరు ఒప్పు? అని తేల్చడం ఎలా?

మారుతున్న కాలం...

ద్వాపర యుగంలో ద్రౌపదిని నిండు సభకు ఈడ్చుకు వచ్చి దుర్యోధన, దుశ్శాసనులు వస్త్రాపహరణకు పాల్పడినందుకు మహాభారత సంగ్రామం జరిగిందని చదివాం–విన్నాం. ఒక మహిళను అవమానించినందుకు కౌరవులు మూల్యం చెల్లించుకున్నారు. ద్వాపర యుగంలోనైనా, కలియుగంలోనైనా మహిళలను అవమానించినవారు మూల్యం చెల్లించుకోక తప్పదని అనేక సంఘటనలు రుజువు చేశాయి. వర్తమానంలోకి వస్తే, మహిళల వస్త్రధారణ గత కొంత కాలంగా వివాదమవుతోంది. పురుషులను రెచ్చగొట్టే విధంగా కాకుండా మహిళలు నిండుగా దుస్తులు ధరించాలని కొంతమంది వ్యాఖ్యానించడం, దానిపై అభ్యుదయ మహిళలుగా చెప్పుకునే వారు మండిపడటం, వారికి మద్దతుగా అభినవ కందుకూరి వీరేశలింగం పంతుళ్లు గొంతెత్తడం చూస్తున్నాం. కాలానుగుణంగా మనుషుల జీవన విధానంలో మార్పులు వస్తున్నాయి. అందులో వస్త్రధారణ కూడా ఒకటి. ఆది మానవులు దుస్తులే ధరించలేదు. ఆ తర్వాత శరీరాన్ని కప్పుకోవడానికి ఆకులు, జంతు చర్మాలు కట్టుకొనేవారు. నాగరికత అభివృద్ధి చెందిన కొద్దీ వస్త్రధారణలో మార్పులు వచ్చాయి. వస్త్రధారణ అనేది నాగరికతకు చిహ్నంగా మారింది. మన దేశంలో పురుషులు పంచెలు కట్టుకోవడం, మహిళలు చీరలు కట్టుకోవడం సంప్రదాయంగా చాలా కాలం పాటు పరిఢవిల్లింది. ఈ క్రమంలో వృత్తులలో మార్పులు వచ్చాయి. మరింత సౌకర్యవంతంగా ఉండటంకోసం పురుషులు పంచెకట్టుకు స్వస్తి చెప్పి ప్యాంట్లు ధరించడం మొదలు పెట్టారు. మహిళలు కూడా ఉద్యోగాలు, వ్యాపారాలలో పురుషులతో సమానంగా ఎదిగారు. దీంతో వారి వస్త్రధారణలో కూడా మార్పులు వచ్చాయి. మహిళలైనా, పురుషులైనా సౌకర్యంగా ఉండటం కోసం వస్త్రధారణలో మార్పులు ఎంచుకున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. ఇటీవలి కాలంలో కొంత మంది మహిళలు మరీ పొదుపుగా చిట్టి పొట్టి దుస్తులు ధరిస్తున్నారు. ఇది అడపా దడపా వివాదం అవుతోంది. వస్త్రధారణ వ్యక్తిగతం. ఎవరి ఇష్టం వారిది అనడంలో సందేహం లేదు. అయితే, సమాజంలోని స్థితిగతులు, మన దేశ సంస్కృతి సంప్రదాయాలను కొంచెమైనా పరిగణనలోకి తీసుకోవాలి.


బాధ్యత ఎవరిది?

సినీ నటుడు శివాజీని విమర్శించిన వారి విషయానికి వద్దాం! ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వెళ్లే హీరోయిన్లు దుస్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం లేదా? మహిళలు వారికి ఇష్టమైన దుస్తులు ధరించవచ్చు. కాకపోతే బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. స్వీయ రక్షణ ఏర్పాటు చేసుకోవాలి అని నాగబాబు కూడా సెలవిచ్చారు. ఇలాంటి వారిని దృష్టిలో ఉంచుకొనే 'అడుసు తొక్కనేల కాలు కడగనేల' అనే సామెత వచ్చి ఉంటుంది. సినిమా అంటేనే గ్లామర్ ఫీల్డు. అందునా మహిళా నటులు బయటికొస్తే వారిని చూడటానికి జనం ఎగబడతారు. ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్ మాటల్లో చెప్పాలంటే, ఫ్యాన్స్ అనేవాళ్లు కొన్ని సందర్భాలలో దారుణంగా వ్యవహరిస్తారు. హీరోలను కూడా ఇబ్బందులపాలు చేస్తారు. పిసికేస్తారు. అందుకే తనపైకి ఎగబడే ఫ్యాన్స్‌ను ప్రముఖ హీరో బాలకృష్ణ కొడుతుంటారని పూరీ జగన్నాథ్ అన్నారు. ఈ క్రమంలో హీరోయిన్ల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అలాంటప్పుడు నాగబాబు చెబుతున్నట్టుగా స్వీయ రక్షణ చేసుకోవాల్సింది హీరోయిన్లే కదా? జరగరానిది జరిగితే బాధ పడాల్సింది ఎవరు? అభిమానం ముసుగులో ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే ఇబ్బందిపడేది ఎవరో నాగబాబు, ప్రకాశ్‌రాజ్‌లకు తెలియదా? జన సమూహంలోకి వెళ్లినప్పుడు చీర కట్టులో వెళితే మంచిదని సలహా ఇవ్వడం తప్పు ఎందుకవుతుంది? చిట్టి పొట్టి బట్టలతో కనపడిన హీరోయిన్లపైకి జనం ఎగబడి అది తొక్కిసలాటలకు దారితీస్తే పరిస్థితి ఏమిటి? తొక్కిసలాటలో ఏమైనా జరగొచ్చు కదా? మహిళా సాధికారత అంటే ఏమిటి? వస్త్రధారణ విషయంలో కట్టుబాటు అవసరమా? లేదా? స్వేచ్ఛ అంటే ఏమిటి? వంటి అంశాలు శివాజీ పుణ్యమా అని మళ్లీ చర్చనీయాంశం అయ్యాయి. సృష్టి ధర్మం కారణంగా మహిళలు శారీరకంగా పురుషులకంటే బలహీనులు అయితే అయి ఉండవచ్చునుగానీ, మిగతా విషయాలలో కాదు. సమాన అవకాశాలు కల్పిస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణిస్తారని చరిత్ర రుజువు చేసింది. పాలనలో కూడా పురుషులకు తాము ఏం తీసిపోమని అనేక మంది మహిళా నాయకులు రుజువు చేసుకున్నారు. ఇందిరాగాంధీ, మార్గరెట్ థాచర్, సిరిమావో బండారునాయకే వంటి శక్తిమంతమైన మహిళా నాయకులను చూశాం. అంతర్జాతీయంగా పేరొందిన కంపెనీలకు మహిళలు సారథ్యం వహిస్తున్నారు. అవకాశం లభించాలేగానీ మహిళలు సమర్థంగా పనిచేస్తారని అనేక సందర్భాలలో రుజువైంది. దురదృష్టవశాత్తు మహిళా సాధికారతకు నిర్వచనాన్ని కొందరు మార్చివేస్తున్నారు. వస్త్రధారణకు, మహిళా సాధికారతకు సంబంధం ఏమిటి? శరీర భాగాలను... అది స్త్రీలైనా, పురుషులైనా ప్రదర్శించడం వాంఛనీయమా? వస్త్రధారణలో విచ్చలవిడితనం సాధికారత, స్వేచ్ఛ ఎలా అవుతుంది? అదే నిజమైతే పర్యవసానాలకు కూడా సిద్ధం కావాలి కదా?

సంస్కృతి.. సంబంధాలు!

పాశ్చాత్య దేశాల సంస్కృతి వేరు– మన దేశ సంస్కృతి వేరు. అనాదిగా మనకంటూ ఏర్పరుచుకున్న సంస్కృతి, కట్టుబాట్లకు అలవాటుపడిన మనం అంగ ప్రదర్శన చేసే వారి పట్ల చులకనభావంతో వ్యవహరిస్తాం. అంతే కాదు, మన దేశంలో వృత్తులను బట్టి డ్రెస్ కోడ్ పెట్టుకున్నాం. బహిరంగ ప్రదేశాలలో ఎలా ఉండకూడదో నిర్ణయించుకున్నాం. గ్లామర్ ఫీల్డుగా చెప్పుకొనే సినిమా రంగంలో కూడా చాలా కాలం పాటు ఈ కట్టుబాట్లు కొనసాగాయి. ఈ విషయంలో సినిమా నిర్మాతలు, దర్శకులు, రచయితలు, నటులు చాలా జాగ్రత్తలు తీసుకొనేవారు. ఈ సందర్భంగా ఒక సంఘటన గురించి చెప్పుకోవాలి. చాలా కాలం క్రితం ఒక సినిమాలో అమ్మాయి గారు, అంటే హీరోయిన్ ఏం చేస్తున్నారని ఒక పాత్రధారి ప్రశ్నించగా స్నానం చేస్తున్నారు అని మరో పాత్రధారితో చెప్పించారు. స్నానం చేస్తున్నారని మాటల రచయిత రాయడాన్ని సదరు సినిమా దర్శకుడు అభ్యంతరపెట్టారు. హీరోయిన్ స్నానం చేస్తున్నారంటే కొందరు ప్రేక్షకుల్లో మనో వికారాలు ఏర్పడతాయన్నది సదరు దర్శకుడి అభ్యంతరం. ఆ తరం వారు అంత ఉన్నతంగా ఆలోచించారు. ఇప్పుడు స్నానం చేయడాన్నే చూపించేస్తున్నారు. మనం కూడా చూస్తూ

> **'జంక్ ఫుడ్ తింటే ఊబకాయం వస్తుంది. అనారోగ్య సమస్యలతో బాధపడతారు' అని వైద్యులు చెబుతారు కదా! జంక్ ఫుడ్ తినవద్దని చెప్పడానికి మీరెవరు? అని ప్రశ్నించడం ఎంత అహేతుకంగా ఉంటుందో దుస్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించడాన్ని తప్పుపట్టడం కూడా అంతే అహేతుకం.**



ఆనందిస్తున్నాము. శృంగార రస సన్నివేశాలలో కూడా హద్దులు చెరిగిపోయాయి. ఒకప్పటి హీరోయిన్లు కౌగిలించుకొనే సందర్భాలలో హీరో ఎదకు తమ ఎద తగలకుండా చేతులు అడ్డుపెట్టుకొనేవారు. ఇప్పుడు సెన్సార్ బోర్డు ఉందో లేదో తెలియని పరిస్థితి కొన్ని సినిమాల్లో చూస్తున్నాం. పాశ్చాత్య దేశాలలో ప్రేమికులు లేదా భార్యాభర్తలు నడి రోడ్డుపై ముద్దులు పెట్టుకుంటారు. అది వారి సంస్కృతిలో భాగం. స్వేచ్ఛ పేరిట దుస్తులు విప్పుకొని తిరగడం కూడా మన దగ్గర నిషేధం. 'పబ్లిక్ న్యూసెన్స్'ని నియంత్రించటానికి చట్టమూ ఉంది. ఈ కారణంగానే శ్రీరెడ్డి అనే ఆమె కొంత కాలం క్రితం ఫిలిం చాంబర్ ముందు దుస్తులు విప్పడానికి ప్రయత్నించినప్పుడు పోలీసులు అడ్డుపడి అరెస్టు చేశారు. వృత్తులను బట్టి కూడా డ్రెస్ కోడ్ నిర్ణయించడానికి కారణం ఉంది. వైద్యుల విషయానికి వద్దాం! మన దేశంలో వైద్య వృత్తిలో ఉన్న వారికి భారతీయ వైద్య మండలి డ్రెస్ కోడ్ నిర్ణయించింది. పురుషులైతే జీన్స్ ప్యాంట్, టీ షర్టులు వంటి ఫ్యాషనబుల్ దుస్తులు ధరించకూడదు. మహిళలైతే మితిమీరిన అలంకరణ చేసుకోకూడదు. గోళ్లు పెంచుకొని నెయిల్ పాలిష్ వేసుకోకూడదన్న నిబంధనలూ ఉన్నాయి. ఇందుకు కారణం లేకపోలేదు. రోగులకు వైద్యులపై గౌరవ భావం ఏర్పడాలి. వైద్యో నారాయణో హరిః అంటారు. అంటే వారిలో దేవుడిని మాత్రమే రోగులు చూడాలన్న ఉద్దేశంతో ఇలాంటి నియమ నిబంధనలు పెట్టారు. యాప్రాన్ ధరించి కనపడే వైద్యుల పట్ల మనకు తెలియకుండానే గౌరవ భావం ఏర్పడుతుంది. అలా కాకుండా వైద్యులు కూడా చిట్టి పొట్టి దుస్తులు ధరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులు నిక్కర్లు వేసుకొని వెళుతున్నారు. ఆ వృత్తిలో ఉన్న వారికి అలాంటి దుస్తులు సౌకర్యవంతంగా ఉంటాయేమో! వారికి ప్రజలతో సంబంధం ఉండదు. వారిని ఎవరూ కార్యాలయాలకు వెళ్లి కలవరు కూడా. న్యాయమూర్తుల విషయానికి వద్దాం! వారికి కూడా డ్రెస్ కోడ్ ఉంది. న్యాయమూర్తులను చూడగానే లేచి నిలబడి గౌరవించాలన్న ఉద్దేశంతో డ్రెస్ కోడ్ పెట్టి ఉంటారు. వస్త్రధారణ విషయంలో మాకు స్వేచ్ఛ లేదా అని న్యాయమూర్తులు, వైద్యులు వంటి ఉన్నత వృత్తుల్లో ఉన్నవారు చిట్టి పొట్టి దుస్తులు ధరిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. ఎవరు ఏ వృత్తిలో ఉన్నా సమాజం పట్ల మనకు ఒక బాధ్యత ఉంటుంది. పుష్ప2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట సంఘటనలో ప్రముఖ హీరో అల్లు అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు కదా? నేను నటించిన సినిమా చూడటానికి థియేటర్‌కు వెళ్లే స్వేచ్ఛ నాకు లేదా? అని అర్జున్ ప్రశ్నించవచ్చు కదా? ఆయన వెళ్లడం వల్లనే అక్కడ తొక్కిసలాట జరిగింది. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా జనంలోకి సినిమా నటులు వెళ్లకూడదని ఈ సంఘటన చెబుతోంది. నాగబాబు, ప్రకాశ్‌రాజ్ వంటి వారు చెబుతున్నట్టుగా తిండి, బట్ట విషయంలో ఎవరి ఇష్టం వారిదే అన్నది వాస్తవం. 'జంక్ ఫుడ్ తింటే ఊబకాయం వస్తుంది. అనారోగ్య సమస్యలతో బాధపడతారు' అని వైద్యులు చెబుతారు కదా! జంక్ ఫుడ్ తినవద్దని చెప్పడానికి మీరెవరు? అని ప్రశ్నించడం ఎంత అహేతుకంగా ఉంటుందో దుస్తుల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించడాన్ని తప్పు పట్టడం కూడా అంతే అహేతుకం. జాగ్రత్తగా ఉండాలనడం మోరల్ పోలీసింగ్ అవుతుందని విమర్శించడం ఏమిటి? గ్రామాలలో తప్పు చేసే పిల్లలను వారితో ఏ సంబంధం లేని పెద్దవాళ్లు మందలించడం మనకు తెలిసిందే. మా పిల్లలు ఏం చేస్తే మీకెందుకని వారిని తల్లిదండ్రులు తప్పుపట్టరు. పిల్లలు చెడిపోకూడదన్న సదుద్దేశంతోనే మందలిస్తారు కనుక వారి తల్లిదండ్రులు కూడా అభ్యంతరం చెప్పరు. ఇది మన సంస్కృతి.

ముగియని వివాదం...

ఇప్పుడు మళ్లీ శివాజీ వ్యాఖ్యల విషయానికి వద్దాం! ఆయన రెండు పదాలను అనవసరంగా వాడారు. అందుకు క్షమాపణ చెప్పారు కూడా! అంతటితో ఆ వివాదం ముగిసిపోవాలి కానీ నాగబాబు, ప్రకాశ్‌రాజ్ వంటి వారి ప్రవేశంతో వివాదం మళ్లీ రాజుకుంది. ఆడవారి వస్త్రధారణ విషయంలో సుద్దులు చెప్పడానికి శివాజీ ఎవడు? అని ప్రశ్నించడమే ఆశ్చర్యంగా ఉంది. జన సమూహంలోకి వెళ్లేటప్పుడు దుస్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కొంత మంది హీరోయిన్ల వలె నిండుగా చీర కట్టుకొని వెళ్లాలని సూచించడం తప్పు ఎలా అవుతుంది? నగ్నంగా, అర్ధనగ్నంగా తిరగడం చట్టరీత్యా నేరం కూడా. శరీర భాగాలను ప్రదర్శిస్తూ జన సమూహంలోకి వెళ్లినప్పుడు ఏమైనా జరగొచ్చు. నాగబాబు, ప్రకాశ్‌రాజ్ వంటి ఉదాత్తభావాలు, ఉన్నత సంస్కారం ఒంటబట్టించుకున్న వాళ్లు అక్కడ ఉండకపోవచ్చు కదా! ఫ్యాన్స్ హద్దులు మీరిన అభిమానంతో హీరోలనే నలిపేస్తుంటారు. అందుకే కదా బౌన్సర్లను రక్షణగా పెట్టుకొంటారు. అలాంటప్పుడు హీరోయిన్లకు రక్షణ ఎలా ఉంటుంది? జరగరానిది ఏదైనా జరిగితే నిధి అగర్వాల్ వంటి వారు అల్లు అర్జున్‌లా కేసుల్లో ఇరుక్కోరా? నాలుగు గోడల మధ్య జరిగే సినిమా ఫంక్షన్లలో ఎలాంటి దుస్తులు వేసుకున్నా పెద్ద ఇబ్బంది ఉండదు. జనంలోకి వెళ్లినప్పుడే తంటా అంతా! దుస్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించడానికి శివాజీ ఎవడు? అని ప్రశ్నించేవాళ్లు... 'మీ ఇష్టం వచ్చినట్టు దుస్తులు వేసుకోండని చెప్పడానికి మేమెవరం?' అని కూడా ప్రశ్నించుకోవాలి. మంచి చెప్పడానికి అర్హత, హోదా అవసరం లేదు. ఫ్యాషనబుల్‌గా ఉండాలనుకోవడం వేరు, వల్గర్‌గా ఉండాలనుకోవడం వేరు. మంచి మాటలను తప్పు పట్టే వారు ముందుగా మహిళా సాధికారతకు నిర్వచనం తెలుసుకోవాలి. ఆడపిల్ల అని వివక్షగా చూడటం తప్పు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో పురుషులకే రక్షణ లేదు. రక్షణ విషయంలో మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం తప్పు ఎలా అవుతుంది? స్మార్ట్ ఫోన్ల పుణ్యమా అని పురుషుల్లో మనోవికారాలు పెరిగిపోతున్నాయి. సంస్కారం లేని వాళ్లు మృగాలుగా మారుతున్నారు. ముక్కుపచ్చలారని పసి పిల్లల నుంచి పండుటాకుల వలె రాలిపోయే దశలో ఉన్న వృద్ధ మహిళలు కూడా ఈ మృగాల క్రూరత్వానికి బలవుతున్నారు. శృంగారపరమైన ఉద్రేకాలను రెచ్చగొట్టే వీడియోలు విచ్చలవిడిగా అందుబాటులో ఉండటంతో పాటు మద్యం, డ్రగ్స్ వినియోగం పెరగడం ఇందుకు కారణం కావొచ్చు. ఈ నేపథ్యంలో శివాజీ వంటి వారు చేసే సూచనలను, వ్యాఖ్యలను సదుద్దేశంతో అర్థం చేసుకోవాలి.

> **పూర్వం వలె మహిళలు వంటింటికే పరిమితం కావడంలేదు. పురుషులతో సమానంగా ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సౌకర్యంగా ఉండటంకోసం ధరించే దుస్తుల్లో మార్పులు చేసుకున్నారు. ఆకర్షణీయంగా తయారవడం వేరు– ఆకర్షించే విధంగా తయారవడం వేరు! మనం ధరించే దుస్తులు, తయారయ్యే విధానాన్ని బట్టి అవతలి వారికి మన పట్ల ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. రాజకీయాలలో ఉన్న మహిళలు చీర కట్టులోనే ఎక్కువగా కనిపించడం గమనార్హం. ఎందుకంటే వారు నిత్యం జనంలో తిరుగుతుంటారు. సినిమా హీరోయిన్లు కూడా సినిమాల్లో గ్లామర్‌గా కనిపించడం వేరు, జనంలోకి వచ్చినప్పుడు గ్లామర్‌గా కనిపించే ప్రయత్నంలో పొదుపుగా దుస్తులు ధరించడం వేరు. పాఠశాలల్లో ఇప్పుడు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటో బోధిస్తున్నారు. దీంతో బాల్యం నుంచి పిల్లల్లో శరీర భాగాల విషయంలో అవగాహన ఏర్పడుతోంది. ప్రైవేట్ పార్ట్స్‌ను పబ్లిక్‌గా చూపించడాన్ని ఇప్పుడు పిల్లలు కూడా ఆమోదించే పరిస్థితి లేదు. వస్త్రధారణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని చెప్పడం సంకుచితంగా ఆలోచించడం ఎలా అవుతుంది?**

మంచి కోసమే నిబంధనలు..

అయినదానికీ కానిదానికీ మహిళలకు వత్తాసు పలకడం మహిళా సాధికారతను ప్రోత్సహించడం అనిపించుకోదు. స్వేచ్ఛ పేరిట పొట్టి దుస్తులు ధరించాలని అనుకోవడం మన సమాజం హర్షించదు. నాగబాబు వ్యాఖ్యలను అత్యధికులు ఆక్షేపిస్తున్నారు. మానవ జాతి పరిణామ క్రమంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మరింత సౌకర్యంగా, ఆదర్శంగా, ఉన్నతంగా ఉండటానికే సదరు మార్పులు వచ్చాయి. ఆది మానవులలో వావి వరుసలు ఉండేవి కావు. దానివల్ల కలుగుతున్న అనర్థాలను గుర్తించి వావి వరుసలు ఏర్పరుచుకున్నారు. అలాగే శరీర భాగాలను కప్పుకోవాలన్న స్పృహ తెచ్చుకున్నారు. నాగరికత లేని దశ నుంచి ప్రస్తుత ఆధునిక యుగంలోకి వచ్చాం. పూర్వం వలె మహిళలు వంటింటికే పరిమితం కావడంలేదు. పురుషులతో సమానంగా ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సౌకర్యంగా ఉండటం కోసం ధరించే దుస్తుల్లో మార్పులు చేసుకున్నారు. ఆకర్షణీయంగా తయారవడం వేరు– ఆకర్షించే విధంగా తయారవడం వేరు! మనం ధరించే దుస్తులు, తయారయ్యే విధానాన్ని బట్టి అవతలి వారికి మన పట్ల ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. హుందాగా రెడీ అయితే అవతలివాళ్లు మనల్ని గౌరవిస్తారు. స్వేచ్ఛ ఉంది కదా అని స్త్రీలైనా, పురుషులైనా శరీర ప్రదర్శనకు పాల్పడితే చీప్‌గా చూస్తారు. సినిమా రంగంలో ఉండే అమ్మాయిలు గ్లామర్‌గా కనిపించడం అవసరం. ఇతర రంగాలలో పనిచేసే అమ్మాయిలకు ఆ అవసరం లేదు. ఇతరులు తమను గౌరవించేలా వారు కనిపించడం ఉత్తమం. రాజకీయాలలో ఉన్న మహిళలు చీర కట్టులోనే ఎక్కువగా కనిపించడం గమనార్హం. ఎందుకంటే వారు నిత్యం జనంలో తిరుగుతుంటారు. తమను కలిసేవారు తమ పట్ల గౌరవ భావంతో మెలగాలని వారు చీర కట్టును ఎంచుకొని ఉండవచ్చు. చిట్టి పొట్టి దుస్తులతో ఒక మహిళా ప్రజాప్రతినిధి జనంలోకి వెళ్లడాన్ని ఊహించగలమా? వెళ్లకూడదా? అని గద్దిస్తే ఏం చెబుతాం? వెళ్లవచ్చు. కాకపోతే పర్యవసానాలకు కూడా సిద్ధం కావాలి. జరగరాని పరాభవం జరిగితే చింతించకూడదు. సినిమా హీరోయిన్లు కూడా సినిమాల్లో గ్లామర్‌గా కనిపించడం వేరు, జనంలోకి వచ్చినప్పుడు గ్లామర్‌గా కనిపించే ప్రయత్నంలో పొదుపుగా దుస్తులు ధరించడం వేరు. పాఠశాలల్లో ఇప్పుడు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటో బోధిస్తున్నారు. దీంతో బాల్యం నుంచి పిల్లల్లో శరీర భాగాల విషయంలో అవగాహన ఏర్పడుతోంది. ప్రైవేట్ పార్ట్స్‌ను పబ్లిక్‌గా చూపించడాన్ని ఇప్పుడు పిల్లలు కూడా ఆమోదించే పరిస్థితి లేదు. వస్త్రధారణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని చెప్పడం సంకుచితంగా ఆలోచించడం ఎలా అవుతుంది? సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించడం, ఆచరించడం అంటే భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చినట్టు కాదని ప్రకాశ్‌రాజ్ వంటి వారు గ్రహించాలి. మంచికి పోతే చెడు ఎదురైనట్టుగా ప్రస్తుతం శివాజీ పరిస్థితి తయారైంది. తనకు మాలిన ధర్మం అని ఆయన ఇప్పుడు వాపోతున్నారు. అయితే మంచి చెప్పడానికి ప్రయత్నించినందుకు చింతించాల్సిన అవసరం శివాజీకి లేదు. అభిప్రాయాలు చెప్పుకోవడానికి నాగబాబు, ప్రకాశ్‌రాజ్‌లకు ఎటువంటి స్వేచ్ఛ ఉందో శివాజీకి కూడా అంతే స్వేచ్ఛ ఉంది. కందకు లేని దురద కత్తి పీటకు ఎందుకని నోరు కట్టేసుకోవాల్సిన అవసరం లేదు. వస్త్రధారణ విషయంలో స్వేచ్ఛ అంటే అది కష్టాలు తెచ్చి పెట్టేదిగా ఉండకూడదు. తిండి, బట్ట విషయంలో స్వేచ్ఛ అనేది మనకు మేలు మాత్రమే చేయాలి. ఈ రెండు విషయాలలో నియమ నిబంధనలు పెట్టుకోవడం మనకే మంచిది!

యుద్ధం ఆపటం ద్రోహం కాదు!

హైదరాబాద్‌పై నాటి పోలీస్ చర్య తర్వాత తెలంగాణా సాయుధ పోరాటాన్ని కొనసాగించాలా వద్దా అన్న విషయంలో కమ్యూనిస్టు పార్టీ లోపలా వెలుపలా పెద్దగా చర్చ జరగలేదు. కానీ నేడు ఆపరేషన్ కగార్ కారణంగా మావోయిస్టుల మరణాలు, లొంగుబాట్లూ తారస్థాయికి చేరిన నేపథ్యంలో సాయుధ పోరాటాన్ని విరమించాలా, విశ్రమించాలా, కొనసాగించాలా? అనే విషయాలపై విస్తారమైన చర్చ జరుగుతున్నది.

మావోయిస్టు పార్టీ నిర్మాణంలో భాగమై, కష్టనష్టాలు చవిచూస్తున్న వారిలో విరమణవాదం వైపు మొగ్గు ఎక్కువ ఉంది. బయట భద్రజీవితం గడుపుతున్న సానుభూతిపరులూ, మద్దతుదారులూ దీన్ని సమర్థించటం లేదు. ప్రస్తుత విషయం పక్కనపెట్టి పాత తెలంగాణా పోరాటం విషయానికొస్తే– 1946 నుంచి 1951 వరకు జరిగిన ఈ పోరాటంలో 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్య జరిగిన తర్వాతే కమ్యూనిస్టు పార్టీ సింహభాగం కార్యకర్తల్ని కోల్పోయింది. చివరకు నాలుగు వేలమంది ఆత్మార్పణ జరిగిన తర్వాత నాయకులు కళ్ళు తెరిచి, 1951 అక్టోబర్ 21న పోరాటాన్ని విరమించారు.

పోలీసు చర్య తర్వాత తీవ్ర ప్రాణనష్టం జరుగుతున్నప్పటికీ పోరాటాన్ని ఎందుకు కొనసాగించారు? పోరాట విజయాల్ని కాపాడుకోవటం కోసమే అన్న వాదన ఒప్పుకుందామన్నా– 1948 నుంచి 1951 దాకా ఎందరో యోధుల్ని నష్టపోవటం తప్ప కాపాడుకున్నది ఏమిటి? లీగల్‌గా ఉండి ఆ పని చేయలేం, అనేట్టయితే మరి 1951 నుంచి ఈనాటి వరకూ ఈ పార్టీలు చేస్తున్న లీగల్ పార్లమెంటరీ పనులకు అర్థం లేనట్టేనా? కనీసం 1952 తొలి ఎన్నికల్లో అభ్యర్థులు దొరక్క ఒకే వ్యక్తి మూడు నియోజకవర్గాల్లో నిలబడాల్సిన పరిస్థితి వుండేది కాదు కదా. 1948 నుంచి లీగల్‌గా పనిచేస్తే 1952 ఎన్నికల్లో హైదరాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చేది కదా. 1948నాటి స్థితికీ, నేటి స్థితికీ తేడా ఏమిటంటే– ఆనాడు ప్రజలూ, కార్యకర్తలూ చనిపోతే నేడు కార్యకర్తలతో పాటు నాయకులు కూడా చనిపోయారు. పోరాట విరమణ అంటే లొంగిపోవటమో, దిగజారిపోవటమో ద్రోహం చేయటమో కాదు. అననుకూల పరిస్థితుల్లో వేసే ఎత్తుగడ. అయితే లొంగిపోతున్న వారంతా ఉద్యమ ప్రయోజనాల కోసమే లొంగిపోతున్నారా? అనేది తేల్చగలిగినది కాదు. మావోల ఎర్ర దండులో తెల్లజెండాలెత్తటం ఇప్పుడు కొత్తగా వచ్చినదేమీ కాదు. లొంగిపోయినప్పటి వారి హావభావాలపై కూడా స్పష్టంగా వ్యాఖ్యానించలేం. లొంగిపోయినా బతకనిస్తారో లేదోననే అభద్రతాభావంలో వున్న వారి మానసిక స్థితిని అంచనా వేయటం కష్టం.



వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో పార్టీ జరిపిన పోరాటాల్లో సాఫల్య వైఫల్యాలు రెండూ ఉండటం సహజం. ఎక్కువ తక్కువలు, వాటికోసం చెల్లించిన మూల్యం బేరీజు వేసుకొని కొనసాగటం విజ్ఞత. విషాదమేమిటంటే అన్ని కమ్యూనిస్టు గ్రూపుల్లోనూ తరతమ స్థాయిల్లో ఈ విజ్ఞత లోపించటం. జరిగిన ఎన్‌కౌంటర్లు నిజమా బూటకమా అన్న చర్చే అసంగతం. 1969 నుంచి 2025 వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 95శాతానికి పైగా బూటకమే. ఆనాడు శ్రీకాకుళంలో గాని, ఈనాడు దండకారణ్యంలో గాని భద్రతా బలగాలు అడవి లోపలకు వెళ్లనంత వరకే గానీ– వారు ఎప్పుడైతే అడవిలోకి ప్రవేశించారో అప్పుడే మావోయిస్టులు ఓటమి పాలయ్యారు. 'ఇంత జరుగుతున్నా నంబాల కేశవరావు లాంటి అగ్ర నాయకుడు కర్రెగుట్టలో ఉండటం సబబేనా?' అని మావోయిస్టు పార్టీలోని ఒక పెద్ద నాయకుణ్ణి అడిగాను. దుర్భేద్యమైన బలగాల ముట్టడి నుంచి బయటపడే దారి లేకనే నంబాల దొరికిపోయాడని ఆయన చెప్పాడు.

అద్భుతమైన సాంకేతికత, అసంఖ్యాకమైన బలగాలు, వందల సంఖ్యలో లొంగుబాట్లు, మరణాలు, చేయూతనివ్వని జనం, నిర్లిప్తంగా చూస్తున్న మేధావులు, అంతరంగిక చర్చలు లేకుండా స్వంత నిర్ణయాలు తీసుకుంటున్న నాయకులు, అయోమయంలో కార్యకర్తలు... ఇలా అన్నీ విఫల సందర్భాలే. 'మన' అనే మమకారం స్థానంలో ఎవరికి వాళ్లు 'నా' అనే అహంకారం ప్రదర్శించారు. కలలన్నీ కల్లలవ్వటానికి ఈ ఒక్కటి చాలు. కేంద్ర కమిటీ సభ్యులే 14 మంది చనిపోయారు. ఒక్క 2025లోనే 317 మంది హతమయ్యారు! 862 మంది అరెస్టు అయ్యారు. 1,973 మంది లొంగిపోయారు. ప్రభావిత జిల్లాలు 126 నుంచి 11కు పడిపోయాయి. ఈ స్థితిలో లొంగిపోవటం సరైనదా? కాదా? అన్నదే సమస్య కానీ– ఆయుధాలతోనా, ఆయుధాలు లేకుండానా అన్న మీమాంస తర్కానికి నిలిచేది కాదు. ఆయుధాలు తిరిగి పార్టీకి ఇవ్వడమంటే 'మేం భద్రజీవితాల్ని చూసుకున్నాం, మీరు పోరాడండి' అని చెప్పడమే కనుక అది సరికాదని వారు భావించడంలో తప్పులేదు. స్వప్నాలు భగ్నమై, ఉద్యమం అస్థిపంజరానికి కప్పిన చిల్లుల దుప్పటిగా మారినప్పుడు ఎదురయ్యే ఒకే ఒక్క ప్రశ్న– మారటమా, మరణించటమా? దానికి జవాబు ఆలోచించటం ఎంతటి వారికైనా సులువు కాదు. కప్పదాట్లు, పిల్లిమొగ్గలు చాలా ఉద్యమాల్లో సహజమే. కానీ నిండు బతుకుల్ని నిప్పుల పాల్జేయడానికి సిద్ధపడినవారు– మారటమా, మరణించటమా? అనే ప్రశ్న ముందు నిలబడి తీసుకున్న నిర్ణయాలను ద్రోహచింతన అని తేల్చిపారేయటం సరైనదేనా? "అవసరమైనప్పుడు వెనకడుగు వేయటం, అవకాశం వచ్చినప్పుడు దెబ్బతీయటం" అనేది మావో ప్రవచిత గెరిల్లా సూత్రమేగా, మావోయిస్టులు పాటించటంలో తప్పేముంది?

మావోయిస్టుల ఈనాటి స్థితికి కేవలం నిర్బంధమే కారణమా? వారి వ్యూహం ఎత్తుగడల్లో లోపమేమన్నా ఉన్నదా? అన్నది కూడా ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. మజుందార్ కాలం నాటి బాల్యంలోనే వృద్ధాప్య ఛాయలు ఉన్నాయేమో కూడా పునశ్చరణ చేసుకోవాలి. త్యాగాల్ని పొగడలేని, వైఫల్యాల్ని విమర్శించలేని ఒక విచిత్ర పరిస్థితిని సృష్టించగలగటంలో మాత్రం మావోయిస్టులు విజయం సాధించారు. భిన్నాభిప్రాయానికి 'ద్రోహం' అన్న ముద్ర వేసినంత కాలం, చర్చకు బదులు చీలికే మార్గం అని భావించినంత కాలం మావోయిస్టు పార్టీయే కాదు, మరే కమ్యూనిస్టు పార్టీ మనజాలదు.

• చెరుకూరి సత్యనారాయణ

24.49 లక్షల మందికి రూ.6,530 కోట్లు

19నెలల్లో ఉచిత వైద్యానికి చేసిన వ్యయం

- లబ్ధిదారుల సంఖ్యలో 21% వృద్ధి నమోదు
- 'గోల్డెన్ అవర్' విధానంతో సత్ఫలితాలు
- 18 నిమిషాల్లో రోగి వద్దకు అంబులెన్స్
- ఎన్టీఆర్ వైద్య సేవ, 108, 104 సేవలపై అధికారులతో మంత్రి సత్యకుమార్ సమీక్ష



అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 19 నెలల్లోనే ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా 24.49 లక్షల మంది ఉచిత వైద్యసేవలు పొందారని, వీరికోసం రూ.6,530 కోట్లు ఖర్చు చేశామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ఎన్టీఆర్ వైద్య సేవ, 108, 104 సేవలపై సంబంధిత అధికారులతో శనివారం ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. ఎన్టీఆర్ వైద్యసేవను పకడ్బందీగా అమలు చేయడంతో పాటు 108 సేవలకు సంబంధించిన టెండర్‌లో కఠిన నిబంధనలు విధించడంతో ఈ సేవలు ఎంతో మెరుగుపడ్డాయని వివరించారు. సగటున నెలకు 1.16 లక్షల మందికి నగదు రహిత వైద్య సేవలు అందడంతో లబ్ధిదారుల్లో 21శాతం వృద్ధి నమోదైందని చెప్పారు. 'గత వైసీపీ ప్రభుత్వంలో 2022-24 మధ్యకాలంలో ఆరోగ్యశ్రీ కింద 23.08 లక్షల మంది లబ్ధి పొందారు. సగటున నెలకు 96,205 మందికి సేవలు అందాయి. అప్పట్లో ఆరోగ్యశ్రీ కింద నెలకు సగటున రూ.193 కోట్లు ఖర్చు చేయగా, కూటమి పాలనలో నెలవారీ ఖర్చు రూ.330 కోట్లకు చేరింది. ఇందులో 60 శాతానికి పైగా పెరుగుదల నమోదైంది. గత ప్రభుత్వం కంటే ఏడాదికి రూ.2,124 కోట్లు ఎక్కువగా వ్యయం చేస్తున్నాం' అని సత్యకుమార్ వివరించారు. కూటమి ప్రభుత్వం 108 అంబులెన్స్ సేవల్లో అమలుచేస్తున్న గోల్డెన్ అవర్ విధానంతో సత్ఫలితాలు వస్తున్నాయని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పట్టణాల్లో ఫోన్‌కాల్ వచ్చిన తర్వాత 18 నిమిషాల్లో 108 అంబులెన్స్ రోగి వద్దకు చేరాల్సి ఉండగా సగటున 37 సెకన్ల ఆలస్యం నమోదైందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 23 నిమిషాలకు గాను సగటున 13 సెకన్లు ఆలస్యం అవుతోందని వెల్లడించారు.

అరబిందోపై కాగ్ ఆరోపణలు

గత ప్రభుత్వ హయాంలో 108 అంబులెన్స్‌ల పనితీరుపై గతేడాది జూన్‌లో విడుదల చేసిన నివేదికలో కాగ్ తీవ్రమైన ఆరోపణలు చేసిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. రోజూ సగటున 200 అత్యవసర కాల్స్‌కు అరబిందో సంస్థ స్పందించేది కాదని తెలిపారు. నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో 42 వాహనాలు రిపేరుకు కూడా పనికిరాకుండా పోగా, 615 అంబులెన్స్‌లకు మేజర్ రిపేర్లు, 103 వాహనాలకు మైనర్ రిపేర్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

టూరిజం హబ్‌గా పోలవరం: నిమ్మల

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): టూరిజం హబ్‌గా పోలవరం ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ఈనెల ఏడున పోలవరం ప్రాజెక్టు సందర్శనకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా పోలవరం పనుల పురోగతిపై అధికారులతో మంత్రి నిమ్మల సమీక్షించారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను రైతులు తన దృష్టికి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించామని వెల్లడించారు. లైడార్ సర్వే చేపట్టి శంకరగుప్తం ఉప్పునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును టూరిజం హబ్‌గా మార్చేందుకు వీలుగా లైడార్ సర్వేను చేపడతామన్నారు. పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ వైపున ఉన్న ప్రధాన కట్టడాలను కలుపుతూ రూ.548 కోట్లతో లింక్ రోడ్ పనులు చేపడతామన్నారు.







'భోగాపురం' రెడీ!

నేడు విమానాశ్రయంలో ట్రయల్ రన్

- ఢిల్లీ నుంచి తొలి వాణిజ్య విమానం
- అందులో కేంద్ర మంత్రి రామ్మోహన్, పలువురు ప్రముఖుల రాక
- రికార్డు సమయంలో పనులు.. 96% పూర్తి
- తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా నిర్మాణాలు

(విశాఖపట్నం/విజయనగరం-ఆంధ్రజ్యోతి)

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం రికార్డు సమయంలో పూర్తికాబోతోంది. ప్రస్తు తం 96 శాతం సిద్ధమైంది. ఆదివారం ఉదయం తొలి వాణిజ్య విమానం ట్రయల్ రన్‌కు రానుంది. అందులో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రానున్నారు. మరో రెండు నెలల్లో అన్ని పనులు పూర్తి చేసుకొని జూన్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ ఐ.ప్రభాకరరావు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయాన్ని విలేకరులకు చూపించి, నిర్మాణ వివరాలు తెలియజేశారు. భోగాపురం విమానాశ్రయాన్ని మూడు దశల్లో పూర్తి చేస్తారు. మొదటి దశ నిర్మాణం ఇప్పుడు పూర్తయింది. ప్రస్తుతం ఏడాదికి 6 మిలియన్ల ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు సమకూరుస్తున్నారు. మూడో దశ పూర్తయ్యేసరికి 48 మిలియన్ల ప్రయాణికులకు అవసరమైన వసతులు కల్పిస్తారు. ఈ విమానాశ్రయాన్ని నిర్మించి నిర్వహించడానికి జీఎంఆర్‌తో 40 ఏళ్లకు ఒప్పందం చేసుకున్నారు. ఆ తరువాత మరో 20 ఏళ్ల కాంట్రాక్టు పొడిగిస్తారు. విమానాశ్రయానికి కేటాయించిన భూమిలో 1.3 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి రన్‌వే, భవనాల నిర్మాణానికి అనుగుణంగా భూమిని చదును చేశారు. ఇది ఈ ప్రాజెక్టులో అత్యంత క్లిష్టమైన పనిగా ప్రభాకరరావు పేర్కొన్నారు. నిర్మాణానికి రోజూ ఐదు వేల మంది కార్మికులు 24/7 పనిచేస్తున్నారు. వారిలో మూడు వేల మంది అక్కడే బస ఉంటున్నారు. ఇప్పటివరకూ 35 మిలియన్ల పనిగంటలు పూర్తిచేశారు. ఒక్క ప్రమాదం కూడా ఇంతవరకు జరగకపోవడం గమనార్హం.

తెలుగుదనం ఉట్టిపడేలా

భోగాపురం విమానాశ్రయంలో దిగగానే ఇది ఆంధ్రప్రదేశ్, కళల కాణాచి అని తెలిసేలే నిర్మాణాలు చేస్తున్నారు. దీనికి అల్లూరి సీతారామరాజు పేరు పెడుతున్నారు. విమానాశ్రయం ముందు ఆయన విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా విశాఖ జిల్లా ఏటికొప్పాక బొమ్మలకు ప్రసిద్ధి కావడంతో 19 మీటర్ల ఎత్తున ఆ బొమ్మలు పెట్టనున్నారు. విమానాశ్రయంలో ఫ్లోరింగ్ మొత్తం గ్రానైట్‌ను లేజర్ టెక్నాలజీతో కట్ చేసి సంక్రాంతి ముగ్గుల డిజైన్‌తో వేశారు. అదేవిధంగా పైకప్పునకు కూడా తెలుగిళ్ల ముందు కనిపించే ముగ్గుల్లా డిజైన్ చేశారు. టెర్మినల్ భవనంలో 120 మీటర్ల వెడల్పు, 6 మీటర్ల ఎత్తున డిజిటల్ స్క్రీన్లు పెట్టి, వాటిపై కూచిపూడితో సహా తెలుగు కళలన్నీ డిస్‌ప్లే అయ్యేలా చేయనున్నారు.

హుద్‌హుద్ గాలులు వచ్చినా తట్టుకునేలా

విశాఖపట్నంలో హుద్‌హుద్ తుఫాన్ వచ్చినప్పుడు గంటకు 240 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. దాంతో పెనుప్రమాదాలు జరిగాయి. అంతకంటే పెద్ద తుఫాన్ వచ్చి గంటకు 275 కి.మీ. వేగంతో గాలులు వీచినా తట్టుకునేలా టెర్మినల్ భవనం, అందుకు తగిన అద్దాలను బిగించారు. గంటకు 295 కి.మీ. వేగంతో గాలులు వీచినా తట్టుకుని నిలబడేలా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్ నిర్మాణం చేపట్టారు. సొంతంగా విద్యుత్ తయారు చేసుకునేందుకు ఐదు మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు పెట్టారు. జనాలను బట్టి ఆటోమేటిక్‌గా సర్దుబాటు చేసుకునేలా ఏసీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. రన్‌వే పొడవు 3.8 కి.మీ. పక్కనే ట్యాక్సీ ట్రాక్ మరో 3 కి.మీ. పొడవున నిర్మించారు. ఇప్పుడు గంటకు 10-12 విమానాలు రాకపోకలు సాగించే అవకాశం ఉంది. ఏప్రాన్‌లో ఏడు ఏరో బ్రిడ్జిలు, 18 టాక్సీ స్టాండులు నిర్మించారు.

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

2019 ఫిబ్రవరి 14న అప్పటి సీఎం చంద్రబాబు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రాథమిక పనులు జరుగుతుండగా రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారంలోకి రావడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ప్రభావం పడింది. పనులు నత్తనడకన సాగాయి.

వైసీపీ అధికారంలో ఉన్న తొలి నాలుగేళ్లు అంతలేని నిర్లక్ష్యం కొనసాగింది. ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయంగా ఇబ్బందులు వస్తాయని భావించి 2023 మే 3న మరోసారి ఎయిర్‌పోర్టు నిర్మాణానికి నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. కానీ పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. 20 నుంచి 26 శాతం మాత్రమే పనులు చేశారు.

కూటమి రాకతో మోక్షం

2024 జూన్‌లో ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో భోగాపురం ఎయిర్‌పోర్టుకు మళ్లీ మోక్షం వచ్చింది. ఎన్డీఏలో సైతం టీడీపీ కీలక భాగస్వామిగా మారింది. పౌర విమానయాన శాఖ మంత్రిగా టీడీపీకి చెందిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు అయ్యారు. ఇదే సమయంలో సీఎం చంద్రబాబు ప్రాధాన్య ప్రాజెక్టుగా భోగాపురం విమానాశ్రయాన్ని తీసుకున్నారు. ప్రస్తుతం ఎయిర్ పోర్టుకు సంబంధించి 2,200 ఎకరాల్లో పనులు దాదాపు కొలిక్కి వచ్చాయి. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో 500 ఎకరాలను అభివృద్ధి నిమిత్తం ప్రభుత్వ రిజర్వ్ భూమిగా ఉంచింది. దానిని పర్యాటక, ఇతరత్రా అవసరాల కోసం వినియోగించాలని భావిస్తోంది.

'ఫ్లయింగ్ ఫిష్ అవుటాఫ్ వాటర్' ఆకారంలో ..

ప్రపంచంలో ఏ విమానాశ్రయంలోనూ పైకప్పు భూమిని తాకేలా నిర్మించలేదు. భోగాపురంలో మాత్రం వాటికి భిన్నంగా నిర్మించారు. సముద్రంలో నుంచి పైకి ఎగురుతున్న డాల్ఫిన్ తిరిగి నేలను తాకినప్పుడు ఎలా ఉంటుందో ఆ నిర్మాణంలో.. 'ఫ్లయింగ్ ఫిష్ అవుటాఫ్ వాటర్' ఆకారంలో నిర్మించారు. ఈ టెర్మినల్‌లో ఒక్కో స్తంభం ఎత్తు 18 మీటర్లు. భవన విస్తీర్ణం 78 వేల చ.మీటర్లు. అందులో 22 చెకింగ్ కౌంటర్లు, 18 సెల్ఫ్ బ్యాగేజ్ డ్రాపింగ్ పాయింట్లు పెట్టారు. అధునాతన టెక్నాలజీతో ఇవన్నీ పనిచేస్తాయి. ఆటోమేటిక్ బోర్డింగ్ పాస్, బ్యాగేజ్ ట్యాగ్ వస్తాయి. ప్రతి లగేజీ బ్యాగ్... లోపల 6 కి.మీ. పరిధిలో పరీక్షలు పూర్తి చేసుకొని గమ్యం చేరుతుంది. అన్నీ ప్యాసింజర్ ఫ్రెండ్లీగా రూపొందించారు.

అందరి కృషితో..

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం ఉత్తరాంధ్ర ప్రజల కల. దానిని సాకారం చేసింది ఎన్డీఏ కూటమి ప్రభుత్వం. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు చొరవ ఫలితంగా ఇంత త్వరగా అందుబాటులోకి వచ్చింది. గతంలో పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతిరాజు సేవలు మరువలేనివి. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం సైతం అలుపెరగని కృషి చేసింది. అందరూ ఇందులో భాగస్వాములే.

- కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పౌర విమానయాన శాఖ మంత్రి



ఇచ్చిన మాట ప్రకారమే..

2024 ఎన్నికల్లో నాతో పాటు కూటమి పార్టీలపై నమ్మకంతో ఉత్తరాంధ్ర ప్రజలు వన్ సైడెడ్‌గా నిలిచి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం, ఇక్కడి యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని మీకు మాటిస్తున్నా. రహదారుల అనుసంధానంతో విజయనగరం-విశాఖపట్నం కలిసిపోతున్నాయి. బీచ్ కారిడార్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా. గుర్తుపెట్టుకోండి.. 2026 జూన్ లోపే భోగాపురం ఎయిర్‌పోర్టులో విమానాలు ఎగురుతాయి. - కూటమి గెలిచాక మొదటిసారి 2024 జూలై 11న భోగాపురం ఎయిర్‌పోర్టుకు వచ్చినప్పుడు చంద్రబాబు చేసిన వ్యాఖ్యలివి.

జూలై 11న భోగాపురం ఎయిర్‌పోర్టు సందర్శనకు వచ్చినపుడు మీడియాతో సీఎం చంద్రబాబు(ఫైల్)

గుంటూరు మెడికల్ కాలేజీకి

పూర్వ విద్యార్థుల భారీ విరాళం

- 100 కోట్లతో జీజీహెచ్‌లో డా. కానూరి- జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం నిర్మాణం
- 600 పడకలతో జీప్లస్ ఐదు అంతస్తులుగా భవనం
- తల్లి పాల బ్యాంక్.. కంగారూ మదర్ సెంటర్ కూడా
- 30న ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



రూపుదిద్దుకుంటున్న డాక్టర్ కానూరి జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం

గుంటూరు మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కాలేజీకి పూర్వ విద్యార్థులు వైద్య సేవలు కోసం భారీ విరాళం ఇచ్చారు. గుంటూరు వైద్య కళాశాల ఉత్తర అమెరికా పూర్వ విద్యార్థుల సంఘం (జింకానా) రూ.84 కోట్లు, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (జింకోసా) రూ.10 కోట్లు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.6 కోట్లు జోడించి మొత్తం రూ.100 కోట్లతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో డాక్టర్ కానూరి- జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం నిర్మించారు. జీ ప్లస్ ఫైవ్ అంతస్తులుగా 600 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ భవనంలో 95 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 320 పడకలు స్త్రీ ప్రసూతి విభాగానికి, 200 పడకలు శిశు వైద్య విభాగానికి, 80 పడకలు శిశు శస్త్రచికిత్స విభాగానికి కేటాయించారు. 9 అధునాతన ఆపరేషన్ థియేటర్లు, వైద్య బోధన కోసం 350 సీట్ల కెపాసిటీతో ఆడిటోరియం నిర్మించారు. అమెరికాకు చెందిన వైద్యురాలు గవిని ఉమాదేవి రూ.25 కోట్లు విరాళంగా ఇవ్వడంతో, ఆమె భర్త దివంగత డాక్టర్ కానూరి రామచంద్రరావు పేరిట ఈ ఆరోగ్య కేంద్రానికి నామకరణం చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో జింకానా అధ్యక్షుడు, ఎన్నారై డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ, జనవరి 30న సీఎం చంద్రబాబు కానూరి- జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తారని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ, ఈ ఆరోగ్య కేంద్రం కోస్తాంధ్రవాసులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. ఈ కేంద్రంలో నవజాత శిశువుల కోసం తల్లి పాల బ్యాంక్, కంగారూ మదర్ సెంటర్‌లను కూడా నిర్మించినట్లు తెలిపారు. దేశంలో మరే ఇతర మెడికల్ కాలేజీల్లో లేని విధంగా జింకానా పూర్వ విద్యార్థులు గుంటూరు జీజీహెచ్‌కు, వైద్య కళాశాలకు చక్కటి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జింకానా కోఆర్డినేటర్లు డాక్టర్ వి.బాలభాస్కరరావు, డాక్టర్ పీవీ హనుమంతరావు, కన్వీనర్ డాక్టర్ ఎస్.అమర్‌నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కానూరి-జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవ బ్రోచర్లను ఆవిష్కరించారు.

మళ్లీ అవే తప్పులు

(మొదటి పేజీ తరువాయి)

ఉదంతాలకు ప్రత్యక్ష నిదర్శనమిది. ఒకటి లేదా రెండు గ్రామాల్లో తప్పులు వచ్చాయంటే క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు ఏదో పొరపాటు చేసి ఉంటారనుకోవచ్చు. కానీ, జిల్లాలోని ప్రతీ మండలంలో ఏదో ఒక గ్రామంలో సగానికి సగం తప్పులే వస్తున్నాయంటే కారణం ఏమై ఉంటుంది? భూములు కొలిచేందుకు అనుసరిస్తున్న విధానం లేదా ఎంచుకున్న పద్ధతులే తప్పయి ఉంటాయి. ఉన్నతస్థాయి బాస్‌లకు ఈ విషయం తెలియదంటారా? తెలుసు. అయినా గప్‌చుప్! రీసర్వేలో తప్పులు వస్తున్నాయంటే సీఎం రెవెన్యూ ప్రతిష్ఠ పడిపోయిందని విమర్శిస్తారో అన్న భయమూ, తమ అసమర్థత బయటపడిపోతుందనే జంకూ దీనికి కారణాలు. దీంతో తప్పులు బయటకు రాకుండా తొక్కిపెట్టేస్తున్నారు. పైగా, రీ సర్వే మహా అద్భుతంగా సాగుతోందని కలర్‌ఫుల్ ప్రజంటేషన్‌లు ఇస్తున్నారు.

ముందు నిలిపివేసి...

రీ సర్వే, టైటిల్ చట్టం తీసుకొచ్చిన సమస్యలే జగన్ సర్కారు పతనానికి ప్రధాన కారణాలయ్యాయి. కూటమి సర్కారు అధికారంలోకి రాగానే భూముల సర్వే నిలిపివేసింది. రీసర్వే జరిగిన 6,700 గ్రామాల్లో సభలు పెడితే 8,75,900 పిటిషన్లు రైతుల నుంచి వచ్చాయి. రీసర్వే వల్ల ఇన్ని సమస్యలా... అని ప్రభుత్వం విస్మయానికి గురైంది. రీసర్వే నిలిపివేయడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధులు ఆగిపోతున్నాయని భావించిన ప్రభుత్వం.. మళ్లీ దానికే మొగ్గుచూపింది. జగన్ ప్రభుత్వంలా కాకుండా, రైతుల ప్రమేయంతో సర్వే చేస్తామని ప్రకటించింది. గత ఏడాదిగా 3,200 గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించింది. ప్రస్తుతం అత్యధిక గ్రామాల్లో రీ సర్వేలో తప్పులు వస్తున్నాయి. ఇది పరిమితికి మించి, సాధారణం కంటే పది రెట్లస్థాయిలో ఉంది. ఈ పరిస్థితిని సర్వే, రెవెన్యూ అధికారులు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. అప్పుడు ఆ పెద్దబాస్‌లు ఏం చేయాలి? తప్పులకు కారణాలు ఏమిటి? లోపం ఎక్కడుంది? పరిష్కారం ఎలా చూపాలనేది ఆలోచించాలి. కానీ అధికారులు మరోలా ఆలోచిస్తున్నారని తెలుస్తోంది. సమావేశాల్లో రీసర్వే తప్పులను బహిరంగంగా ఎత్తి చూపవద్దని మౌఖిక ఆదేశాలు ఇస్తున్నారు. ప్రస్తుతానికి నాలుగు జిల్లాల రెవెన్యూ, సర్వే అధికారులను తప్పులు ఎత్తిచూపిస్తున్న నేరానికి సస్పెండ్ చేస్తామని ఓ ఉన్నతాధికారి హెచ్చరించారు. అయితే, దీని వల్ల మరిన్ని సమస్యలు వస్తాయని గుర్తించిన తర్వాత, తప్పులు భారీగా వస్తోన్న జిల్లాల రెవెన్యూ, సర్వే అధికారులను అమరావతికి పిలిపించి మాట్లాడారు. తప్పులు వచ్చిన గ్రామాల రీ సర్వే రికార్డులను తెప్పించుకొని పరిశీలించారు. ఈ సమయంలో, అసలు లోపం ఎక్కడుందో గుర్తించాలి. రీ సర్వే శాస్త్రీయంగా జరుగుతోందా? రైతులకు నోటీసులు ఇచ్చే సర్వే చేస్తున్నారా? భూములను కొలిచేందుకు ఉపయోగిస్తున్న రోవర్‌లు, డీజీపీఎస్ యంత్రాలు, ఇతర సాంకేతిక పరికరాలు సరిగ్గా పనిచే స్తున్నాయా? అసలు సర్వేయర్, వీఆర్‌వోలు రైతుల వద్దకు వెళ్తున్నారా? అన్న అంశాలపై ఆరాతీయాలి. అందుకు భిన్నంగా తప్పులు రాకుండా చూసుకోవాలని, వాటి గురించి బహిరంగంగా మాట్లాడొద్దని నాలుగు జిల్లాల అధికారులను తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. అందులో తిరుపతి, తూర్పుగోదావరి జిల్లాల అధికారులు కూడా ఉన్నారని తెలిసింది. కొత్తగా రీ సర్వేచేయడానికి నోటిఫికేషన్‌లు ఇవ్వాలని ఆయా జిల్లాల అధికారులు ప్రతిపాదించగా, ఇందుకు ఉన్నతాధికారులు అంగీకరించలేదని సమాచారం.

బాధ్యత ఏదీ?

రైతుల భూములు కొలిచేందుకు ఏపీ సర్వే సరిహద్దుల చట్టం-1923 సెక్షన్ 6(1) కింద ముందస్తు నోటీసులు ఇవ్వాలి. రైతు పొలం కొలిచిన తర్వాత వచ్చే రీ సర్వే రిపోర్టును అందించడానికి సెక్షన్ 9(2) నోటీసు ఇవ్వాలి. రీ సర్వే రిపోర్టుపై రైతుకు పూర్తి భిన్నాభిప్రాయం ఉంటే సెక్షన్ 10 లేదా 11 కింద అప్పీల్ చేసుకోవాలి. ఆ అప్పీల్స్‌ను మండలస్థాయిలోని రీ సర్వే డీటీ సెటిల్ చేయాలి. అక్కడ రైతుకు న్యాయం దక్కకపోతే కోర్టుకెళ్లాలి. కానీ, అసలు రీ సర్వేలో ఊర్లకు ఊర్లే మార్చేస్తే? దీనికి పరిష్కారం ఏమిటన్నది చట్టంలో లేదు. అధికారులు దీనికి పరిష్కారం చూపడం లేదు. గ్రామంలో సర్వేపూర్తయిందని సెక్షన్ 13 కింద నోటీసు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు.

గతం పునరావృతం కానీయొద్దు..

రీసర్వే విషయంలో జగన్ ప్రభుత్వంలో జరిగిందే పునరావృతం అవుతోందని ఉత్తరాంధ్రకు చెందిన ఓ రెవెన్యూ అధికారి చెప్పారు. "సర్వే చట్టం ప్రకారం ముందు రైతుకు నోటీసు ఇవ్వాలి. ఆ తర్వాత రైతు సమక్షంలో సర్వే, రెవెన్యూ సిబ్బంది భూమిని కొలవాలి. అప్పుడే భూమి విస్తీర్ణం, సరిహద్దులు పక్కాగా వస్తాయి. దీని వల్ల గట్టు, విస్తీర్ణం గొడవలు రావు. ఈ రోజు ఎన్ని గ్రామాల్లో సర్వేయర్లు రైతులను వెంట తీసుకెళ్లి భూమిపై కొలతలు వేస్తున్నారు? అదే జరిగితే గ్రామాల్లో వేలాదిగా తప్పులు ఎందుకొస్తున్నాయి? అసలు రైతుల సమక్షంలో రీ సర్వే జరుగుతుందా? లేదా? అన్న అంశంపై రైతుల స్పందన తీసుకుంటే రీ సర్వేలో గుట్టు బయటపడుతుంది. రెవెన్యూ, సర్వేశాఖలు చేస్తోన్న సర్వే మంత్రాంగం అర్థమవుతుంది. ప్రభుత్వం రైతులను చిక్కుల్లో నుంచి బయట పడేయాలనుకుంటే తక్షణమే ఈ అంశంపై చర్యలు తీసుకోవాలి" అని ఉత్తరాంధ్రకు చెందిన ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చెప్పారు. ఆయన జగన్ ప్రభుత్వంలో జేసీగా, కలెక్టర్‌గా పలు జిల్లాల్లో పనిచేశారు. జగన్ ప్రభుత్వంలో రీ సర్వే లోగుట్టు గురించి బాగా తెలిసిన అధికారి. గతంలో జరిగిన పొరపాట్లే మరోసారి పునరావృతం కాకూడదని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జగన్ జమానాలో ఇలా..

నాడు జగన్ ప్రభుత్వం 2020 నుంచి 2024 ఏప్రిల్ వరకు భూముల సర్వే చేసింది. జగన్ మెప్పు కోసం కొందరు అధికారులు అడ్డగోలు తప్పులు చేశారు. రీసర్వే అద్భుతంగా సాగుతోందని ప్రజంటేషన్‌లు ఇస్తూ క్షేత్రస్థాయి సమస్యలు నాటి సీఎంకు తెలియకుండా తొక్కిపెట్టారు. రీ సర్వేలో తప్పులు వస్తున్నాయి అని చెప్పిన అధికారులను ఇతర కారణాలు చెప్పి సస్పెండ్ చేయించారు. రీసర్వే తప్పుల గురించి మాట్లాడొద్దని నాటి కలెక్టర్, జేసీల గొంతునొక్కారు. ఫలితంగా 6,700 గ్రామాల్లో 8.75 లక్షలపైనే తప్పులు వచ్చాయి. ఇప్పుడు ఈ సమస్యలను పరిష్కరించడం అసాధ్యంగా ఉంది. తప్పులను వెంటనే గుర్తించి, సరిచేస్తే రైతాంగానికి ఇంత నష్టం జరిగేది కాదు.

గుంటూరు చేరుకున్న మారిషస్ అధ్యక్షుడు

గుంటూరు, గన్నవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ రాష్ట్రానికి చేరుకున్నారు. ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు మంత్రి కందుల దుర్గేశ్ స్వాగతం పలికారు. అనంతరం ధరంబీర్ గోకుల్ ప్రభుత్వ కాన్వాయ్‌లో గుంటూరు చేరుకున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు తెలుగు మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా ఉపన్యసిస్తారు. ఆదివారం సాయంత్రం త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి, 5న గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు హాజరు కానున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో అశోక్, సీఎం చంద్రబాబుతో కలసి పాల్గొంటారు.

సీఎం పర్యటనపై వైసీపీ దుష్ప్రచారం: మాణిక్యరావు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు విదేశీ పర్యటనపై వైసీపీ సైకో బ్యాచ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడే దమ్ము లేక అసెంబ్లీకి రాకుండా మొహం చాటేస్తున్న వైసీపీ నాయకులు పిచ్చి ప్రచారాలతో సంతృప్తి పడుతున్నారని విమర్శించారు.

పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచాం: డోలా

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా-సీఎంఐఈ నివేదికలో పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలవడం గర్వకారణమని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల దృష్టి ఏపీపై నిలిచిందన్నారు. ఏడాదిన్నరలో 25 కీలక పారిశ్రామిక విధానాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. విద్యుత్తు రాయితీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా వేగవంతమైన అనుమతులు వంటి చర్యలతో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని తిరిగి సంపాదించిందన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యానికి వరం

- రాష్ట్ర కిసాన్ మోర్చా సదస్సులో బీజేపీ అధ్యక్షుడు మాధవ్

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భారతదేశం ప్రపంచంలోనే చాలా రకాల వ్యాధుల్లో మొదటి స్థానంలో ఉందని, పురుగు మందుల వాడకంతో ఉత్పత్తయ్యే పంటలను తినడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలో బీజేపీ అనుబంధ విభాగం రాష్ట్ర కిసాన్ మోర్చా నిర్వహించిన సేంద్రీయ వ్యవసాయ సదస్సుకు మాధవ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. 2014లో చంద్రబాబు ఏపీలో ఇదే పనిచేశారని గుర్తుచేశారు. సేంద్రీయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా కేంద్రం కసరత్తు చేస్తోందన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ.. సేంద్రీయ వ్యవసాయం చేసే ప్రతి రైతును ప్రోత్సహిద్దామని పిలుపునిచ్చారు. సదస్సులో ఏపీ గో ఆధారిత సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణరాజు, బీజేపీ నేతలు రమేశ్ నాయుడు, ప్రసాద్, పాతూరి నాగభూషణం పాల్గొన్నారు.

డీజీపీ ఆఫీస్ నుంచే రిమోట్ ఎఫ్‌ఐఆర్

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో న్యాయం జరగని బాధితులకు రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్ భరోసా కల్పిస్తోంది. కొత్త సంవత్సరం నుంచి రిమోట్ ఎఫ్‌ఐఆర్ పేరుతో మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలోనే కేసు రిజిస్టర్ చేస్తున్నారు. దీంతో బాధితులకు భరోసా లభించడంతో పాటు క్షేత్రస్థాయి పోలీసుల పనితీరులో మార్పు వస్తుందని విశ్వసిస్తున్నారు. రాష్ట్రంలో ఏ పోలీసుస్టేషన్‌లోనైనా ఫిర్యాదులు స్వీకరించకపోతే జిల్లా ఎస్పీకి విన్నవించాలని, అక్కడా పని జరగకపోతే పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సూచించారు. తగిన ఆధారాలతో రావాలని, అలా వస్తే తప్పకుండా రిమోట్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి స్థానిక పోలీసుస్టేషన్‌కు పంపుతామని చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా వచ్చినా ఫలితం ఉండదని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఇప్పటికే మూడు రిమోట్ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి సంబంధిత స్టేషన్‌కు పంపినట్లు తెలిపారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం: మంత్రి అచ్చెన్న

- ఉల్లి రైతులకు 128.33 కోట్ల మెగా చెక్కు పంపిణీ

కర్నూలు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉల్లి రైతులకు పంట నష్ట పరిహారం పంపిణీ సభను శనివారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధ్యక్షతన నిర్వహించారు. కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాల్లో ఉల్లి సాగు చేసి, ఆర్థికంగా నష్టపోయిన 37,752 మంది రైతులకు హెక్టారుకు రూ.50 వేలు చొప్పున రూ.128.33 కోట్ల మెగా చెక్కును రైతులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ... 'రాయలసీమ జిల్లాల్లో అకాల వర్షాలకు ఉల్లి రైతులకు తీరని నష్టం జరిగింది. కర్నూలు మార్కెట్‌లో ధరలు పడిపోయాయని తెలియగానే సీఎం చంద్రబాబు చలించిపోయారు. తక్షణమే క్వింటా రూ.1,200 మద్దతు ధర ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. నష్టపరిహారం హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించారు' అని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ కింద రెండు విడతల్లో రూ.14 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశామన్న ఆయన... ఫిబ్రవరిలో రూ.6 వేలు జమ చేస్తామని తెలిపారు. ఆయనతోపాటు పరిశ్రమల మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు.



మెగా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు

మాకేం తెలీదు.. జనర్ధానరావే చేశాడు!

- రెండో రోజు విచారణలో జోగి రమేశ్ సమాధానాలు
- మొత్తం జనార్దనరావుపైనే తోసేసే యత్నం
- నేటితో ముగియనున్న జోగి బ్రదర్స్ కస్టడీ
- నేడు తంబళ్లపల్లె కోర్టుకు తరలింపు

అన్నమయ్య/ములకలచెరువు, జనవరి 3(ఆంధ్రజ్యోతి):'మాకేం తెలియదు. గుర్తులేదు. అసలు ములకలచెరువు ఎక్కడుందో కూడా తెలియదు. అక్కడ మేమెందుకు నకిలీ మద్యం తయారు చేయిస్తాం. అద్దేపల్లి జనార్దనరావే తన స్నేహితుడితో కలిసి ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రం ప్రారంభించాడు' అని మాజీ మంత్రి జోగి రమేశ్ సిట్ ఉన్నతాధికారులకు చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులైన వైసీపీ నేతలు జోగి రమేశ్(ఏ32), అతని సోదరుడు జోగి రాము(ఏ33)లను రెండవ రోజైన శనివారం కూడా ఎక్సైజ్ కార్యాలయంలో సిట్ విచారించింది. నకిలీ మద్యం తయారీలో పాత్ర, ప్రధాన నిందితుడు జనార్దనరావుతో ఫోన్ సంభాషణలు, నగదు లావాదేవీలపై వివరాలు చూపించి అడగ్గా తనకు తెలియదని, ఏమీ గుర్తులేదని సమాధానం చెప్పినట్లు తెలిసింది. మొత్తం అద్దేపల్లి జనార్దన రావుపైనే తోసేసేలా సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ములకలచెరువు కేసులో జోగి సోదరులను విచారించి కీలక విషయాలు రాబట్టాల్సి ఉందని తంబళ్లపల్లె కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేయడంతో కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. దీంతో విజయవాడ జైల్లో ఉన్న జోగి సోదరులను శుక్రవారం నుంచి సిట్ విచారిస్తోంది. శనివారం కూడా ఇద్దరినీ సంయుక్తంగానూ, వేర్వేరుగానూ విచారించారు. ఆదివారం కూడా వీరిని విచారించి సాయంత్రం తంబళ్లపల్లె కోర్టుకు తీసుకురానున్నారు.

డీసీసీ అధ్యక్షుల నియామకం

- రాష్ట్రంలో 41 మంది పేర్లతో జాబితా విడుదల

న్యూఢిల్లీ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలు, వివిధ నగరాలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షులను నియమిస్తూ పార్టీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో మొత్తం 41 మంది పేర్లతో డీసీసీ అధ్యక్షుల జాబితాను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విడుదల చేశారు. 'సంఘటన్ సృజన్ అభియాన్'లో భాగంగా ఈ నియమకాలు చేపట్టినట్లు హైకమాండ్ తెలిపింది.

భాష ఓ ప్రపంచాన్ని సృష్టిస్తుంది

- బంధుత్వ బంధాలను ఏర్పాటు చేస్తుంది
- అది లేకపోతే గుర్తింపు, గౌరవం ఉండదు
- తెలుగు టీచర్లకు గౌరవమివ్వకుంటే అది సమాజమే కాదు
- జిల్లా కోర్టు వరకూ ప్రొసీడింగ్స్ తెలుగులోనే ఉండాలి
- ప్రపంచ తెలుగు మహాసభల్లో జస్టిస్ శ్రీ నరసింహ



తెలుగు తల్లి విగ్రహానికి నమస్కరిస్తున్న జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ గోడ రఘురాం, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, గజల్ శ్రీనివాస్, చలసాని ఆంజనేయులు, మా శర్మ తదితరులు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): 'భాష కేవలం భావ వ్యక్తీకరణే కాదు. దానికి ఒక ప్రపంచాన్ని సృష్టించగలిగే బలం ఉంది. మనం రెండు బంధాలతో పుడతాం. ఒకటి మాతృ బంధం అయితే... రెండోది భాషా బంధం' అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ అన్నారు. శనివారం గుంటూరులో ప్రారంభమైన తెలుగు మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు(గజల్) శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో జస్టిస్ శ్రీ నరసింహ మాతృభాష ప్రాధాన్యతను వివరించారు. 'రాజ్యాంగంలో మూడు ముఖ్యమైన విషయాలు గురించి చెప్పారు. ఒకటి స్వేచ్ఛ, రెండోది సమానత్వం. మూడో దానికి రాజ్యాంగంలో ఏ పదం వాడినా, వాడకపోయినా దానిని తెలుగులో బంధుత్వం అని చెప్పుకోవచ్చు. ఇది చాలా పెద్ద విషయం. బంధుత్వంలో ఉన్న తత్త్వం... కలిపి ఉంచడం. మనమందరం భాష వలన బంధువులం. బంధుత్వం వల్ల గుర్తింపు కలుగుతుంది. ఇతనెవరు అంటే... ఆ బంధం మూలంగా తెలుగువాడు అంటాం. భాష జీవం పోసుకొన్న మనిషిలాంటిదే. మనతోపాటే మనస్సులో, ఆత్మలో ఉంటుంది. వాడుక లేకపోతే మనిషిలానే క్షీణమైపోతుంది. అందుకే భాషని కాపాడుకోవడం చాలా ముఖ్యం. వాడుక లేనిదే భాష ఉండదు. మనకు గౌరవం, గుర్తింపు, బంధం ఉండదు. భాషని వాడుకలో ఉంచుకోవాలంటే పరిపాలన, అధికారిక వ్యవహారాల్లో తప్పనిసరి చేయాలి. జిల్లా కోర్టు వరకు ప్రొసీడింగ్స్ తెలుగు భాషలోనే ఉండాలి. పాఠశాలల్లో తప్పనిసరిగా తెలుగు భాషని అమలు చేయాలి. తెలుగు ఉపాధ్యాయులకు తగిన గౌరవం ఇవ్వడం లేదనేది నా భావన. తెలుగు టీచర్లకి కాళ్లు కడిగి దండం పెట్టాలి. తెలుగు ఉపాధ్యాయులను గౌరవించకపోతే అది సమాజమే కాదు. వారికి గౌరవం ఇచ్చి, కాపాడుకుంటే భాషను కాపాడుకోగలుగుతాం. మంచి నడవడిక తల్లిదండ్రుల పెంపకంలో ఉంటుంది. దానికి భాష తోడౌతుంది. చిన్నప్పటి నుంచి చందమామ పాటలు, చిన్న సామెతలు చెబితే అవి వ్యక్తిత్వంలో ఇమిడిపోతాయి' అని జస్టిస్ శ్రీ నరసింహ వివరించారు.

ఎన్‌టీఆర్ కళావేదికపై కార్యక్రమాలు అభినందనీయం: స్పీకర్ అయ్యన్న

తెలుగుని దేశ, విదేశాలకు చాటి చెప్పిన ఎన్‌టీఆర్ కళావేదికపై తెలుగు మహాసభ కార్యక్రమాలు జరుగుతుండటం అభినందనీయమని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. 'మాతృ భాషని మరిచిపోతే అమ్మని మరిచినట్లే. తెలుగు భాషని ఎలా ముందుకు తీసుకెళ్లాల్లో ఈ సభల్లో చర్చించి ఆ ప్రతిపాదనలను అందజేస్తే నేను అసెంబ్లీలో చర్చకు పెట్టి ఆమోదం పొందేలా చేస్తా. ఈ మూడు రోజులు ఇక్కడే ఉండి తెలుగు మహాసభలను పర్యవేక్షిస్తా' అని అన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురాం మాట్లాడుతూ... 'అనతికాలంలో జిల్లా స్థాయి కోర్టుల్లో తీర్పులు తెలుగులో ఇస్తే భాషకు కొంత ప్రోత్సాహం కలుగుతుంది. ఆ దిశగా మనం ప్రయత్నం చేయాలి. న్యాయవృత్తిలో ఉండే ఎన్నో కీలకమైన పదాలకు తెలుగు పర్యాయపదాలు అనువర్తింప చేసుకోవాలి' అని అన్నారు. కనీసం ఎనిమిదో తరగతి వరకు తెలుగు మీడియంలోనే పాఠశాలల్లో విద్యార్థులకు బోధన జరగాలని సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. కార్యక్రమంలో విశ్వయోగి విశ్వంజీ మహరాజ్, కొప్పరపు కవుల సాహితీపీఠం నుంచి మా శర్మ, మహాసభల సమన్వయకర్త రామచంద్ర రాజు, తానా పూర్వ అధ్యక్షుడు తోటకూర ప్రసాదు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన తెలుగు మహాసభలు

ఆంధ్ర సారస్వత పరిషత్ మూడో ప్రపంచ తెలుగు మహాసభలు - 2026 గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగర ప్రాంగణంలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతాలాపనలు, కవి సమ్మేళనాలతో ప్రాంగణమంతటా తెలుగుదనం తొణికిసలాడింది. తెలుగుతల్లి, వేంకటేశ్వరస్వామి, ఎన్‌టీ రామారావు విగ్రహాలతో ప్రధాన వేదిక కళకళలాడింది. మొత్తం ఐదు వేదికల మీద వివిధ కార్యక్రమాలు ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగాయి. దేశ, విదేశాల నుంచి తెలుగు భాషాప్రియులు తరలివచ్చారు.

ద్రౌపది ముర్ము జీవితం స్ఫూర్తిదాయకం

- ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు
- యార్లగడ్డ రచించిన 'అగ్ని సరస్సులో వికసించిన కమలం ద్రౌపది ముర్ము' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ, హరిబాబు

విజయవాడ, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మనోధైర్యాన్ని కోల్పోయి, జీవితాలను అర్ధంతరంగా ముగించుకుంటున్న యువతకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ఆదర్శంగా నిలుస్తుందని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన 'అగ్ని సరస్సులో వికసించిన కమలం ద్రౌపది ముర్ము' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడ కృష్ణవేణి విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం జరిగింది. ఈ పుస్తకాన్ని హరిబాబు ఆవిష్కరించారు. కాగా, తన లోని రచయితను గుర్తించి, లోకానికి తెలియజేసిన నేత హరిబాబు అని యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో 'ఎమెస్కో' విజయకుమార్, ఢిల్లీ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 4-1-2026 | పేజీలు: 8 + 8 | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 299 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ.12:30 తదుపరి విదియ, నక్షత్రం: పునర్వసు మ.3:11 తదుపరి పుష్యమి, వర్జ్యం: రా.10:35-12:04, దుర్ముహూర్తం: సా.4:21-5:05, అమృతఘడియలు: మ.1:00-2:27, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:50, సూర్యాస్తమయం: 5:49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బస్టాండ్ స్టాల్స్‌లో ఏటీఎం ఆకస్మిక తనిఖీలు


స్టాల్స్‌లో తనిఖీలు చేస్తున్న ఏటీఎం సాంబశివ, సిబ్బంది

గుంటూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పండుగలు పురస్కరించుకొని ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్ స్టాల్స్‌లో ఎంఆర్పీ ధరలపై అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) జి సాంబశివ శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా ఎస్టీఐ పూర్ణచంద్రరావు, కంట్రోలర్ జాన్సన్‌లతో కలిసి ఏటీఎం స్టాల్స్‌ను పరిశీలించారు. ధరల పట్టిక లేకపోవటం, అనధికారికంగా తినుబండారాలు విక్రయించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాల్స్‌లో పక్కాగా ఎంఆర్పీ ధరల పట్టికను ప్రదర్శించాలని, ఎంఆర్పీ ధరలకు మించి విక్రయాలు జరిపితే జరిమానాలు విధిస్తామన్నారు. పలు స్టాల్స్‌లో తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న నర్రా శ్రీనివాసరావు

గుంటూరు (విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజల్ని అప్రమత్తం చేసేలా ఇంజనీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని హైకోర్టు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు సూచించారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థికి భారత రాజ్యాంగం, చట్టాలపై ప్రాథమిక అవగాహన అవసరమని, రోజువారీ డిజిటల్ కార్య కలాపాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడిలు పాల్గొన్నారు.




సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిల్లి మాణిక్యరావు, ఎమ్మెల్యే గళ్ళా మాధవి


నివాళులు అర్పిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ తదితరులు

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన సావిత్రిబాయి పూలే

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ధీర వనిత సావిత్రీభాయి పూలే అని టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. సావిత్రి భాయి పూలే జయంతి కార్యక్రమం శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రిగా ఆమె సమాజ అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటమే సామాజిక బాధ్యతగా సావిత్రిబాయి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, కార్పొరేటర్లు పోతురాజు సమతా, ముప్పవరపు భారతి, వేములకొండ శ్రీనివాస్, యడ్లపల్లి సాంబశివరావు, మల్లిబోయిన శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు పశ్చిమ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల చదవాలి, చదువే విముక్తికి మార్గం అనే ఆశయంతో సావిత్రిబాయి పూలే ముందడుగు వేశారని గుర్తు చేశారు.

● గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలు, బాలికల విద్య కోసం అలుపెరగని కృషి చేసిన సావిత్రిబాయి పూలే మార్గంలో పయనించాలని సూచించారు.

● గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి ఒక్క విద్యార్థిని ఆదర్శంగా తీసుకోవాలని వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం కే.ప్రమీల సూచించారు. పాఠశాల ఆవరణలో శనివారం ఆమె జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ప్రమీల మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఒక పాఠశాలను ఏర్పాటు చేసి కట్టుబాట్ల వెనక వంటింటికే పరిమితమైన స్త్రీలకు చదువు ఒక్కటే నిజమైన కుటుంబ అభివృద్ధి, దేశ అభివృద్ధికి సూత్రమని నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పీ.రమేష్, విద్యా కమిటీ మెంబర్ ఆరుమళ్ళ చెంచు పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అట్టడుగు కులాలకు విద్యనందించిన చదువుల తల్లి సావిత్రిబాయిపూలే అని బీసీ యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు పావులూరి హనుమంతురావు కొనియాడారు. స్థానిక ఆర్ అగ్రహారంలో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకుని శ్రీసాయి విద్యానికేతన్ కరస్పాంటెండెంట్ మామిడి లీలావతి, ఇతర గురువుల సత్కార సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన మహిళలకు విద్యను అందించిన సావిత్రిబాయి పూలేకు భారతరత్న ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగలకుదురు సుశీల, ఎస్ వసుంధర రాణి, సుబ్బలక్ష్మీ, అన్నపూర్ణ, పద్మజ, భవానీ పాల్గొన్నారు.


జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ, ప్రజా సంఘాల నాయకులు

● గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మహిళలకు విద్యను నేర్పించిన ఘన చరిత్ర సావిత్రి భాయ్‌కే దక్కుతుందని జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు అన్నారు. హిందూ కాలేజీ ప్రధాన కూడలిలో పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేసి ఐ ల్యాండ్ నిర్మాణం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిందూ కాలేజీ సెంటర్‌లో గల మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని పూలే విగ్రహానికి, సావిత్రి బాయి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సావిత్రి బాయి పూలే సేవా సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ సుధా మాట్లాడుతూ నిస్వార్థ సేవకురాలు సావిత్రి భాయ్ పూలే కి పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించి ప్రసంగించిన వారిలో బహుజన పొలిటికల్ సెంటర్ కోర్డినేటర్ ఎస్.మాల్యాద్రి, శాలి వాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇందుర్తి వెంకట శివన్నారాయణ, భీమ్ సేన సేవా దళ్ అధ్యక్షుడు నల్లపు నీలంబరం, బహుజన ఐక్య వేదిక అధ్యక్షుడు గంటా ప్రభుదాసు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి, ఆర్పీఐ కార్యదర్శి విప్పర్ల ముత్తయ్యా, కుమ్మరి శాలివాహన రాష్ట్ర నేత పేరెళ్ల బసవేశ్వరరావు, నాయీబ్రాహ్మణ జేఏసీ గుంటూరు అర్బన్ కమిటి కార్యదర్శి టి.హరనాధ్ బాబు, జిల్లా నేత వై ఎల్ నారాయణ, ప్రజా పక్షం సామాజిక న్యాయ సంస్థ కార్యదర్శి ఎంఏఎస్ రెహమాన్, బహుజన సీనియర్ నాయకులు ఆర్‌కె, భీమ్ భారత్ జిల్లా నాయకురాలు రావినూతల కమల కుమారి, మదర్ థెరిస్సా సేవా సంఘం అధ్యక్షుడు సముద్రాల కోటేశ్వరరావు అనేకమంది ప్రముఖులు ఉన్నారు.

విద్యుత్ చౌర్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

● సీపీడీసీఎల్ విజిలెన్స్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు ప్రజలను చైతన్యపరిచి, మెరుగైన సేవలు అందించాలని సీపీడీసీఎల్ విద్యుత్ విజిలెన్స్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. గుంటూరు సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో విజిలెన్స్, ఇంజనీరింగ్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీడీపీఎల్ పరిధిలో 2025 ఏడాదిలో 9064 కేసులు నమోదు చేసి రూ.21.45 కోట్ల అపరాధ రుసుం విధించినట్లు అన్నారు. కొందరు గృహ విద్యుత్ వినియోగానికి సర్వీసు తీసుకొని వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని, దీనివల్ల సంస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు. విద్యుత్ చౌర్యంపై గుంటూరు జిల్లా ఈఈ ఎస్ఏ కరీమ్ 9440812263 కు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు సీహెచ్ వాసు, సుందరంబాబు, ఎం.బాస్కరరావు, రవికుమార్, మల్లికార్జునప్రసాద్, శ్రీనివాసరావు, శివశంకర్, ముద్రవీణ సతీష్‌కుమార్, కోటేశ్వరరావు, అనూష, బాస్కర్, రాజశేఖర్, మాధవి తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మూర్తి, ఇతర అధికారులు

కాసుల కృష్ణంరాజుకు పూర్ణ కుంభ పురస్కారం

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర నాయక శతక కర్త కాసుల పురుషోత్తమ కవి వారసుడైన గుంటూరుకు చెందిన మిమిక్రీ కళాకారుడు, ఈవెంట్ మేనేజర్ డాక్టర్ కాసుల కృష్ణంరాజుకు ఆంధ్ర శ్రీ-పూర్ణకుంభ పురస్కారం వరించింది. గుంటూరు, శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ, ప్రాంగణంలో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలలో శనివారం సాయంత్రం జరిగిన ఆంధ్ర శ్రీ పూర్ణకుంభ పురస్కారాల సభలో ఒడిస్సా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇతర అతిథుల చేతుల మీదగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. పురస్కారంతో పాటు జ్ఞాపికను, ప్రశాంస పత్రాన్ని అందుకున్నారు. తెలుగు వారందరికి కాసుల పురుషోత్తమ కవి సుపరిచితులని, ఆయన వారసుడిగా కాసుల కృష్ణంరాజు కళారంగంలో చేస్తున్న సేవలను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.


కాసుల కృష్ణంరాజుకు పూర్ణ కుంభ పురస్కారం అందజేస్తున్న డాక్టర్ కంభంపాటి హరిబాబు, స్పీకర్ అయ్యన్న పాత్రుడు

వేమూరి సుందరశాస్త్రికి....

వారణాసి తెలుగు సంఘం, ఆంధ్రా ఆశ్రమం, వారణాశి ద్వారా తెలుగు సంస్కృతి, భాష వికాసానికి విశేషంగా కృషి చేసిన వేమూరి వేంకట సుందర శాస్త్రికి ఆంధ్ర శ్రీ, పూర్ణ కుంభ పురస్కారం వరించింది. గుంటూరు, శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీ, ప్రాంగణంలో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలలో శనివారం జరిగిన ఆంధ్ర శ్రీ పూర్ణకుంభ పురస్కారాల సభలో ఒడిస్సా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఇతర అతిథుల చేతుల మీదగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు. పురస్కారంతో పాటు జ్ఞాపికను, ప్రశాంస పత్రాన్ని అందుకున్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వీడ్కోలు వేడుకలు

గుంటూరు(విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థినుల వీడ్కోలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్య క్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి హాజరైన ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసో సియేషన్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్య అనేది శక్తివంతమైన ఆయుధమని, బాలికలు స్వయం ఆధారంగా ఎదగాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌కే మస్తాన్‌వలి, ఆలపాటి శ్రీవాణి తదితరులు కళాశాల అభివృద్ధికి విరాళాలు ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని నవరంగ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు జలీల్ డిమాండ్ చేశారు. అధికార పార్టీ మోపుతున్న అక్రమ కేసులకు నిరసనగా శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అండతో చినకాకానిలో కొంత మంది భూ మాఫియా తెరలేపారని ఆరోపించారు. దీనిపై ఫిర్యాదు చేసేందుకు వెళితే నాపైనే కేసులు నమోదు చేశారని వాపోయారు. అధికార పార్టీ నిరంకుశత్వానికి నిరసనగా మార్చి 5న భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మినహా ఇతర జాతీయ పార్టీలు పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంటూరు(తూర్పు), జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై టీటీడీ దేవస్థానం ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శనివారం దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత పాలక మండలి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీపోత్సవంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయ బాబు, ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యనగర్‌లో కార్డెన్ సెర్చ్


కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్ డిఎస్పీ అరవింద్, సీఐ ఆరోగ్యరాజు

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్‌కు సంబంధించి డీఎస్పీ అరవింద్ నేతృత్వంలో అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంజీవయ్యనగర్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయా వాహనాలు కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మ కాలనీలో వివాహిత అదృశ్యం



దుర్గ (ఫైల్)


గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతమ్మ కాలనీకి చెందిన వివాహిత దుర్గ అదృశ్యమైంది. దుర్గారావుకు 9 సంవత్సరాల క్రితం దుర్గతో వివాహమైంది. దుర్గ 2వ తేదీ సాయంత్రం నుంచి కనిపించటం లేదని భర్త నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 8688831336లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

















గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లు

నేడు ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీ

- గుంటూరు, తెనాలిలో భారీగా ఏర్పాట్లు

గుంటూరు(విద్య), తెనాలి అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి పెద్దపండుగ.. సంక్రాంతిని పురస్కరించుకుని సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు సర్వం సిద్ధమైంది. గుంటూరు, తెనాలిలో ఆదివారం ముగ్గుల పోటీలు జరగనున్నాయి. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం, తెనాలిలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణం(బోస్‌రోడ్డు)లో పోటీలకు ఏర్పాటు చేశారు. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై: సన్‌ఫీస్ట్ మ్యాజిక్ మామ్స్ బిస్కెట్, టేస్ట్ పార్టనర్ స్వస్తిక్ మసాలా, ప్రేయర్ పార్టనర్ పరిమళ్ మందిర్ భారత్‌వాసి అగరబత్తీ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు ఇప్పటికే పలువురు మహిళలు పేర్లు నమోదు చేసుకున్నారు. ఆయా కేంద్రాల్లో 9 గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు యువతులు, మహిళలు మాత్రమే పాల్గొనాలి. కాగా గుంటూరులో నిర్వహించే ముగ్గుల పోటీలను వికాస్ హాస్పటల్(గుంటూరు), తెనాలి కేంద్రంలో జరిగే పోటీలకు అంగలకుదురు గణేష్ యూత్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. గుంటూరు, తెనాలి కేంద్రాల్లో పోటీలకు హాజరయ్యేందుకు వారం రోజులుగా మహిళలు పెద్దసంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారు. ఆయా కేంద్రాల్లో ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు నగదు అందజేస్తారు.



తెనాలి ముగ్గుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

125 రోజుల ఉపాధిపై.. అవగాహన

- రేపు వీబీ-జీరామ్‌జీ పథకంపై గ్రామసభలు
- గ్రామ సచివాలయాల్లో చర్చలకు ఏర్పాట్లు
- ఎంపీడీవోలు, డిప్యూటీల పర్యవేక్షణ

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

మారిన ఉపాధి పథకంపై పల్లెవాసులకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. సోమవారం అన్ని పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల్లో నిర్వహించే ఈ సభలకు పంచాయతీరాజ్ శాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వికసిత్ భారత్ రోజ్‌గార్ అజీవక మిషన్ గ్రామీణ్ (వీబీ - జీ రామ్‌జీ)గా ఉపాధి పథకం పేరును మార్చారు. ఈ ఏడాది నుంచి 100 నుంచి 125 రోజులకు ఉపాధి పని దినాలను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గ్రామ సభల ద్వారా జీరామ్‌జీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.



వికసిత్ భారత్ లక్ష్యంగా..

గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామ ప్రణాళికలో (మిగతా 4వ పేజీలో)

సభల నిర్వహణ ఇలా..

వీబీ-జీరామ్‌జీ 125 రోజుల ఉపాధి హామీ నిరుద్యోగ భృతి కోసం మెరుగైన ఏర్పాట్లు, సమయానికి కూలీ చెల్లింపు, ఆలస్య చెల్లింపులకు పరిహారం అంశాలను ప్రజలకు తెలియజేస్తారు. గ్రామ సభ ద్వారా వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళిక రూపొందిస్తారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ (పీఆర్‌ఆర్‌డీ) పర్యవేక్షణలో సభలు జరుగనున్నాయి. వీబీ-జీరామ్‌జీ చట్టం 2025 పై చర్చ, గ్రామ స్థాయిలో అమలుకు కార్యాచరణ ప్రణాళిక తయారీ, ఉపాధి హామీ చట్టం బలోపేతం, వికసిత్ భారత్ -2047 లక్ష్య సాధన ప్రధాన ఉద్దేశంతో గ్రామ సభలు జరుగనున్నాయి. సర్పంచులు, వార్డు సభ్యులు, ఎస్‌హెచ్‌జీ, గ్రామ ఆర్గనైజేషన్ కమిటీలు, కూలీలు, రైతులు, గ్రామ ప్రజలు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సభల నిర్వహణపై పల్లెల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. గ్రామ సభ నిర్వహణ ఖర్చుల కింద రూ.2వేలు మంజూరు చేశారు.



జ్యోతి ప్రజ్వలన చేసి మహా సభలను ప్రారంభిస్తున్న విశ్వంజీ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ శ్రీనరసింహ

తెలుగు.. వెలుగు

- అట్టహాసంగా ప్రపంచ తెలుగు మహాసభలు ప్రారంభం
- అలరించిన అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనలు
- ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన భాషాభిమానులు
- ఆకట్టుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ ప్రసంగం

గుంటూరు సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వేదికగా తేనెలొలుకు తెలుగుకు పట్టాభిషేకం జరిగింది. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న మాటను రుజువు చేస్తూ తెలుగు వెలుగులీనింది. అన్ని భాషలను అక్కున చేర్చుకుని పలుకులో ఇంత చోటిచ్చే తెలుగుతల్లికి ప్రణమిల్లేందుకు ప్రపంచం నలుమూలల నుంచి భాషాభిమానులు తరలి వచ్చారు. గుంటూరు నగర శివారు శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక నగర ప్రాంగణంలో ఆంధ్ర సారస్వత పరిషత్ మూడో ప్రపంచ తెలుగు మహాసభలు - 2026 గుంటూరు శివారులోని శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చనలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, గీతాల పాలనలు, కవి సమ్మేళనాలతో ప్రాంగణం అంతటా తెలుగుదనం తొణికిసలాడింది. మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీతాలాపానతో కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది. కవిత్వంలో లోతుగా.. గీతాల్లో మాధుర్యంగా.. కథనాల్లో జీవన సత్యంగా వెలిసిన తెలుగు భాష తరం నుంచి తరానికి వారసత్వంగా అందాల్సిన విలువన్న విషయాన్ని గుర్తు చేస్తూ కార్యక్రమాలు జరిగాయి. వినోదం పేరుతో భాష సులభీకరణకు లోనౌతున్న ఈ కాలంలో సరళత, సంపన్నతకు మధ్య సమతౌల్యత అవసరమని మహాసభలు గుర్తు చేశాయి. పాఠశాల నుంచి ప్రజావేదిక వరకు, మాధ్యమాల నుంచి మానవ సంబంధాల వరకు ప్రతీ చోట తెలుగు తన సహజ స్వరూపంలో నిలబడాల్సిన అవసరంపై భాషాభిమానులు గళమెత్తారు. ఈ దిశగా ఆలోచన రేకెత్తించడంలో మహాసభలు కీలక పాత్ర పోషించి తెలుగు పిపాసులను అలరించాయి. గుంటూరు గడ్డపై నినదించిన ప్రతీ అక్షరం (మిగతా 4వ పేజీలో)

గుబాళించిన తెలుగు సౌరభం





- తెలుగు వైభవంపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

- మహాసభల ప్రారంభోత్సవ సభలో జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ ప్రసంగిస్తూ తెలుగు బోధించే ఉపాధ్యాయులకు సమాజంలో సముచితస్థానం ఇచ్చిన రోజునే మాతృభాషకు నిజమైన స్థానం దక్కుతుందన్నారు. తల్లి ఒడి మాతృభాష బోధనకు మొదటి బడి కావాలన్నారు. వతా తృభాష మాత్రమే మనుషుల మధ్య బంధాన్ని పదిలపరుస్తుందన్నారు. మాతృభాష ద్వారానే సరైన వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. కోర్టులో తెలుగు భాషను వాడటం ద్వారా కక్షిదారుడు తన కేసును న్యాయవాది ఎలా వాదిస్తున్నారో తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు.

రింగ్‌రోడ్డు.. మూడో దశకు మోక్షం

- రూ.48 కోట్లు మంజూరు.. పనులకు శంకుస్థాపన
- పార్కుల అభివృద్ధికి చర్యలన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- పట్టణాల్లో స్వచ్ఛమైన తాగునీరు, వర్ధాల నిర్వహణ అవసరం : మంత్రి నారాయణ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి నిరీక్షణకు తెరదించుతూ ఎట్టకేలకు ఇన్నర్ రింగ్ రోడ్డు మూడో దశకు మోక్షం కలిగింది. ఎన్నికల సమయంలో గుంటూరు ఎంపీగా పోటీ చేసిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా ఈ రోడ్డు పనులకు సీఆర్‌డీఏ నుంచి రూ.48 కోట్లు మంజూరు చేయించారు. దీంతో శనివారం ఈ రోడ్డు



ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్ 3కి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ ఎమ్మెల్యేలు , కలెక్టర్ తదితరులు

అభివృద్ధి చేసేందుకు శిల్పారామం జంక్షన్ దగ్గర అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.65 వేల కోట్లతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బీఆర్ స్టేడియం అభివృద్ధికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని సూచించామన్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ మాట్లాడుతూ పురపాలక సంఘాల్లో వస్తున్న ఆదాయం అక్కడే ఖర్చు చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మున్సిపల్ పట్టణాల్లో స్వచ్ఛమైన తాగునీరు, వర్ధాల నిర్వహణ, మురుగునీటి యాజమాన్యం అవసరమన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఇన్నర్‌రింగ్ రోడ్డు మూడో దశ కూటమి ప్రభుత్వంలో సాకారమైందన్నారు. నగరంలో ఐదు ఫ్లైవోర్ బ్రిడ్జిలు, మరో మూడు ఓవర్ బ్రిడ్జిలను పెమ్మసాని మంజూరు చేయించారన్నారు. నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) మాట్లాడుతూ అమృత్ పథకం కింద గుంటూరుకి రూ.625 కోట్లు వచ్చాయన్నారు. గుంటూరు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్ అహ్మద్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, కార్పొరేషన్ల చైర్మన్లు , కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఇన్నర్‌రింగ్ రోడ్డులో భారీ ర్యాలీ...

శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా రెడ్డిపాలెం జంక్షన్ నుంచి స్వర్ణ భారతినగర్ వరకు భారీ ర్యాలీ జరిగింది. ఓపెన్ టాప్ జీపుపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, గళ్లా మాదవి, నసీర్ అహ్మద్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు శ్రేణులకు అభివాదం చేశారు. అమరావతి రోడ్డులోని జంక్షన్ వద్ద ఎన్టీఆర్, వీఎమ్ రంగా, బీపీ మండల్ తదితరుల విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు.



విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

- ఉపాధ్యాయులకు డీఈవో డాక్టర్ సలీమ్ బాష సూచన

గుంటూరు(విద్య), జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో డాక్టర్ ఎస్కే సలీమ్‌బాష తెలిపారు. శనివారం బ్రాడీపేటలోని శారదా నికేతన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రాథమిక విద్యార్థులకు అమలవుతున్న 75 రోజుల జీఎఫ్ఎల్‌ను పరిశీలించారు. చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను ప్రతీ విద్యార్థికి నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ నమ్మకం కలిగే విధంగా విద్యా బోధన చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న బ్రహ్మంచౌదరి



సంక్షేమంలో.. వసూళ్లు

- పుష్కర కాలంగా ఒకే పోస్టులో
- లోసుగులు అనుకూలంగా మార్చుకుని సంపాదన
- ఆ అధికారి తీరుపై శాఖలోని ఉద్యోగులు ఆరోపణలు



గుంటూరు విద్య, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అక్కడ అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకమైనా, విజిలెన్స్ విచారణ అయినా, వార్డెన్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నా, బడ్జెట్‌ను నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేయాలన్నా.. ఆయన తలుచుకుంటే చాలు పని అయిపోతుంది. అయితే ఇందుకు ఆయన అడిగినంత ఇవ్వాలి. ఇదీ సంక్షేమ శాఖలో గత కొన్నేళ్లుగా జరుగుతున్న వసూళ్ల పర్వం. ఇతర శాఖ నుంచి వచ్చి సాంఘిక సంక్షేమశాఖలో పుష్కర కాలంగా ఒకే పోస్టులో పనిచేస్తూ కార్యాలయం మొత్తాన్ని తన చెప్పు చేతుల్లో పెట్టుకుని చక్రం తిప్పుతున్న ఓ అధికారి అక్రమాల వ్యవహారం ఇది. సుదీర్ఘకాలంగా ఒకే శాఖలో ఒకే చోట పని చేయడంతో శాఖలోని లోపాలు, లోసుగులు తనకు అనుకూలంగా మార్చుకుని సంపాదనే ధ్యేయంగా అధికారి వ్యవహరిస్తున్నాడని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారిని మాతృ శాఖకు బదిలీ చేయాలని డిమాండ్లు ఉద్యోగులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నుంచి వస్తున్నాయి.

అక్రమాలపై ఫిర్యాదులు

సాంఘిక సంక్షేమ శాఖలో గత ఏడాది ఐదుమందికి గ్రేడ్-1 ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతులు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈయన పనిలో పనిగా మరో ఐదుగురికి కలిపి మొత్తం పదిమందికి గ్రేడ్ వన్ ఆఫీసర్లుగా ఇచ్చినట్లు సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షలకు పైగా వసూలు చేశారని తెలిసింది. ఈ మొత్తంలో ఉన్నతాధికారికి కొంత ముట్టజెప్పి మిగతా సొమ్ము స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఔట్సోర్సింగ్ సిబ్బంది నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తాడని తెలిసింది. సాంఘిక సంక్షేమ శాఖ కు ప్రభుత్వం విడుదల చేసే నిధుల పంపకంలో ఈయనదే కీలకపాత్ర. నిబంధనల విషయం పక్కన పెట్టి కమీషన్లు ఇచ్చిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకే ఎక్కువ మొత్తం బడ్జెట్ కేటాయిస్తాడని ఆరోపణలు ఉన్నాయి. సస్పెన్షన్ గురైన వారికి ఇంక్రిమెంట్లు ఇవ్వకూడదు. అయితే ఈ అధికారి వాటిని పట్టించుకోడు. తనకు కాసులు ముట్టజెప్పిన వారికి ఇంక్రిమెంట్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేసులు, విజిలెన్స్ విచారణలు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోకుండా సదరు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు గ్రేడ్ వన్ ఉద్యోగోన్నతి ఇవ్వడంతోపాటు ఇంక్రిమెంట్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. హాస్టళ్లలో జమా ఖర్చులపై నిర్వహించే ఆడిట్ సమయంలో ఒక్కో వార్డెన్ నుంచి ఈ అధికారి రూ.1000 నుంచి రూ.2000 వరకు వసూలు చేసి అక్రమాలు బహిర్గతం కాకుండా మేనేజ్ చేస్తాడని ప్రచారం ఉంది. అంతే కాకుండా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఉద్యోగులు, ఉద్యోగుల సర్వీస్ రూల్స్ విషయంలో కూడా భారీ మొత్తంలోనే డబ్బులు వసూలు చేస్తాడని ఫిర్యాదులు ఉన్నాయి.

ఘోరం.. ఇద్దరు దుర్మరణం

నరసరావుపేట రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నరసరావుపేట రూరల్ ఎస్సై కిషోర్ వివరాల మేరకు.. మండలంలోని పమిడిపాడు గ్రామానికి చెందిన పల్లెపు కోటేశ్వరరావు(25), ఒంటిపులి కిరణ్(39) ఇద్దరూ ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై నరసరావుపేట నుంచి వినుకొండ వైపు వెళ్తున్నారు. గుంటూరు నుంచి వినుకొండ వెళ్తున్న లారీ వేగంగా వారిని ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పల్లెపు కోటేశ్వరరావు భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కోటేశ్వరరావుకు మూడేళ్ల పాప ఉంది. కిరణ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నాడు.



ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ కిషోర్

వేటకు సిద్ధం..ఇంతలోనే అనర్థం

● విద్యుదాఘాతంతో బోటు దగ్ధం ● రూ.50లక్షల ఆస్తినష్టం

నిజాంపట్నం(రేపల్లె), జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌లో వారం రోజుల వేటకు సిద్ధం చేసిన మెకనైజ్డ్‌బోట్ విద్యుదాఘాతంతో దగ్ధమైంది. నిండుగా సరుకులు, డీజిల్‌తో ఉన్న బోటు ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో అందులో ఉన్న మత్స్యకారులు భయభ్రాంతులు గురై బయటకు దూకేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఒక మత్స్యకారుడికి స్వల్పంగా గాయలయ్యాయి. వివరాల మేరకు.. శనివారం నిజాంపట్నం హార్బర్‌లో ఉదయం 10 గంటలకు మెకనైజ్డ్‌బోటులో 8మంది మత్స్యకారులు వేటకు బయల్దేరారు. ఇంతలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా బోటులో మంటలు చెలరేగాయి. 2వేల లీటర్ల డీజిల్ ట్యాంకర్లకు నిప్పు అంటుకుని.. బోటులో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. చేసేది లేక మత్స్యకారులు బోటు నుంచి దూకేశారు. గాయపడిన మత్స్యకారుడిని నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.50లక్షలపైనే ఆస్తినష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు చెబుతున్నారు. మత్స్య, మెరైన్ అధికారులు, ఇన్‌చార్జి తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.



దగ్ధమవుతున్న మెకనైజ్డ్‌బోటు

సముద్రపు ఒడ్డుకు మృతదేహం

కర్లపాలెం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరలి సముద్ర తీరప్రాంతానికి గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొచ్చిందని ఎస్సై రవీంద్ర తెలిపారు. శనివారం ఎస్సై తన సిబ్బందితో కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. సుమారు 35 ఏళ్ల ఉన్న పురుషుడి మృతదేహంపై నలుపురంగు ఫ్యాంట్, తెలుపు రంగు ఆఫ్‌షర్ట్ ఉన్నట్లు వెల్లడించారు. గుర్తించిన వారు తన నంబరు 94409 00870కు సమాచారం అందించాలని సూచించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవీంద్ర

వాజ్‌పేయి విగ్రహ దిమ్మె తొలగింపు

● పనులు అడ్డుకున్న మునిసిపాలిటీ

నరసరావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలో భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు కోసం నిర్మిస్తున్న దిమ్మెను మునిసిపాలిటీ కూల్చివేసింది. వినుకొండ రోడ్డులో డివైడర్ తొలగించి వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు కోసం బీజేపీ పనులు చేపట్టింది. ఎటువంటి అనుమతులు లేకుండా వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు చేయడాన్ని మునిసిపాలిటీ అధికారులు అడ్డుకున్నారు. మునిసిపల్ ప్రత్యేక అధికారి, ఆర్డీవో మధులత స్వయంగా దిమ్మె తొలగింపు పనులను పర్యవేక్షించారు. అనుమతులు లేని కారణంగా దిమ్మెను తొలగించడం జరిగిందని మునిసిపల్ అధికారులు తెలిపారు. దీనిని బీజేపీ నేతలు ఖండించారు. ముందుగా విగ్రహం అనుమతుల కోసం దరఖాస్తు చేశామని వారు చెబుతున్నారు. కాగా, విగ్రహ ఏర్పాటుకు కోసం బీజేపీ నిర్వహించిన భూమి పూజలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొని పనులు ప్రారంభించారు. విగ్రహ దిమ్మె కూల్చివేతపై బీజేపీ, టీడీపీ అధిష్టానాలు దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ నేతలతో సాయంత్రం స్థానిక అధికారులు చర్చలు జరిపారు. వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రంలో అయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే నరసరావుపేటలో వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటు చేస్తుండగా అడ్డుకోవడం సరైనది కాదని సదరు పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. వాజ్‌పేయి విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వినుకొండ రోడ్డులో వాజ్‌పేయి విగ్రహం దిమ్మె తొలగింపు

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 561 అడుగులు

విజయపురిసౌత్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 561.00 అడుగులు ఉంది. ఇది 234.81 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9500, ఎడమ కాలువ ద్వారా 6949, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 17,056, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సి ద్వారా 300 మొత్తం ఔట్‌ఫ్లో 36,205 క్యూసెక్కులుగా ఉంది. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 36,205 క్యూసెక్కులుగా ఉంది.

ఏఎన్‌యూలో ప్రాంగణ ఎంపికలు

ఏఎన్‌యూ, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున వర్సిటీలోని సివిల్, మెకానికల్ బ్లాక్‌లో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన విజయ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ గుంటూరు, విశాఖపట్నంలో తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగా సీఈవో వియ్‌భార్గవ్ ఇంటర్వ్యూలు చేపట్టారు. రాత పరీక్ష ద్వారా అర్హత సాధించిన 44 మంది విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి.. ఎంపికైన వారికి ఈ నెల 15 నుంచి రూ.15 వేల స్టైఫండ్‌తో ఇంటర్న్‌షిప్, జూన్ నుంచి రూ.3లక్షల ప్యాకేజీతో ఉద్యోగం కల్పించనున్నట్లు ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లింగరాజు కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం..గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ చేస్తున్న సీఈఓ విజయ్ భార్గవ్

న్యూఇయర్ పార్టీకి డబ్బు డిమాండ్.. బాలిక ఆత్మహత్యాయత్నం

తెనాలి క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని గత నెల 31న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీనిపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో అదే పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బాలిక నుంచి ప్రేమ పేరుతో తరచూ నగదు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. న్యూయిర్ పార్టీ చేసుకోవాలంటూ బాలికను రూ.2,500 అతను డిమాండ్ చేశాడు. అయితే బాలిక అంత ఇవ్వలేనని.. రూ.వెయ్యి ఇస్తానని సమాధానం ఇచ్చింది. చెప్పిన మొత్తం ఇవ్వకపోతే తను చదువు మానేస్తానని, టీసీ తీసుకుని వెళ్లిపోతానంటూ బాలికను అతను బెదిరించాడు. బాలిక ఇన్‌స్టాగ్రామ్ చాట్‌లో బాలుడిని బతిమలాడినా వినకపోవడంతో ఎలుకల మందు తాగి.. ఆ వీడియో అతడికి పంపించింది. బాలిక ఎలుకల మందు తాగడం గుర్తించిన ఇరుగుపొరుగు.. ప్రభుత్వ వైద్యశాలకు ఆమెను తరలించారు. ఈ ఘటనపై పోక్సో కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

సారస్ మేళాను విజయవంతం చేయాలి

● జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సారస్ మేళా - 2026ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పటిష్టమైన ప్రణాళికతో బాధ్యతగా విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ మీటింగ్ హాల్‌లో ఆయన సారస్(సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు నల్లపాడు రోడ్డులోని రెడ్డి కళాశాల ఎదురుగా ఉన్న స్థలంలో లేఅవుట్ ప్రకారం స్టాల్స్, ఆహార పదార్థాల శాలలు, వెల్కమ్ లాంజ్, కంట్రోల్ రూం, సాంస్కృతిక ప్రదర్శన వేదిక, చిల్డ్రన్ పార్క్‌ల ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. స్టాల్స్ ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వస్తున్న వారికి వసతి కేంద్రాలను ఆదివారం సాయంత్రం నాటికి సిద్ధం చేయాలన్నారు. ప్రాంగణంలో విద్యుత్, అగ్నిమాపక, వైద్యశిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలన్నారు. వాహనాల పార్కింగ్, ట్రాఫిక్, గ్రౌండ్ మేనేజ్‌మెంట్ ప్రాంగణంలో 24 గంటలు బందోబస్తుకు అవసరమైన సిబ్బందిని పోలీస్ శాఖ నియమించాలని సూచించారు. నగరంలోని ప్రధాన సెంటర్లు, ఎగ్జిబిషన్ జరిగే రోడ్డులోనూ ఇరువైపులా ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఎగ్జిబిషన్ కన్వర్జన్స్ జోన్‌లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి రోజు ఒక శాఖ వారికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలు ప్రదర్శన చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లఖ్ పతీ దీదీల విజయగాథలు వివరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, జీఎంసీ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి, జడ్పీ సీఈవో జ్యోతి బసు, సెర్ప్ డైరెక్టర్లు పద్మావతి, సుధాకర్ తదితర ఇతర అధికారులు పాల్గొన్నారు.



మేళాపై సమీక్షిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

విద్యార్థులకు విజ్ఞప్తి ఫలితం

గుంటూరు(విద్య), జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు రూ.2 లక్షలు విలువ చేసే పుస్తకాలు, స్టేషనరీని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శనివారం అందజేశారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన అధికారులు పుష్పగుచ్ఛాలకు బదులు పుస్తకాలు తీసుకురావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దీంతో కలెక్టర్‌కు పుస్తకాలు, స్టేషనరీని అధికారులు ఇచ్చారు. వీటిని జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులకు పంపిణీ చేయాలని కలెక్టర్ సాంఘిక సంక్షేమశాఖ డీడీ చెన్నయ్యకు అందజేశారు.



డీడీ చెన్నయ్యకు పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

నవలోకం!

● నవలలపై ఆసక్తిచూపుతున్న యువత, విద్యార్థులు
● విజయవాడ పుస్తక మహోత్సవానికి భారీగా రాక
● నవలల కొనుగోలుకు ప్రాధాన్యం



పుస్తక ప్రదర్శనలో ఓ స్టాల్‌కి వచ్చిన యువత

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

విద్యకు సంబంధించిన పుస్తకాల కొనుగోలుపై ఇప్పటి వరకు ఆసక్తిని చూపించిన విద్యార్థి లోకం ఇప్పుడు నవలా లోకం వైపు అడుగులు వేస్తోంది. విద్యార్థులు, యువకులు నవలలపై ఆసక్తిని చూపిస్తున్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న 36వ పుస్తక మహోత్సవంలో శనివారం విద్యార్థులు, యువకులు గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచి వచ్చారు. ఒకటో నంబరు స్టాల్ నుంచి 170వ నంబరు స్టాల్ వరకు సందర్శించి నవలల పుస్తకాలను కొనుగోలు చేశారు. ఎక్కువ ఇంగ్లీష్ నవలలను తీసుకున్నారు. ప్రచురణకర్తలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నారు. గడచిన ఏడాది నుంచి యువత నవలలను బాగా కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇది ఊహించని పరిణామంగా పేర్కొంటున్నారు. పాఠశాల విద్యార్థులు డిటెక్టివ్, స్పై నవలల పుస్తకాలను కొనుగోలు చేయడం కనిపించింది. ఇప్పటికే యువత రచనల వైపు వస్తున్నారు. ఒకరి స్ఫూర్తితో మరొకరు కొత్తకొత్త రచనలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల్లో నవలా సాహిత్యంపై మక్కువ పెరగడం శుభపరిణామంగా ప్రచురణకర్తలు పేర్కొంటున్నారు. పుస్తక మహోత్సవం ప్రారంభం నుంచి వివిధ రకాల నవలా పుస్తకాలు ఎక్కువగా విక్రయాలు జరగడంతో వారు ఆనందంగా ఉన్నారు.

'స్పై' రచయిత నాగిరెడ్డి



ఆయన ప్రచురణ కర్త, రచయిత. ఈ రెండింటికి సంబంధం లేకుండా ప్రభుత్వ మాజీ ఉద్యోగి. పదవ తరగతిలోనే రచనలు ప్రారంభించి ఇప్పుడు ఒక పబ్లిషింగ్ హౌస్‌ను నిర్వహిస్తున్నారు. ఆయనే విజయవాడకు చెందిన శివరాం పబ్లిషింగ్ హౌస్ అధినేత ఎన్.ఎస్.నాగిరెడ్డి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం సమీపంలోని ఊబలంక నాగిరెడ్డి స్వగ్రామం. పదో తరగతి వరకు అక్కడే చదువుకున్నారు. ఆయన తొలి రచన సెంట్రల్ స్పై. డిటెక్టివ్ నవలలు రాయడంలో రచయిత మధుబాబుకు సరిసాటి. చందమామతో పాటు డిటెక్టివ్ నవలలు ఎక్కువగా చదవడంతో ఆయన ఆ రచనలు చేశారు. ఆయన రాసిన డిటెక్టివ్ నవల 'ఫైవేస్ టు హెల్'లో హీరోని చంపేసినట్టుగా చూపించారు. దీంతో పాఠకులు ఆయనకు ఉత్తరాలు రాశారు. తమ హీరోను చంపడానికి నువ్వెవరు అంటూ బూతులు తిడుతూ లేఖలు రాశారు. ఆయన 'పెట్రోల్ కిల్లర్స్' పేరుతో హీరోని బతికించారు. పాలిటెక్నిక్ చేసిన ఆయన 1972లో పంచాయతీరాజ్‌లో ఉద్యోగంలో చేరారు. 350 డిటెక్టివ్ నవలలు, 150 నవలలు, 50 సాధారణ పుస్తకాలు రాశారు. కొన్ని సందర్భాల్లో 24 గంటల్లో ఒక డిటెక్టివ్ నవలకు ఆయన రూపం ఇచ్చారు. ప్రస్తుతం ఆరు టైటిల్స్‌తో కథలు రాశారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితిని బట్టి ఆయన ముద్రణకు వెనకడుగు వేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న భారతీయ భాషా పరివార్

దేశంలో 28 రాష్ట్రాలు. 22 భాషలు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కో భాష. ప్రతి భాషలోనూ అనేక సొగబులు. ఇలా 28 రాష్ట్రాల భాషల నేపథ్యాన్ని, చారిత్రక ఘట్టాలను వివరిస్తున్న పుస్తకం భారతీయ భాషా పరివార్. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఉన్నప్పుడు రాసిన ఈ పుస్తకం నేషనల్ బుక్ ట్రస్ట్ ద్వారా మార్కెట్లోకి వచ్చింది. మొత్తం రెండు ఎడిషన్లలో ఈ పుస్తకాలను ఎన్‌బీటీ ప్రచురించింది. పుస్తక మహోత్సవాల్లోని స్టాల్ నెంబరు 29, 30లో ఈ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

పుంజుకు ఓ పుస్తకం



సంక్రాంతి అంటేనే కోడిపందేలు. గ్రామ గ్రామాల్లో కోడిపుంజులు ఎగిరెగిరి తన్నుకుంటాయి. ఇలా కోడిపుంజు కోసం ఓ ప్రత్యేక పుస్తకం పుస్తక ప్రదర్శనలో చేరింది. కుక్కుట శాస్త్రం పేరుతో జర్నలిస్టు శ్రీనివాస్ పుస్తకాన్ని రూపొందించారు. 80 రకాల కోళ్ల జాతుల పెంపకం, 37 జాతుల పందెం పుంజులు, 22 జాతుల నాటు కోళ్లు, అభివృద్ధి చేసిన 21 జాతుల కోళ్ల గురించి ఈ సంవత్సరంలో వివరించారు. స్టాల్ నంబరు 28లో ఈ కుక్కుట శాస్త్రం అందుబాటులో ఉంది. దీని వెల రూ.900.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

టీ10 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఏపీ టీమ్

తాడేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్ పట్టణంలో ఆదివారం నుంచి 7వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి టీ10 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో పాల్గొనేందుకు ఏపీ జట్టు శుక్రవారం రాత్రి పయనమైం దని.. రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరావు శనివారం తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందజేసి అభినందనలు తెలిపారు. టీమ్‌లో పలువురు గుంటూరు క్రీడాకారులున్నట్లు చెప్పారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రకాష్ మాట్లాడుతూ ఏపీ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు.



ఏపీ క్రికెట్ జట్టుకు క్రీడా దుస్తులు అందజేత

మహిళ అనుమానాస్పద మృతి

పొన్నూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండముది గ్రామంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటనపై రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. కొండమూది గ్రామానికి చెందిన కొమ్ము జయమ్మ (60) కుమారుడు నాగరాజుతో కలిసి నివసిస్తోంది. జయమ్మ ఇంటిలో అనుమానాస్పద రీతిలో మృతి చెందడంతో.. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. జయమ్మ భర్త ఇజ్రాయెల్ మూడేళ్ల క్రితం మృతి చెందాడు. మృతదేహంపై గాయాలు ఉండటంతో జయమ్మ హత్యకు గురైందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగావకాశాలు

➻ దయాగ్నస్టిక్ డిస్ట్రిబ్యూటర్ దగ్గర పనిచేయుటకు డెలవరీ బాయ్స్ కావలెను. సిటీలోని వారు మాత్రమే. సంప్ర॥ 7013786366.
KC-484

➻ HUDA DATE'S నందు డ్రైవర్ కమ్ సేల్స్ మ్యాన్ కావలెను. భోజనం మరియు వసతి కల్పించబడును. తగిన జీతం యివ్వబడును. HUDA Inpex & General Trading, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా. Cell : 96187 71495, 9491133960.
FA-69

➻ ఎలక్ట్రానిక్ కాటలు షాపు నందు పని చేయుటకు 10th or ITI వారు యువకులు కావలెను. బాబు సేల్స్, NTR బొమ్మ సెంటర్, గుంటూరు. సంప్ర॥ 92473 28868.
AJG-277207

➻ రియల్ ఎస్టేట్ కంపెనీలో లేడి టెలికాలర్స్ కావలెను. ఆఫీస్ టైమింగ్స్ 10am to 5pm. Salary : 10k to 15k PM అడ్రస్ : బ్రాడీపేట, 2/12, Phone : 9493049444
AJG-277206

➻ తెనాలి DSL బ్యాటరీస్ & సోలార్ ఎనర్జీస్ నందు మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : 10వేలు + ఇన్‌సెంటివ్స్, బస్టాండ్ రోడ్డు, గంగానమ్మపేట, ఉమ్మారెడ్డి కాంప్లెక్స్, తెనాలి. సెల్ : 8187011717.
AJG-277054

➻ TATA కంపెనీ లో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీమ్ లీడర్స్ కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. సంప్ర॥ 94908 66938.
AJG-239745

➻ ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు కావలెను. అర్హత : ఐ.టి.ఐ/ ఇంటర్ / డిప్లొమా / డిగ్రీ (పాస్ లేదా ఫెయిల్) విద్యార్థులు పార్ట్‌టైమ్‌గా కూడా చేసుకోవచ్చు. వేతనం: కమీషన్ ఆధారంగా. సంప్ర : 8977759977, 9618209171
AJA-257739

➻ అన్ని కాంపిటేటీవ్ ఎగ్జామ్స్, అన్ని ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌లకు సంబంధించి అన్ని సబ్జెక్టులలో బోధించుటకు Ph.D., లేదా P.G. లేదా గ్రాడ్యుయేట్ అర్హతగల అధ్యాపకులు కావలెను. రిటైర్డ్ అధ్యాపకులు, అనుభవం కలవారికి ప్రాధాన్యత. కావలసిన వారికి భోజనం మరియు వసతి కల్పించబడును. Cont : 8977759977, 9948497157.
AJA- 257738

బిల్డింగ్ డిమాలిష్

➻ పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగల కొట్టబడును మరియు పాత కలప, ఐరన్ రేకులు, సిమెంట్ రేకులు కొనబడును. ఫోన్ : 98494 81424, 80746 77449.
AJG-0277032

➻ కోటి పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగల కొట్టి నేలమట్టం చేయబడును. పాత దర్వాజాలు, కిటికీలు, కలప, ఐరన్ కొనబడును. సెల్లార్ తీయబడును. ఫోన్ : 99497 60367, 99664 33122.
RK-643

జిరాక్స్ మిషన్ అమ్మకం

➻ Canon XEROX Machine Model : 6575, న్యూ కండీషన్ గల జిరాక్స్ మెషీన్ అమ్మబడును. అడ్రస్: నగరాలు, గుంటూరు. Contact: 7981676749
AJH-003708

రియల్ ఎస్టేట్

➻ నూతన సంవత్సర శుభాకాంక్షలు, గుంటూరు జిల్లాలో శ్రీ భమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మీ లతీష్ గౌడ్, సెల్ : 9848986831
SJAA-347

➻ గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్‌లో సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లు అమ్మకానికి ! 12సం॥ అద్దె గ్యారంటీతో మీ పెట్టుబడికి భద్రత.. 12 నెలల అద్దె అడ్వాన్స్ మరియు ప్రతి రెండు సం॥లకు 10% అద్దె పెరుగదల పక్కా ! బ్యాంక్ లోన్ సదుపాయం. ఇది కేవలం ఇల్లుకాదు - గ్యారెంటీ ఆదాయ మార్గం సంప్ర॥ మానస సెల్. 89774 58385.
AJO-0268072

స్థలం అమ్మకము

➻ గుంటూరు కి 8Km చొడవరం, చిలకలూరు పేట NH మెయిన్ రోడ్, SBI బ్యాంక్ సైడ్, Nr. RVR ఇంజనీరింగ్ కాలేజీ, ఎదురుగా 2 ఎకరాలు (నల్ల చదరం) W/F అర్జెంట్ సేల్ సంప్ర :83094 94629.
AJV- 251798

వ్యవసాయ భూమి అమ్మకం

➻ బాపట్ల జిల్లా మేదరమెట్ల దగ్గర, దైవాల రావూరు గ్రామంలో 7 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. సంప్ర: 9908862323
AJH-15574

PLOT FOR SALE

➻ అతి తక్కువ ధరకే గుంటూరు జిల్లా, అంగలకుదురులో నాలుగు సెంట్లు స్థలం అమ్మకానికి కలదు. ఒక సెంట్ 5 లక్షలు. సంప్ర॥ 9515520741.
AAA-10423

➻ చ॥గ॥ 10999/- మాత్రమే ORR దగ్గరగా కొర్రపాడులో గుంటూరు To హైదరాబాద్ హైవే ఫేసింగ్ APCRDA & RERA వెంచర్ నందు ఓపెన్ ప్లాట్స్ కలవు. 70% లోన్, సంప్ర॥ 970 14 86 924
AAA-10422

➻ గుంటూరు కార్పొరేషన్ లిమిట్స్‌కి, అమరావతి ORR ki 1km దూరంలో CRDA అప్రూవ్డ్ ప్లాట్స్ అతి తక్కువ ధరకే కలవు. సంక్రాంతి, ప్రీ లాంచింగ్ ఆఫర్ 200 గజాలు, 26 లక్షలు మాత్రమే. 80% బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. 8877668869, 99495 75888.
AAA-10367

➻ గుంటూరు నుండి 6 కి.మీ. బుడంపాడు మెయిన్ రోడ్డు దగ్గరలో వెంచర్స్. 40 అ. 33అ. రోడ్లు, కరెంట్ సౌకర్యం. స్పాట్ రిజిస్ట్రేషన్. గజం 9వేలు, 15 వేలు మాత్రమే. సంప్ర॥ 83175 28192.
AAA-10360

➻ గుంటూరు to విజయవాడ హైవే పక్కన కాజా టోల్‌గేట్ దగ్గర CRDA అప్రూవ్డ్ వెంచర్ నందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ 70% బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. సంప్ర॥ 9701486924.
AAA-10187

FLAT FOR SALE

➻ 2BHK 1225 Sft Full Finished Apartment, 1st Floor, తూర్పు ఫేసింగ్ అమ్మబడును. వెంకటాద్రి నిలయం, గోరంట్ల, గుంటూరు. సెల్ : 94940 62831.
SA-104

లీకేజీ సమస్యలా?

➻ బాత్ రూమ్ లీకేజి గోడలపై చెమ్మ, శ్లాబ్ లీక్, శ్లాబ్ క్రాక్స్, వాటర్ ట్యాంకర్ లీక్, సంప్స్ లీక్, వాల్‌క్రాక్స్ ఎటువంటి లీకేజిపైనైనా 100% గ్యారంటీతో కెమికలింగ్ చేయగలము. సంప్ర॥ 9642458892
AJG-0267616

మీ సర్టిఫికేట్స్ పోయినవా?

➻ మీరు పోగొట్టుకున్నా / కాలిన / చిరిగిన 10, ఇంటర్, డిగ్రీ మొ॥ సర్టిఫికేట్స్ తెప్పించబడును. సర్టిఫికేట్స్ కరెక్షన్ & పేరు మార్పిడికి గైడెన్స్, స్టూడెంట్స్ సర్వీస్ సెంటర్, గుంటూరు. సెల్ : 98491 85616.
AJG-277033

CHANGE OF NAME

➻ I PUCHAKAYALA GOPI CHAND (old name) S/o Srinivasa rao R/o TERALA, D.No-4-37/8, Durgi, palnadu District have changed my name as PUCHAKAYALA CHANDRA SHEKHAR YADAV (New Name) for all purposes.
AJG-277169

పోయినవి

➻ మొరిశెట్టి వెంకట సురేష్ తండ్రి వెంకట సుబ్బారావు, డి.నెం. 12/29, శ్రీసాయి నిలయం, సంతపేట, నెల్లూరు జిల్లా. నా తాలూకా పెదకాకాని రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రార్ కాబడిన సర్వే నెం. 497, డాక్యుమెంట్ నెం: 9401/1982, ప్లాట్ నెం. 77 సంబంధించిన విక్రయ దస్తావేజు పోయినది. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్స్‌కు తెలియజేయగలరు 98662 31816, 9010868587.
AJG-GNT

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



బీఆర్ స్టేడియంలో క్రీడాకారులతో షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే నసీర్

బీఆర్ స్టేడియాన్ని తీర్చిదిద్దుతాం : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ స్టేడియం సత్వర అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. బీఆర్ స్టేడియాన్ని శనివారం ఉదయం ఎమ్మెల్యే నసీర్ సందర్శించారు. బీఆర్ స్టేడియంలో అవసరమైన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వెంటనే క్లీనింగ్ చేయించాలని, మొక్కలు పెరిగిపోవడంతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. ఇప్పటికే రూ.80 లక్షలతో చేపట్టిన రన్నింగ్ ట్రాక్ మరమ్మతుల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. యోగా సెంటర్ మరమ్మతులు, కాంపౌండ్ వాల్ కన్‌స్ట్రక్షన్ పనులు చేస్తామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడల్లో రిజర్వేషన్ కోటాను మూడు శాతం పెంచామని, ఇది క్రీడాకారులకు మేలు చేస్తుందని చెప్పారు.

బైక్ ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు 3వ దశ శంకుస్థాపనకు గుంటూరు పశ్చిమ నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఇన్నర్ రింగ్ రోడ్డు 3వ దశ పూర్తయితే గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డు 3వ దశ నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి తదితరులు

కాంగ్రెస్ జిల్లా, నగర సారధుల నియామకం

- జిల్లా అధ్యక్షుడిగా యన్నం సుధీర్
- నగర అధ్యక్షుడిగా ఎండీ ఖలీల్



యన్నం సుధీర్‌బాబు



ఎండీ ఖలీల్

గుంటూరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్టానం జిల్లా పార్టీ, నగర సారధులుగా కొత్త వారికి అవకాశం కల్పించింది. జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది యన్నం సుధీర్‌బాబును, నగర అధ్యక్షుడు మహమ్మద్ ఖలీల్‌లను నియమిస్తూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. చుట్టుగుంట శాంతినగర్‌కు చెందిన యన్నం సుధీర్‌బాబు న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ కాంగ్రెస్ లీగల్‌సెల్ నగర అధ్యక్షుడుగా పనిచేశారు. ఆయన ప్రస్తుతం జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. అలానే పొన్నూరు రోడ్డు హుస్సేన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ఇఫ్తికర్ అహ్మద్ (ఖలీల్) తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడిగా పని చేశారు. గత నగరపాలక సంస్థ ఎన్నికల్లో 12వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన గుంటూరు రానున్న నేపథ్యంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె శనివారం ఉదయం తొలుత గుంటూరు నగర శివారులోని శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సభల చివరి రోజు సోమవారం ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో అక్కడ బందోబస్తు, హెలిప్యాడ్ ఏర్పాటుని పరిశీలించి ఎస్పీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులతో చర్చించారు. సభా ప్రాంగణం పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ హనుమంతు, డీఎస్పీ అబ్దుల్ అజీజ్, తహసీల్దార్ సుభాని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.విజయలక్ష్మి, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖులకు ఘన స్వాగతం

నగరానికి శనివారం విచ్చేసిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, రాష్ట్ర శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుకు కలెక్టర్ అన్సారియా స్వాగతం పలికారు. బొమ్మిడాల నగర్ శ్రీ సత్య సాయి స్పిరిచ్యువల్ సిటీలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలలో పాల్గొనుటకు వీరిద్దరూ విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.సాయి కల్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.



సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ నరసింహకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతోన్న కలెక్టర్ అన్సారియా



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తోన్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్



శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడితో సమావేశమైన కలెక్టర్


ప్రసంగిస్తున్న శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు


ప్రసంగిస్తున్న విశ్వయోగి విశ్వంజీ మహరాజ్


ప్రసంగిస్తున్న తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్


ప్రసంగిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


ప్రసంగిస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురాం


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ, స్పీకర్ అయ్యన్న పాత్రుడు


ప్రసంగిస్తున్న ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు(గజల్) శ్రీనివాస్

తెలుగు.. వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

తెలుగు భాష చిరంజీవిత్వానికి ఇచ్చిన సమకాలీన ప్రమాణంగా చరిత్రలో నిలవాలన్న ప్రతిజ్ఞ ప్రతీ నోట ధ్వనించింది. మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో తొలి రోజు ప్రసంగాలు అందరిని ఆలోచింపచేశాయి. మొదటి రోజు ముఖ్యఅతిథిగా హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ పదునైన తెలుగు పదాలతో చేసిన ప్రసంగానికి కరతాళధ్వనులు మిన్నంటాయి. గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని ప్రశ్నిస్తూ, భవిష్యత్తుకు దారి చూపేలా సాగుతోన్న ఈ అక్షరయాత్రకు కేవలం జ్ఞాపకాలు కాకుండా జీవనశక్తిని అందించాలన్న తీర్మానంతో తొలి రోజు కార్యక్రమాలు ముగిశాయి.

ఎన్టీఆర్‌తో గుర్తింపు : అయ్యన్నపాత్రుడు

శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ తెలుగు భాషా పిపాసి అన్న నందమూరి తారక రామారావు అన్నారు. ఆయన దాన వీర శూరకర్ణలో చెప్పి ఒక్కో డైలాగు వింటుంటే తెలియని భావోద్వేగం కలుతుందన్నారు. ఆయన వల్లనే ప్రపంచంలో తెలుగు వాళ్లకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు.

పిల్లలే మన ఆర్మీ: విశ్వయోగి విశ్వంజీ మహరాజ్

తెలుగుని బతికించుకోవాలంటే పిల్లలు మాత్రమే మార్గమని విశ్వయోగి విశ్వంజీ మహరాజ్ తెలిపారు. తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు, భవిష్యత్తులో భాషకు సముచిత స్థానం కల్పించేందుకు ఇప్పటి నుంచే సాధన ఆరంభించాలన్నారు.తెలుగు భాషకు పట్టం కట్టేందుకు నేతలు ముందుకు రావాలన్నారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ తెలుగు భాష నేర్పడం బడి నుంచి కాదని, తల్లి ఒడి నుంచి ఆరంభం కావాలన్నారు. మాతృభాష నేర్చుకున్న వారే ఇతర భాషలను తేలికగా నేర్చుకోగలరని చెప్పారు. చిన్నతనం అనేక భాషలు నేర్చుకునేందుకు మంచి అవకాశం కాబట్టి తెలుగు భాషను నేర్పేందుకు తల్లిదండ్రులు చిన్ననాటి నుంచి ప్రయత్నం చేయాలన్నారు.

తరలివచ్చిన విద్యార్థులు

మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో విద్యార్థుల హాజరు శాతం ఎక్కువగా ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. తెలుగు భాషపై మమకారం, అనురాగం కల్పించాల్సింది వారిలోనే అన్న భావనతో కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను మహాసభలకు భారీ సంఖ్యలో తీసుకొచ్చాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ని కూడా విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. మహాసభలకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు(గజల్) శ్రీనివాస్, సమన్వయకర్త రామచంద్రరాజు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోడ రఘురాం, సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ, కొప్పరపు కవుల సాహితీపీఠం మా శర్మ, విజయా డైయిరీ అధినేత ఆంజనేయులు, అవధాని రెడ్డప్ప, కరిమెళ్ల వరప్రసాద్, ఎస్వీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన





మాతృభాషలోనే బోధన.. పాలన సాగాలి

ఒడిస్సా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

గుంటూరు(తూర్పు): మాతృ భాషలోనే భోదన.. పాలన సాగాలే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఒడిస్సా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభలో సాయంత్రం జరిగిన ఆంధ్రశ్రీ పూర్ణకుంభ పురస్కారాల సభలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సాహిత్యం, సంభాషణలపై అవగాహన కల్పించేలా కృషి చేయాలన్నారు. గవర్నర్‌గా కంటే తెలుగు వాడిగా ఎక్కువగా గర్వపడుతున్నానని, ఒక విధంగా తెలుగు వ్యక్తి కావడంతో ఈ పదవి వచ్చిందన్నారు. ప్రపంచ స్థాయిలో తెలుగును ఉన్నత స్థానంలో నిలిపిన నందమూరి తారక రామారావు అనే ఆస్తిని భావితరాలకు అందజేసేందుకు కృషి చేయాలన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తిరునాళ్లను తలపిస్తున్న ఈ మహాసభలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు భాషను పరిరక్షించాలని ఎన్టీఆర్ లిటరరీ ట్రస్ట్ అధ్యక్షుడు టీడీ జనార్థన్, జస్టిస్ ఆకుల శేషసాయి, జస్టిస్ సీహెచ్ మనవేంద్రనాథ్‌రాయ్, తమిళనా డులోని కృష్ణగిరి ఎంపీ గోపినాద్ తదితరులు పలు సూచనలు చేశారు.

వేడుకగా పురస్కారాల ప్రదానం

సంగీతం, సమ్మేళనం, తెలుగు పత్రిక, తెలుగు సాహితీ సంస్థ వంటి పలు సంఘాలకు పూర్ణ కుంభ పురస్కారాల ప్రదానం వేడుకగా జరిగింది. కాసుల పురుషోత్తమ కవి పురస్కారాన్ని కాసుల కృష్ణంరాజుకు, రంగస్థలంలో గుమ్మడి గోపాలకృష్ణకి, నాటక రంగంలో కందిమళ్ల సాంబశివరావుకి, నాయుడు గోపితో పాటు ఇతర రంగాల్లో దాదాపు 70 మంది ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేశారు.

125 రోజుల ఉపాధిపై అవగాహన

(మొదటి పేజీ తరువాయి)

అన్ని గ్రామల్లో చేపట్టే ప్రభుత్వ పథకాల అనుసంధానం, సాంకేతిక పరిజ్ఞానంతో శక్తి వంతం చేస్తారు. ఉపాధి హామీ 100 నుంచి 125 రోజులకు పెంచిన నేపథ్యంలో పని కోసం నమోదు చేసుకున్న కూలీకి 15 రోజుల్లో పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి చెల్లించే విధంగా చట్టం చేశారు. పథకంలో జల సంరక్షణ.. గ్రామీణ మౌలిక సదుపాయాలు.. జీవనోపాధి పెంపు.. వాతావరణ మార్పు పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం.. పారదర్శకత కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఉంది. వ్యవసాయ పనులకు ఏడాదికి 60 రోజులు వరకు అవకాశం కల్పిస్తారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎంజీ నరేగా పనులు పూర్తయ్యే వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాతే జీరామ్‌జీ కింద కొత్త పనులు చేపడతారు. ఈ అంశాలన్నిటిపై గ్రామ సభల్లో చర్చించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఆధునీకరించడం.. సరిదిద్దడం లక్ష్యం. భవిష్యత్‌కు సిద్ధంగా ఉన్న గ్రామీణాభివృద్ధి నిర్మాణాన్ని సృష్టించడం.. గ్రామీణ సమాజాలను శక్తి వంతం చేయడం.. 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థల ను పెంచడం లక్ష్యంగా గ్రామ సభలు జరుగనున్నాయి. ఇందు కు సబంధించిన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి రూ.8,500 కోట్ల నిధులు

పురపాలక శాఖా మంత్రి నారాయణ

గుంటూరు కార్పొరేషన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు అమృత్ స్కీం ద్వారా రూ.8500 కోట్ల నిధులు రానున్నాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ తెలిపారు. శనివారం గుంటూరులో రూ. 48 కోట్లతో చేపట్టనున్న ఇన్నర్‌రింగ్ రోడ్డు ఫేస్-3 కి జరిగిన శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ అమృత్ స్కీం కింద గుంటూరు నగరానికి త్వరలో రూ. 625 కోట్ల నిధులు మంజూరు చేస్తామన్నారు. డ్రెయిన్‌ల అభివృద్ధికి, కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు రానున్నాయని, ఈ నిధుల్లో కూడా గుంటూరుకు భారీగా కేటాయిస్తామన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల స్వచ్ఛత కింద రూ. 3వేల కోట్లు వివిధ రకాల పథకాల కింద రూ. వేల కోట్ల నిధులు మంజూరు కాలేదని గత పాలకులు నిర్లక్ష్యం వల్లే ఈ నిధులన్నీ రాకుండా పోయాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశానికి వచ్చిన పెట్టుబడుల్లో గత ఏడాదిలోగా 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు రావటం జరిగిందన్నారు. ఈ క్రెడిట్ అంతా విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమన్నారు. బటన్ నొక్కితే బ్రిడ్జీలు, రోడ్లు, ఉద్యోగాలు రావన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, రామాంజనేయులు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు

కార్యకర్తలకు టీడీపీతోనే గుర్తింపు

● కేంద్ర మంత్రి పెమ్మసాని ● కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బ్రహ్మంచౌదరి ప్రమాణం

తాడేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు గుర్తింపు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఇందుకు కార్యకర్త నుంచి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎదిగిన నాదెండ్ల బ్రహ్మంచౌదరి నేపథ్యమే నిదర్శన మని ఆయన పేర్కొన్నారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి పరిధిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఆంధ్రప్రదేశ్ కమ్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నాదెండ్ల బ్రహ్మంచౌదరి, మరో 13 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, తెలుగుదేశం క్యాడర్ ఆధారిత పార్టీ అని, వైసీపీలాగా లీడర్ ఆధారితం కాదని వ్యాఖ్యానించారు. టీడీపీలో చిన్నపాటి కార్యకర్త నుంచి ఉన్నత స్థానానికి ఎదిగిన వారు ఉన్నారని అన్నారు. నిబద్ధతతో నిజాయితీతో పనిచేస్తే పార్టీ అందరిని ఆదరిస్తుందని చెప్పారు. బ్రహ్మం చౌదరి ఏనాటి నుంచో పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డారని అందుకే ఆయనకు పదవి దక్కిందన్నారు. కార్పొరేషన్‌ల ద్వారా అందరికీ సహాయం చేయాలని చెప్పారు. విద్య, ఉద్యోగ, ఉపాధిపై దృష్టి సారించి యువతకు, రైతులకు, పేదలకు సాయపడాలన్నారు. పేదలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కార్పొరేషన్‌లపై ఉందని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్ర మంత్రి సవిత మాట్లాడుతూ, గత ఐదేళ్లు అరాచక పాలన చూశామని, నేడు కూటమి ప్రభుత్వంతో అభివృద్ధిని చూస్తున్నామని అన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బీజం పడిందన్నారు. యువగళం పాదయాత్రలో అలాగే పలు పార్టీ కార్యక్రమాలలో నాదెండ్ల బ్రహ్మం విశిష్టసేవలు అందించారని, అరాచక పార్టీ పాలనకు ఎదురు తిరిగారని కొనియాడారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ, జగన్ రప్పా.. రప్పా ప్రేలాపనలు మానాలని హితవు పలికారు. నాదెండ్ల బ్రహ్మం చౌదరి పసుపు సైనికుడని పార్టీ కోసం కష్టపడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మె ల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్, నక్కా ఆనందబాబు, నసీర్ అహ్మద్, ఎంఎస్ రాజు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జ్యోతుల నెహ్రూ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీడీ జనార్ధన్, ఎంపీ కేశినేని చిన్ని, కూటమి నేతలు లంకా దినకర్, కొమ్మారెడ్డి పట్టాభిరాం, పాతూరి నాగభూషణం, నన్నపనేని రాజకుమారి, అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, నన్నపనేని నాగేశ్వరరావు, పలువురు నేతలు, యువత, కార్యకర్తలు పాల్గొన్నారు.


కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

● కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

కాగా కార్పొరేషన్ డైరెక్టర్లుగా అడుసుమిల్లి శ్రీనివాస్ వెంకటరామారావు చౌదరి (రాజాన గరం), అజయ్ సజ్జా (నందిగామ), గరికపాటి సుదర్శన నాయుడు (శింగనమల), కాట్రేని లక్ష్మీకృష్ణ ప్రసాద్, కావూరి వాణిశ్రీ (ఏలూరు), బి.మనోహర్ నాయుడు (కదిరి), మేకా సూర్యభాస్కరరావు (మండపేట), మోటూరు పుణ్య శ్రీనివాసకుమార్ (వేమూరు), పోతుల వెంకన్న చౌదరి (జగ్గంపేట), పుచ్చనూతల గోపినాద్ చౌదరి (మార్కాపురం), పి.సూర్యనా రాయణ (ఆదోని), ధనేకుల వెంకటసుబ్బారావు (తాడికొండ), కుదరవెల్లి వెంక టేశ్వరరావు (రేపల్లె) ప్రమాణస్వీకారం చేశారు.


సభకు హాజరైన కూటమి పార్టీల శ్రేణులు

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

● శాప్ చైర్మన్ రవినాయుడు ● కేఎల్‌యూలో సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

తాడేపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా క్రీడలను, క్రీడాకారులను ప్రోత్స హిస్తుందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ప్రారంభమ య్యాయి. ఈ పోటీలను శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటి జాతీయస్థాయి ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించేందుకు ఇదో చక్కని వేదిక అన్నారు. ఈ పోటీలలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన 128 విశ్వవిద్యాలయాలు పాల్గొంటుండగా, 900 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు విచ్చేశారన్నారు. దేశంలోనే తొలిసారిగా రాత పరీక్ష లేకుండా హారిజాంటల్, రిజర్వేషన్ విధానం ప్రకారం మెగా స్పోర్ట్స్ డీఎస్సీ ద్వారా 421 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇటీవల విజయవాడలో పదేళ్ళ తరువాత నిర్వహించిన 87వ జాతీయ స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సీనియర్స్ మహిళల సింగిల్స్ విభాగం లో సూర్య చరిష్మ స్వర్ణ పతకం సాధిం చడం రాష్ట్రానికి గర్వ కారణమని పేర్కొన్నారు. అలాగే సీనియర్ టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు రన్న రప్‌గా నిలవడం రాష్ట్ర బాడ్మింటన్ ప్రతిభకు నిదర్శనమన్నారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించిందన్నారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు విశాఖపట్నంలో మూడు ఎకరాలు, పుల్లెల గోపిచంద్‌కు అమరావతిలో 12 ఎకరాలు, కిదాంబి శ్రీకాంత్‌కు తిరుపతిలో 5 ఎకరాలు, బ్యాడ్మింటన్ అకాడమీల నిర్మాణం కోసం భూమి కేటాయించామని శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.సారధివర్మ, కేఎల్ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ జాయింట్ సెక్రటరీ పున్నయ్య చౌదరి, ఎన్టీఆర్ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● తొలిరౌండ్‌లో 60 జట్లు విజయం

తొలిరోజు మొత్తం 128 జట్లు పోటీ పడగా, వాటిలో 60 జట్లు గెలుపొందాయి. నాలుగు జట్ల ఫలితాలు డ్రాగా ముగిశాయి. ఆదివారం రెండో రౌండ్ పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు.


బ్యాడ్మింటన్ ఆడుతున్న శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు

కొత్త ఏడాదికి శుభవార్తతో శ్రీకారం

- ఇదే స్ఫూర్తితో మరిన్ని పెట్టుబడుల సాధనకు కృషి
- ఏపీ టాప్‌లో నిలవడంపై సీఎం చంద్రబాబు



అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల సాధనలో దేశంలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందన్న వార్త రాష్ట్ర ప్రజలందరికీ గర్వించదగినదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీ నంబర్‌వన్ స్థానంలో ఉందంటూ బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదికను ఉటంకిస్తూ ఫోర్బ్స్ ఇండియా తాజాగా ప్రచురించిన కథనంపై స్పందించారు. కొత్త ఏడాదిని ఉత్తేజకరమైన శుభవార్తతో ప్రారంభిస్తున్నామని, పాలకుల విజన్, సంస్కరణల ప్రభావాన్ని ఇది ప్రతిఫలిస్తోందని ఎక్స్‌లో పోస్టు చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఎస్క్రో ఖాతాల ప్రకటన, తక్కువ సమయంలో అనుమతులు, ప్రోత్సాహకాలను అందించడం వంటివన్నీ పెట్టుబడుల్లో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాయని పేర్కొన్నారు. తమ వ్యాపారాభివృద్ధికి ఏపీని గమ్యస్థానంగా ఎంచుకున్న పెట్టుబడిదారులకు, వారు ఏపీపై ఉంచిన నమ్మకానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మైలురాయి ఒక ముగింపుగా భావించడం లేదని, నిరంతరం కొనసాగే పురోగతికి ఓ పునాదిగా భావిస్తున్నానని అన్నారు. ఈ స్ఫూర్తితో రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి, మరిన్ని పెట్టుబడులను రాబట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

ఏమ్మా.. కూలి ఎంత వస్తోంది?

- అనంతపురంలో మహిళా కూలీలకు మంత్రి పయ్యావుల పలకరింపు



అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు సమీపంలో మహిళా కూలీలతో మాట్లాడుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

కూడేరు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): "ఏమ్మా.. పొలంలో ఎంతసేపు పనిచేస్తున్నారు..? కూలి ఎంత వస్తోంది..?" అని మహిళా వ్యవసాయ కూలీలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అడిగి తెలుసుకున్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు సమీపంలో మెగా డ్రిప్ ప్రాజెక్టును శనివారం ఆయన పరిశీలించారు. ఆ సమయంలో వేరుశనగ పైరులో కలుపు తీస్తున్న మహిళా కూలీలను ఆయన పలకరించారు. వారితో కలిసి పొలంలో కూర్చుని మాట్లాడారు. ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీశారు. తల్లికి వందనం, పింఛన్లు తదితర పథకాలతో చేకూరుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలన ఎలా ఉందని ఆరా తీశారు. మహిళా కూలీలు స్పందిస్తూ.. పాలన బాగుందని, పథకాలు సక్రమంగా అందుతున్నాయని సంతోషంగా బదులిచ్చారు.

రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం

- అచ్యుతాపురం సెజ్‌లో ఘటన

రాంబిల్లి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సోడియం హైడ్రో క్లోరైడ్ రసాయనంపై నీరు పడడంతో ఈ ప్రమాదం సంభవించింది. మంటలు సమీపంలో ఉన్న సాల్వెంట్ ట్యాంకులకు అంటుకోవడంతో ఉద్యోగులు భయంతో బయటకు పరుగులు తీశారు. దట్టంగా పొగ వ్యాపించడం, మంటలు ఎగసిపడుతుండడంతో ఏం జరుగుతుందోనని అందరూ ఆందోళన చెందారు. అయితే, అగ్నిమాపక సిబ్బంది నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ప్రతి పదవీ బాధ్యతతో కూడినదే

- అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలి: కేంద్రమంత్రి పెమ్మసాని
- కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా బ్రహ్మంచౌదరి ప్రమాణ స్వీకారం
- 13 మంది డైరెక్టర్లు కూడా..

తాడేపల్లి టౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఏపీ కమ్మ సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నాదెండ్ల బ్రహ్మంచౌదరి బాధ్యతలు స్వీకరించారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లిలోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మరో 13 మంది డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ నేతలు, కార్యకర్తల సమక్షంలో వారు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రతి పదవీ బాధ్యతతో కూడినదని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని సూచించారు. బ్రహ్మంచౌదరి కార్యకర్త స్థాయి నుంచి కార్పొరేషన్ చైర్మన్ స్థాయికి ఎదిగారని, పార్టీలో కష్టపడిన కార్యకర్తకు గుర్తింపు ఉంటుందనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. బ్రహ్మం చౌదరి మాట్లాడుతూ కమ్మవారి సంస్కారాన్ని దెబ్బతీస్తూ, రాజకీయ భిక్ష పెట్టిన అధినేత కుటుంబాన్నే హేళన చేస్తూ వల్లభనేని వంశీ, కొడాలి నాని మాట్లాడారని, వారు క్షమాపణలు చెప్పాలని, లేకపోతే చరిత్ర హీనులవుతారని చెప్పారు. అందరినీ కలుపుకొని కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మంత్రి సవిత, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనంద్‌బాబు, నసీర్ అహ్మద్, ఎంఎస్ రాజు, జూలకంటి బ్రహ్మారెడ్డి, జ్యోతుల నెహ్రూ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీడీ జనార్థన్, కూటమి నేతలు లంకా దినకర్, కొమ్మారెడ్డి పట్టాభి, పాతూరి నాగభూషణం, నన్నపనేని రాజకుమారి, అఖిల కర్ణాటక కమ్మ సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, నన్నపనేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నాదెండ్ల బ్రహ్మంచౌదరిని సత్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

అంజన్న దయతో పునర్జన్మ

- విద్యుత్ ప్రమాదం నుంచి కాపాడారు
- గిరి ప్రదక్షిణ సాకారానికి కరసేవ చేస్తా
- అంజన్న కృపతో 2 రాష్ట్రాలు బాగుండాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్



అంజన్న ఆలయంలో పూజలు చేస్తున్న పవన్ కల్యాణ్, చిత్రంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు

జగిత్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజన్న(ఆంజనేయస్వామి) తమ ఇంటి ఇలవేల్పు అని.. గతంలో ఓ విద్యుత్ ప్రమాదం నుంచి ఆయన దయతోనే తనకు పునర్జన్మ లభించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కొండగట్టు అంజన్న దయతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శనివారం తెలంగాణలోని జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో రూ.35.19కోట్ల టీటీడీ నిధులతో దీక్ష విరమణ మండపం, 96 గదుల వసతి సముదాయ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. హైదరాబాద్‌లోని బేగంపేట నుంచి చాపర్ ద్వారా జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాల వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అనంతరం పవన్ కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కొండగట్టులో 'వాయుపుత్ర సదన్' పేరిట 98 వసతి గదులు, సుమారు 2 వేల మంది హనుమాన్ దీక్ష విరమణ చేసేవిధంగా మండప నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ మాట్లాడారు. గతంలో కొండగట్టు పర్యటన సందర్భంగా వసతి గదుల నిర్మాణం, అభివృద్ధి పనులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, టీటీడీ సహకారంతో నిధుల మంజూరుకు కృషి చేశానన్నారు. తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షిణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే కర సేవకుడిని అవుతానన్నారు. అనంతరం పవన్ నాచుపల్లి సమీపంలోని బృందావనం రిసార్ట్‌కు చేరుకున్నారు. తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన 148 మంది సర్పంచ్‌లు, ఉపసర్పంచులు వార్డు మెంబర్లతో భేటీ అయ్యారు. తర్వాత జనసేన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తెలంగాణ జన సైనికులకు అండగా ఉంటానని, ప్రతి ఒక్కరూ ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, బృందావనం రిసార్ట్ దగ్గర పవన్ అభిమానులు ఆందోళనకు దిగారు. తమను రిసార్ట్ లోపలికి అనుమతించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

డ్రగ్స్ కేసులో బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు

- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఈగల్ బృందం
- ఆది కుమారుడు సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు



హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డితో పాటు మరొకరు డ్రగ్స్ తీసుకుంటుండగా హైదరాబాద్ 'ఈగల్' బృందం అధికారులు శనివారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నానక్‌రాం గూడలోని గేటెడ్ కమ్యూనిటీలో కొంతమంది డ్రగ్స్ సేవిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో ఈగల్ బృందం అధికారులు రంగంలో దిగారు. నార్సింగ్ పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. గేటెడ్ కమ్యూనిటీలోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన పోలీసు బృందానికి సుధీర్ రెడ్డితో పాటు మరో వ్యక్తి డ్రగ్స్ తీసుకుంటూ కనిపించడంతో మత్తు పదార్థాలతోపాటు వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం.. పోలీసుస్టేషన్‌కు తీసుకువెళ్లి టెస్టులు చేయగా ఇద్దరికీ పాజిటివ్ వచ్చింది. దీంతో వీరిని డీ అడిక్షన్ కేంద్రానికి తరలించారు. సుధీర్‌రెడ్డి గతంలో రెండు సార్లు మత్తు పదార్థాలు తీసుకుంటూ పోలీసులకు పట్టుబడిన నేపథ్యంలో అతనిపై ఈగల్ బృందాలు నిఘాను కొనసాగించాయి. తాజాగా మూడోసారి పట్టుబడటంతో డీ అడిక్షన్ సెంటర్‌కు పంపించామని పోలీసులు తెలిపారు. మరోవైపు, సుధీర్‌కు డ్రగ్స్ సరఫరా చేసిన వారెవరు?, తరచు ఇంటికే ఎలా అందుతున్నాయి?.. అనే కోణంలో విచారణ చేస్తున్నట్టు ఈగల్ అధికారులు చెప్పారు.

గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం

డ్రగ్స్ నిర్మూలనకు ఇచ్ఛాపురం

- నాంది పలకాలి: హోం మంత్రి అనిత
- వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి
- అడ్డాగా మార్చింది: కేంద్ర మంత్రి రామ్మోహన్
- ముగిసిన 'అభ్యుదయం సైకిల్‌యాత్ర'
- 51 రోజుల్లో 1,300 కి.మీ. సాగిన యాత్ర

ఇచ్ఛాపురం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): "గంజాయి రహిత రాష్ట్రమే సీఎం చంద్రబాబు లక్ష్యం. దీనిలో భాగంగానే గతేడాది నవంబరు 12న ఉమ్మడి విశాఖ జిల్లా పాయకరావు పేట నుంచి ఇచ్ఛాపురం వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'అభ్యుదయం సైకిల్ యాత్ర'కు శ్రీకారం చుట్టాం." అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఇచ్ఛాపురంలోని సురంగి రాజా మైదానంలో శనివారం 'అభ్యుదయం సైకిల్ యాత్ర' ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. డ్రగ్స్ నిర్మూలనకు ఇచ్ఛాపురం నాంది పలకాలన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి కేపిటల్‌గా మార్చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తోందని అన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అనిత, రామ్మోహన్‌నాయుడు

'అభ్యుదయం' సాగిందిలా..

పోలీస్ శాఖ నిర్వహించిన అభ్యుదయం సైకిల్ యాత్ర నాలుగు జిల్లాల పరిధిలో 51 రోజులపాటు నిర్విరామంగా 1,300 కిలోమీటర్ల మేర సాగింది. గతేడాది నవంబరు 21న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభమైన యాత్ర.. శనివారం ఇచ్ఛాపురంలో ముగిసింది. విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీతోపాటు ఐదు జిల్లాల ఎస్పీల పర్యవేక్షణలో యాత్ర సాగింది. శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాది డిసెంబరు 15న ఈ సైకిల్ యాత్ర ప్రవేశించింది. దారి పొడవునా గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల రవాణా, వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై కళారూపాలతో అవగాహన కల్పించారు.

చిత్రజ్యోతి

SINCE 1965



ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి

రాజేంద్ర ప్రసాద్

రామ్ కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'సఃకుటుంబానాం'. మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మించారు. రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం కీలక పాత్రల్లో నటించారు. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'కుటుంబ నేపథ్యంలో వచ్చే సినిమాలను ఆదరించడానికి తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ముందుంటారు. రోజు రోజుకూ థియేటర్లు పెరుగుతున్నాయంటే ఈ చిత్రం ఎంత ఘనవిజయం సాధించిందో అర్థమవుతుంది. ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి' అని ఆకాంక్షించారు. దర్శకుడు ఉదయ్‌శర్మ మాట్లాడుతూ 'మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఒక సినిమా ఫ్యామిలీ ఆడియెన్స్‌కు నచ్చితే హిట్ అవుతుందనే నా నమ్మకం మరోసారి రుజువైంది' అని చెప్పారు. కార్యక్రమంలో నిర్మాత మహదేవ్ గౌడ్, హీరో రామ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కథను నడిపించే పాత్రలో



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించే సత్య, దర్శకుడు రితేశ్ రానా కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'జెట్లీ'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం గ్లింప్స్‌ను విడుదల చేసింది. సత్యను సీరియస్ యాక్షన్ మూడ్‌లో చూపిస్తూనే, దానికి రితేశ్ రానా మార్క్ హ్యూమర్‌ని జోడించిన తీరు ఆకట్టుకుంది. 'నువ్వు ఏ టైర్ హీరోవి?' అని అడిగితే 'జనరల్ కంపార్ట్‌మెంట్' అంటూ సత్య చెప్పిన డైలాగ్ నవ్వులు పూయిస్తోంది. రితేశ్ మాట్లాడుతూ 'మార్నింగ్ షోకు రండి... ప్రేక్షకులకు మంచి విందు భోజనం లాంటి అనుభూతిని మా సినిమాతో అందిస్తాం' అని అన్నారు. 'ఈ చిత్రంలో కథను నడిపించే పాత్రలో కనిపిస్తాను, డైరెక్టర్ విజన్‌ను ఫాలో అయ్యాను' అని సత్య తెలిపారు. 'సినిమా మొత్తం విమానంలోనే జరుగుతుంది, నవంబరులో విడుదల చేస్తాం' అని చెర్రీ అన్నారు.




'ఐ యామ్ కమింగ్'

కోలీవుడ్ అగ్రహీరో విజయ్ నటించిన తాజా చిత్రం 'జన నాయగన్' ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. 'ఐ యామ్ కమింగ్..' అంటూ తన రాజకీయ ప్రవేశంపై స్పష్టమైన క్లారిటీ ఇస్తూ తనదైన స్టైల్‌లో డైలాగ్ చెప్పి మెప్పించారు విజయ్. పూర్తి యాక్షన్, బలమైన భావోద్వేగాలతో నిండిన మాస్, పొలిటికల్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు హెచ్.వినోద్ ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ తమిళ, తెలుగు భాషల్లో భారీ బడ్జెట్‌తో నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. విజయ్ కుమార్తెగా మమిత బైజు నటించారు. ఈ నెల 9న విడుదలకానున్న ఈ చిత్రానికి సంగీతం అనిరుధ్. ప్రతినాయకుడుగా బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, రాజకీయ నేతగా ప్రకాశ్ రాజ్ నటించారు. ఇప్పటికే విడుదలైన మూవీ పోస్టర్స్, పాటలు, టీజర్ విజయ్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్న విషయం తెల్సిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

రెబెక్కా యాక్షన్



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'టాక్సిక్'. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్' అనేది ఉపశీర్షిక. మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్, కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై యశ్, వెంకట్ కే నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మార్చి 19న చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించి సినిమాలోని కీలక పాత్రధారుల ఫస్ట్ లుక్స్ విడుదల చేస్తున్నారు మేకర్స్. తాజాగా ఈ చిత్రం నుంచి తారా సుతారియా లుక్‌ను రిలీజ్ చేశారు. ఆమె ఇందులో రెబెక్కా పాత్రలో కనిపించనున్నారు. గన్ పట్టుకుని యాక్షన్ లుక్‌లో ఉన్నారామె. 'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్', 'తడప్', 'మర్జావన్' వంటి బాలీవుడ్ చిత్రాల్లో నటించారామె. ఈ సినిమాలో అక్షయ్ ఒబెరాయ్, టోవినో థామస్, నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత యశ్ నటిస్తున్న చిత్రమిదే కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.


మనసును తాకే మెలోడీ



శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన మైథలాజికల్ థ్రిల్లర్ 'త్రికాల'. మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధిక, శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. శనివారం చిత్రబృందం 'యాలే ఈ గుబులే ఎలో' అంటూ మనసును తాకే మెలోడీని విడుదల చేసింది. రాకేందు మౌళి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ స్వరపరిచారు. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

రజనీ-కమల్ సినిమా

- యువ దర్శకుడికి అవకాశం



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించే 173వ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశాన్ని యువ దర్శకుడు శిబి చక్రవర్తి దక్కించుకున్నారు. 2022లో శివకార్తికేయన్ హీరోగా 'డాన్' వంటి బ్లాక్ బస్టర్ మూవీని శిబి అందించారు. ఇప్పుడు రజనీకాంత్ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ శనివారం అధికారికంగా ప్రకటిస్తూ, "ప్రతి హీరోకు ఓ ఫ్యామిలీ ఉంటుంది" అని ఓ ఫొటోను షేర్ చేసింది. ఈ చిత్రానికి నిర్మాతలు కమల్ హాసన్, ఆర్.మహేంద్రన్. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలకానుంది. అంతకుముందు ఈ చిత్రానికి సుందర్ సి దర్శకత్వం వహిస్తారని ప్రకటించారు. అయితే, ఆయన వ్యక్తిగత కారణాలతో ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఈ చిత్రంలో నటించే నటీనటులు, సాంకేతికవర్గం తదితర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్టు రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంస్థ తెలిపింది. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్-2'లో నటిస్తున్నారు. ఈ సినిమా తమిళ ఉగాదికి విడుదలకానుంది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కుటుంబ నేపథ్యంలో కొత్త చిత్రం



తమ కల్యాణ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించబోయే కొత్త చిత్రాన్ని ప్రకటించారు నిర్మాత కల్యాణ్. స్నేహం, వైరం ప్రధానాంశాలుగా కుటుంబ నేపథ్యంలో ఈ చిత్రం ఉండబోతోందని చెప్పారు. ఇప్పటికే నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయిందనీ, అన్ని విభాగాల్లోనూ పూర్తిగా కొత్త వారికి ఈ చిత్రం ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను సంక్రాంతి సందర్భంగా ప్రకటించి, చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తమ బ్యానర్‌లో ప్రయోగాత్మక చిత్రాలకు పెద్దపీట వేస్తామని కల్యాణ్ అన్నారు.

దిల్ దియా.. ఓ నగ్న సత్యం



వైవిధ్యమైన పాత్రలతో విలక్షణ నటుడిగా తనదైన గుర్తింపు సంపాదించుకున్న చైతన్యరావు మాదాడి కథానాయకుడిగా కె.క్రాంతి మాధవ్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'దిల్ దియా'. 'ఏ నేక్డ్ ట్రూత్' అనేది దీని ఉపశీర్షిక. శ్రియాస్ చిత్రాస్, ఏ.పూర్ణనాయుడు ప్రొడక్షన్స్ బ్యానర్లపై పూర్ణనాయుడు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా ఆవిష్కరించారు. పోస్టర్‌లో ఒంటిపై బట్టలు లేకుండా కూర్చొని, తీక్షణంగా చూస్తున్న చైతన్యరావు తీరు తన పాత్రలోని సీరియస్‌నెస్‌ని తెలియజేస్తోంది. ఈ సినిమా భావోద్వేగాలు, వ్యక్తిగత సంబంధాల మధ్య జరిగే సంఘర్షణలను చూపించే ట్రెండింగ్ డ్రామాగా ఉండనుందని, ప్రేమతోపాటు భావోద్వేగాల సంక్లిష్టతను, వాటి వల్ల వచ్చే ఫలితాలను తెరకెక్కిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు.



దుష్టశక్తులతో ఒంటరి పోరాటం

బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'హైందవ'. లుదీర్ బైరెడ్డి దర్శకత్వంలో మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేశ్‌చందు నిర్మిస్తున్నారు. ఇటీవలె కీలక షెడ్యూల్ పూర్తి చేసుకుని ప్రస్తుతం చివరిదశ షూటింగ్‌లో ఉందీ చిత్రం. శనివారం సాయిశ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. దుష్టశక్తులతో ఒంటరి పోరాటం చేస్తున్నప్పుడు దశావతారాలు సాయం చేస్తాయి అని పేర్కొన్నారు. ఇందులో శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు సాయిశ్రీనివాస్.

టైసన్ నాయుడు యాక్షన్

సాయిశ్రీనివాస్ నటిస్తున్న మరో చిత్రం 'టైసన్ నాయుడు'. 'భీమ్లా నాయక్', 'అప్పట్లో ఒకడుండేవాడు' ఫేమ్ సాగర్ కే చంద్ర దర్శకుడు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి సాయిశ్రీనివాస్ యాక్షన్ లుక్‌ను విడుదల చేసి బర్త్ డే విషెస్ తెలిపారు మేకర్స్.

ఫిబ్రవరిలో హనీ



హీరో నవీన్‌చంద్ర, 'పలాస' ఫేం కరుణకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'హనీ'. దివ్య పిళ్లై, దివి, రాజా రవీంద్ర కీలకపాత్రలు పోషించారు. సైకలాజికల్ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 6న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలోని మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలను ఇతివృత్తంగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు కరుణకుమార్ తెలిపారు. విజువల్‌గా, టెక్నికల్‌గా ఈ చిత్రం ఉన్నతంగా ఉండబోతోందని నిర్మాత రవి పీట్ల, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సంగీతం: అజయ్ అరసాడ.

భారత కుర్రాళ్ల విజయం

బెనోని: దక్షిణాఫ్రికా అండర్-19 జట్టుతో జరిగిన తొలి యూత్ వన్డేలో భారత కుర్రాళ్లు 25 రన్స్ తేడాతో గెలిచారు. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన ఫలితం నిర్ణయించారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 300 పరుగులు చేసింది. హర్వన్ష్ (93), అంబరీష్ (65), కనిష్క్ (32) రాణించారు. ఆ తర్వాత భారీ ఛేదనలో ఆతిథ్య జట్టు 27.4 ఓవర్లలో 148/4 స్కోరు వద్ద వర్షం కురవడంతో మ్యాచ్ ముందుకు సాగలేదు. ఆ సమయానికి డ/లూ పద్ధతిన భారత్‌దే పైచేయిగా ఉంది. దీపేష్‌కు రెండు వికెట్లు దక్కాయి.



‘బంగ్లాదేశ్’ ఎఫెక్ట్

ఐపీఎల్ నుంచి ముస్తాఫిజుర్ అవుట్

విడుదలజేసిన కోల్‌కతా
బీసీసీఐ సూచనతో నిర్ణయం

గువాహటి: బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో ఆ దేశంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడి మూక దాడుల్లో ఇద్దరు హిందువులు మరణించడంతో ఆ ప్రభావం భారత్-బంగ్లాదేశ్ దౌత్య సంబంధాలపై పడింది. ఈక్రమంలో ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) బంగ్లాదేశ్‌కు చెందిన తమ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను విడుదలజేయాల్సి వచ్చింది. బీసీసీఐ సూచన మేరకు కేకేఆర్ ఈ నిర్ణయాన్ని శనివారం ప్రకటించింది. 30 ఏళ్ల ఎడమచేతి పేసర్ ముస్తాఫిజుర్‌ను ఇటీవలి వేలంలో రూ. 9.20 కోట్లకు కోల్‌కతా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. మార్చి 26న మొదలయ్యే ఐపీఎల్ కోసం రెహ్మాన్ స్థానంలో మరో ఆటగాడిని తీసుకొనేందుకు కోల్‌కతాకు బీసీసీఐ అనుమతి ఇచ్చింది. ‘జట్టు నుంచి ముస్తాఫిజుర్‌ను విడుదలజేయాలని కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు బీసీసీఐ సూచించింది. అవసరమనుకొంటే అతడికి బదులు మరో క్రికెటర్‌ను ఆ జట్టు తీసుకోవచ్చు’ అని బోర్డు కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా తెలిపాడు. ఇటీవల జరిగిన పరిణామాలతో ముస్తాఫిజుర్‌పై ఆ నిర్ణయం తీసుకున్నట్టు సైకియా వివరించాడు. ‘బోర్డు సూచన మేరకు తగిన ప్రక్రియ, సంప్రదింపుల తర్వాత ముస్తాఫిజుర్‌ను విడుదలజేస్తూ నిర్ణయం తీసుకున్నాం’ అని ఓ ప్రకటనలో కోల్‌కతా నైట్‌రైడర్స్ తెలిపింది. బంగ్లాదేశ్‌లో అల్లర్ల సందర్భంగా జరిగిన దాడుల్లో ఇద్దరు హిందువులు మరణించడంతో ఐపీఎల్‌లో ముస్తాఫిజుర్ రెహ్మాన్ ఆడే విషయంలో బోర్డుపై ఒత్తిడి ఏర్పడింది. ప్రస్తుత పరిస్థితుల్లో రెహ్మాన్ కోల్‌కతా జట్టులో కొనసాగడంపై కేకేఆర్ సహ యజమాని, బాలీవుడ్ సూపర్ స్టార్ షారుక్ ఖాన్‌పై కొందరు బీజేపీ నేతలు విమర్శలు గుప్పించారు.



ద్వైపాక్షిక సిరీస్‌లపైనా ప్రభావం..

బంగ్లాదేశ్‌లో పరిస్థితుల ప్రభావం..భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్‌లపైనా పడింది. ఆ దేశంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా.. వాస్తవానికి గతేడాది రెండు జట్ల మధ్య జరగాల్సిన తెల్ల బంతుల సిరీస్ ఇప్పటికే వాయిదా పడింది. అయితే, ఈ ఏడాది సెప్టెంబరులో ఆ సిరీస్‌ను నిర్వహించనున్నట్టు బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) శుక్రవారమే ప్రకటించింది. 3 వన్డేలు (సెప్టెంబరు 1, 3, 6), 3 టీ20ల (సెప్టెంబరు 9, 12, 13) తేదీలను వెల్లడించింది. బీసీసీఐతో సంప్రదించాకే షెడ్యూల్‌ను ఖరారు చేసినట్టు బీసీబీ తెలిపింది. కానీ బంగ్లాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆ సిరీస్‌కు బీసీసీఐ ఈసారి కూడా ఓకే చెప్పే అవకాశాలు లేనట్టే.

మొత్తంగా.. ఈ పరిణామాలన్నీ ముస్తాఫిజుర్ విడుదలకు దారితీశాయి. ముస్తాఫిజుర్ 2016 నుంచి 8 సీజన్లపాటు ఐపీఎల్‌లో ఆడాడు. 2019, 2020లో లీగ్‌కు దూరంగా ఉన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, రాజస్థాన్‌కు అతడు ప్రాతినిధ్యం వహించాడు. కాగా..తాజా అంశంపై ముస్తాఫిజుర్ స్పందించలేదు. మరోవైపు ఈ అంశంపై చర్చించేందుకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు శనివారం రాత్రి అత్యవసరంగా సమావేశమైంది.

ప్రపంచకప్‌లో బంగ్లా ఆడేనా..?

వచ్చేనెల ప్రారంభమయ్యే టీ20 ప్రపంచ కప్‌లో.. భారత్‌లో బంగ్లాదేశ్ జట్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. తాజా పరిణామాలతో బంగ్లాదేశ్ జట్టు భారత్ రావడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

క్రీడల్లో రాజకీయమా?
శశి థరూర్ ధ్వజం

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులకు క్రికెట్‌కు ముడిపెట్టడాన్ని కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు శశి థరూర్ తప్పుబట్టారు. ముస్తాఫిజుర్‌ను కేకేఆర్ విడుదలజేయాలన్న బీసీసీఐ నిర్ణయంపై విమర్శలు గుప్పించారు. ‘ముస్తాఫిజుర్‌పై బీసీసీఐ ఆంక్షలు విచారకరం. రెహ్మాన్ స్థానంలో సౌమ్యా సర్కార్, లిట్టన్ దాస్ ఉంటే బోర్డు వారినీ ఇలానే శిక్షించేదా ? ఒక దేశం, ఒక వ్యక్తి, అతడి మతం..క్రీడలను రాజకీయం చేసే మతిలేని నిర్ణయంతో మనం ఏ దిశలో పయనిస్తున్నాం’ అని థరూర్ మండిపడ్డారు.

టాటా స్టీల్ చెస్‌కు గుకేశ్ దూరం

చెన్నై: వరల్డ్ చాంపియన్ గుకేశ్ ఈనెల 7 నుంచి 11 వరకు కోల్‌కతాలో జరిగే టాటా స్టీల్ చెస్ టోర్నీకి దూరం కానున్నాడు. వ్యక్తిగత కారణాలతోనే అతను ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. గుకేశ్ స్థానంలో నిహాల్ సరీన్‌ను ఎంపిక చేశారు.



శ్రేయాస్ వచ్చేశాడు

బుమ్రా స్థానంలో సిరాజ్

హార్దిక్‌కు విశ్రాంతి

షమీకి మొండిచేయి

కివీస్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా


సిరాజ్

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు భారత జట్టు న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడబోతోంది. ఈనేపథ్యంలో శనివారం జాతీయ సెలెక్టర్లు 15 మందితో కూడిన ఆటగాళ్ల జాబితాను వెల్లడించారు. ఈనెల 11, 14, 18 తేదీలలో వడోదర, రాజ్‌కోట్, ఇండోర్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి జట్టు పగ్గాలు చేపట్టగా, శ్రేయాస్ అయ్యర్‌ను కూడా జట్టులో చేర్చారు. గతేడాది ఆసీస్ పర్యటనలో తీవ్రంగా గాయపడిన అతను ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ నుంచి అనుమతి లభించింది. ఈనెల 6న హిమాచల్ ప్రదేశ్‌తో జరిగే మ్యాచ్ ద్వారా అతడి ఫిట్‌నెస్‌పై అంచనాకు రానున్నారు. ఇందులో ఎలాంటి ఇబ్బంది లేకపోతే తను కివీస్‌తో సిరీస్‌లో ఆడతాడని సెలెక్టర్లు ప్రకటించారు. ఇక సఫారీలతో వన్డే సిరీస్‌కు దూరమైన హైదరాబాదీ పేసర్ సిరాజ్ కూడా జట్టులోకి వచ్చాడు. బుమ్రాకు విశ్రాంతినివ్వడంతో అతను పేస్ బాధ్యతలు తీసుకోనున్నాడు. అయితే దేశవాళీల్లో రాణిస్తోన్న వెటరన్ మహ్మద్ షమీకి ఇక భారత జట్టు తలుపులు మూసుకుపోయినట్టుగానే భావించాలి. ఎప్పటిలాగే అతడిని ఈసారీ పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో ఉంచుకుని హార్దిక్‌తో 10 ఓవర్లు బౌలింగ్ వేయించేందుకు సీఓఏ అనుమతివ్వలేదు. దీంతో అతడికి విశ్రాంతినిచ్చారు. అయ్యర్ స్థానంలో వచ్చి దక్షిణాఫ్రికాపై సిరీస్‌లో సెంచరీ బాదిన రుతురాజ్‌తో పాటు కీపర్ జురెల్, తిలక్ వర్మలను పక్కనబెట్టారు. రెండో వికెట్ కీపర్‌గా పంత్ కొనసాగనున్నాడు. సిరాజ్, హర్షిత్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ పేస్ విభాగంలో ఉండగా, పెద్దగా రాణించలేకపోతున్న ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ స్థానం నిలుపుకోవడం గమనార్హం. ఇదిలావుండగా వెటరన్ స్టార్ ఆటగాళ్లు విరాట్, రోహిత్ ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో వీరి ఆట కోసం ఎప్పటిలాగే స్టేడియాలు కళకళలాడతాయనడంలో సందేహం లేదు.


షమి

జట్టు

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ క్రిష్ణ, కుల్దీప్ యాదవ్, రిషభ్ పంత్, యశస్వీ జైస్వాల్, నితీశ్ కుమార్, అర్ష్‌దీప్ సింగ్.



ఒకే ఓవర్లో 5 సిక్సర్లు

హార్దిక్ శతక విజృంభణ

రాజ్‌కోట్: ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (92 బంతుల్లో 8 ఫోర్లు, 11 సిక్స్‌లతో 133) సెంచరీతో అదరగొట్టినా.. విజయ్ హజారే ట్రోఫీలో బరోడాకు ఓటమి తప్పలేదు. గ్రూప్-బిలో శనివారం జరిగిన మ్యాచ్‌లో బరోడా 9 వికెట్లతో విదర్భ చేతిలో ఓడింది. తొలుత బరోడా 50 ఓవర్లలో 293/9 స్కోరు చేసింది. యశ్ ఠాకూర్ 4 వికెట్లు తీశాడు. 136/6తో కష్టాల్లో పడినప్పుడు ఏడో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ ఎడాపెడా షాట్లతో విజృంభించాడు. 39వ ఓవర్‌లో పార్థ్ బౌలింగ్‌లో పాండ్యా వరుసగా ఐదు సిక్స్‌లు, ఫోర్‌తో మొత్తం 34 రన్స్ రాబట్టడం హైలైట్. ఛేదనలో విదర్భ 41.4 ఓవర్లలో 296/1 స్కోరు చేసి గెలిచింది. అమన్ (150 నాటౌట్) సెంచరీతో అథర్వ తైడే (65), ధ్రువ్ షోరే (65 నాటౌట్) అర్ధ శతకాలతో రాణించారు.

పోరాడి ఓడిన ఆంధ్ర

బెంగళూరు: టీమిండియా ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (130, 2/27) లిస్ట్-ఎ క్రికెట్‌లో తొలి శతకంతో అదరగొట్టడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో గుజరాత్ ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-డిలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 7 పరుగుల తేడాతో గుజరాత్ చేతిలో ఓడింది. తొలుత గుజరాత్ 50 ఓవర్లలో 318/9 స్కోరు సాధించింది. విశాల్ జైస్వాల్ (70) హాఫ్ సెంచరీ చేశాడు. సత్యనారాయణ రాజు 4 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఆంధ్ర ఓవర్లన్నీ ఆడి 311/7 స్కోరు మాత్రమే చేసింది. ఓపెనర్ జ్ఞానేశ్వర్ (102), ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (48 నాటౌట్) పోరాడారు. రవి బిష్ణోయ్ మూడు వికెట్లు దక్కించుకొన్నాడు.

తలమానికంగా అమరావతి స్పోర్ట్స్ సిటీ

శాప్ చైర్మన్ రవినాయుడు



తాడేపల్లి (ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికంగా అమరావతిలో స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేయాలనేది సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు చెప్పారు. శనివారం తాడేపల్లిలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ బాడ్మింటన్ పోటీలను రవినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుల్లెల గోపీచంద్, కిడాంబి శ్రీకాంత్‌కు అకాడమీలు నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే భూకేటాయింపులు పూర్తి చేసిందని, భవిష్యత్‌లో మరిన్ని క్రీడాంశాల్లో అకాడమీల ఏర్పాటుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఇక, ఐదు రాష్ట్రాలకు చెందిన సుమారు 128 విశ్వవిద్యాలయాల జట్లు పాల్గొంటున్న సౌత్‌జోన్ పోటీలకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఆతిథ్యం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ. వీసీ ఏవీఎస్ ప్రసాద్, జాతీయ బ్యాడ్మింటన్ సంఘం మాజీ సంయుక్త సెక్రటరీ పున్నయ్య చౌదరి, కేఎల్‌యూ స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ ప్లస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,35,820 ▼	1,24,500 ▼	2,56,000 ▼
విజయవాడ	1,38,500 ▼	1,28,500 ▼	2,38,000 ▼
విశాఖపట్నం	1,36,130 ▼	1,24,500 ▼	2,57,000 ▼
రాజమండ్రి	1,35,820 ▼	1,24,500 ▼	2,28,000 ▼
ప్రొద్దుటూరు	1,38,350 ▼	1,27,280 ▼	2,38,350 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ



హైదరాబాద్	610	విజయవాడ	620
వరంగల్	612	గోదావరి	625
చిత్తూరు	683	విశాఖపట్నం	610
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	150	విజయవాడ	152
వరంగల్	150	గుంటూరు	157
కరీంనగర్	150	ఒంగోలు	157
మహబూబ్‌నగర్	150	చిత్తూరు	151
కర్నూలు	150	నెల్లూరు	156
విశాఖపట్నం	143	అనంతపురం	156
గోదావరి	152		

నగల నిల్వలు

పరిమితులు - నిబంధనలు



భారతీయులకు బంగారంపై మోజెక్కువే. ఏ శుభ కార్యానికైనా ఎంతో కొంత బంగారం కొనాల్సిందే. సంపన్న కుటుంబాలైతే చెప్పే పనే లేదు. బంగారం వంటి విలువైన లోహాల కొనుగోలుకు శుభప్రదంగా భావించే అక్షయ తృతీయ, ధన త్రయోదశికి నగల దుకాణాలు కిటకిట లాడుతుంటాయి. ఆభరణాల కొనుగోళ్లకు లెక్క పక్కాగా ఉన్నంత వరకు ఓకే. లేకపోతే ఆదాయం పన్ను శాఖ నుంచి తిప్పలు తప్పవు.

మన దేశంలో బంగారం లేదా బంగారు ఆభరణాలు లేని ఇళ్లు ఉండవంటే ఆశ్చర్యం లేదు. చిన్నమెత్తు బంగారమైనా కొనందే ఇళ్లలో జరిగే ఏ శుభ కార్యమూ పూర్తి కాదు. వ్యక్తులు, కుటుంబాల వద్ద వీటి నిల్వలు చట్ట పరిమితికి లోబడి ఉన్నంత వరకు ఓకే. లెక్కాపక్కా లేకుండా ఎడాపెడా బంగారు ఆభరణాలు పోగేసుకుంటూ పోతే మాత్రం ఐటీ శాఖ కొరడా ఝుళిపిస్తుంది. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా ఎంత మొత్తం బంగారం లేదా ఆభరణాలు కలిగి ఉండవచ్చనే దానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం..

పరిమితులు: నిజానికి ఎవరు ఎంత బంగారం లేదా ఆభరణాలు కలిగి ఉండాలనే దానిపై ఎలాంటి పరిమితి లేదు. కాకపోతే వీటిని తమ కష్టార్జితంతో సంపాదించినట్టు పన్ను చెల్లింపుదారులు ఐటీ అధికారులకు ఆధారాలతో సహా నిరూపించాలి. వారసత్వంగా వచ్చిన ఆభరణాలకూ ఇది వర్తిస్తుంది. రశీదు లేదా ఇతర పత్రాలు లేకపోయినా వ్యక్తులు, అవిభాజ్య హిందూ కుటుంబాలు(హెచ్‌యూఎఫ్) కొన్ని పరిమితులకు లోబడి బంగారం లేదా నగలు ఉంచుకోవచ్చు. అయితే ఈ పరిమితులు కుటుంబ సభ్యుల వ్యక్తిగత బంగారం లేదా ఆభరణాలకు మాత్రమే వర్తిస్తాయి. వాణిజ్యపరమైన లేదా పెట్టుబడి లాభాల కోసం కొని పెట్టుకున్న ఆభరణాలు, బంగారానికి వర్తించవు.

గరిష్ఠ పరిమితి	
వివాహిత స్త్రీలు	అర కిలో
అవివాహిత స్త్రీలు	పావు కిలో
పురుషులు	100 గ్రా.

హెచ్‌యూఎఫ్‌లు: కుటుంబ ఆదాయం, స్టేటస్‌ను బట్టి ఈ పరిమితిని నిర్ణయిస్తారు. దీనికి ఒక నిర్దిష్ట స్థాయి లేదు. పెళ్లిళ్లు, వారసత్వం, కుటుంబ బహుమతులు వంటి అంశాల ఆధారంగా ఈ పరిమితిని నిర్ణయిస్తారు.

- ఐటీ నోటీసులు అందుకున్న వ్యక్తి తప్పనిసరిగా హెచ్‌యూఎఫ్ సభ్యుడై ఉంటేనే నిబంధనలు వర్తిస్తాయి.
- సోదాల్లో హెచ్‌యూఎఫ్ కాని వ్యక్తి బంగారం లేదా ఆభరణాలు దొరికితే ఐటీ అధికారులు వాటిని స్వాధీనం చేసుకోవచ్చు.

నిరూపించలేకపోతే కష్టాలే: ధ్రువ పత్రాలు చూపించాల్సిన అవసరం లేని స్థాయికి మించి బంగారం లేదా నగలు ఉంటే తిప్పలు తప్పవు. ఐటీ రిటర్న్‌లో పేర్కొన్న తమ ఆదాయం నుంచే వాటిని కొన్నట్టు నిరూపించాలి.

బహుమతులు లేదా వారసత్వంగా వస్తే?

- ఇన్‌వాయిస్, గిఫ్ట్ డీడ్, సందర్భం, బంధువు, బహుమతి లేదా వారసత్వంగా అందిన బంగారం లేదా నగల విలువ ధ్రువ పత్రాలను అధికారులకు చూపాలి.

శిక్ష

పరిమితికి మించి ఉన్న బంగారం, ఆభరణాలకు సరైన లెక్క చెప్పలేకపోతే సర్‌చార్జీ, సెస్సులతో కలిపి బంగారం, నగల విలువలో 60 % పన్నుగా విధిస్తారు. అదనంగా వడ్డీ, జరిమానా కూడా తప్పవు. కొన్ని సందర్భాల్లో ఐటీ అధికారులు ఆ బంగారం, నగల మొత్తాన్ని కూడా స్వాధీనం చేసుకోవచ్చు.

మినహాయింపులు వర్తించని బంగారం, నగలు

- పెట్టుబడి కోసం కొన్న బంగారం, గోల్డ్ ఈటీఎఫ్‌లు.
- నిల్వ చేసిన బంగారు బిస్కెట్లు, నాణేలు, కడ్డీలు.
- సరైన ఆర్థిక వివరాలు లేకుండా ట్రేడింగ్, స్పెక్యులేషన్ కోసం నిల్వ చేసిన బంగారం, నగలు.

పెద్ద మొత్తంలో బంగారం లేదా నగలు ఉన్న వ్యక్తులు, అవిభాజ్య హిందూ కుటుంబాలు ఈ విషయాలు గుర్తుంచుకుని జాగ్రత్త పడాలి. ఏ మాత్రం తేడా కనిపించినా ఉన్నదంతా ఐటీ అధికారులు ఊడ్చుకు పోయే ప్రమాదం ఉంది.

నివాసం ఒక చోట.. సేవలు మరొక చోట ఉంటే.. ?

ఇటీ GST


రాంబాబు గొండాల

కొన్ని రకాల వృత్తి నిపుణులు ఒక ప్రాంతంలో కాకుండా దేశంలోని వివిధ ప్రదేశాలలో సేవలు అందిస్తుంటారు. ఉదాహరణకు ఇంజనీర్లు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, కాంట్రాక్టర్లు.. వీరు తమ నివాసం ఉండే రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా సేవలు అందిస్తుంటారు. మరి జీఎస్‌టీ చట్టం రిజిస్ట్రేషన్ అనేది ఒక రాష్ట్రానికే చెల్లుబాటు అవుతుంది. అలాంటప్పుడు ప్రతీ రాష్ట్రంలో వీరు రిజిస్ట్రేషన్ తీసుకోవలసి ఉంటుందా ? అలా అయితే ఇవన్నీ నిర్వహించడం సమస్య అవుతుంది కదా ? ఇలాంటి సందేహాలు చాలా మందికి ఉంటాయి. దీనిని క్రింది ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం..

సుందర్ ఒక కాంట్రాక్టర్. హైదరాబాద్‌లో నివాసముంటూ స్థానికంగా కాంట్రాక్టు పనులు చేస్తుండేవాడు. హైదరాబాద్‌లోని తన ఆఫీస్ చిరునామాతో అతనికి జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ఉన్నది. ఇలా ఉండగా, విజయవాడ నుంచి అతనికి అపార్ట్‌మెంట్ కట్టడానికి ఒక కాంట్రాక్టు వచ్చింది. స్థానికంగా ఉండే పనివాళ్లతో ఆ నిర్మాణం మొదలు పెట్టాడు. తనకు కావాల్సిన సిమెంట్, ఇటుకలు, స్టీల్ లాంటి సామాగ్రి కూడా స్థానికంగానే కొనుగోలు చేసాడు. అయితే, జీఎస్‌టీకి సంబంధించి అతనికి ఒక సమస్య వచ్చింది. తనకు రిజిస్ట్రేషన్ తెలంగాణలో ఉంది. పనులు జరిగేది ఆంధ్రప్రదేశ్‌లో కనుక ఏపీ పనుల తాలుకా జీఎస్‌టీ, తెలంగాణకు చెందిన రిజిస్ట్రేషన్ నుంచి చెల్లించవచ్చా ? లేదా ఆంధ్రప్రదేశ్‌లో మరొక రిజిస్ట్రేషన్ తీసుకోవాలా ? ఒకవేళ ఏపీలో రిజిస్ట్రేషన్ తీసుకోవాలంటే, ఏ అడ్రస్‌తో తీసుకోవాలి ? ఎందుకంటే, తనకు ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి అడ్రస్ లేదు. ఇలాంటి సమస్య చాలామందికి ఉంటుంది. ఆఫీస్ ఒక రాష్ట్రంలో ఉంటూ తాము అందించే సేవలు మరొక రాష్ట్రంలో ఉన్నప్పుడు ఇలాంటి గందరగోళం కొంతమేర ఉంటుంది.

దీనిని అర్థం చేసుకోవడానికి, జీఎస్‌టీ చట్టం రిజిస్ట్రేషన్ గురించి ఏమి చెబుతుందో తెలుసుకోవాలి. దీని ప్రకారం, సరఫరా ‘ఎక్కడ జరుగుతుంది ’ అనేదానికంటే ‘ఎక్కడి నుంచి జరుగుతుంది’ అనే అంశం కీలకం. ఎందుకంటే, సరఫరా ఏ రాష్ట్రం నుంచి జరుగుతుందో ఆ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ తీసుకోవాలి. ఇంకా వివరంగా చెప్పాలంటే, అపార్ట్‌మెంట్ నిర్మాణం విజయవాడలో జరుగుతున్నప్పటికీ, సరఫరా అందించే వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్నాడు. మరి, హైదరాబాద్ నుంచే సరఫరా జరుగుతున్నట్లు ఎలా నిర్ధారణ చేసుకోవాలి? సరఫరా అందించే వ్యక్తికి అంటే సుందర్‌కు విజయవాడలో లేదా ఆంధ్రప్రదేశ్‌లో ఏదేని ఆఫీస్ ఉండీ, ఆ చిరునామాతో అగ్రిమెంట్ ఉన్నట్లయితే సరఫరా ఆంధ్రప్రదేశ్ నుంచి జరుగుతున్నట్లు భావించాలి. అక్కడి చిరునామాతో రిజిస్ట్రేషన్ తీసుకోవాలి, సంబంధిత జీఎస్‌టీ అక్కడి రిజిస్ట్రేషన్ నుంచి చెల్లించాలి. అలా కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో తనకి ఎలాంటి చిరునామా లేకుండా కేవలం తెలంగాణలో మాత్రమే ఆఫీస్ ఉండి, సంబంధిత అగ్రిమెంట్ కూడా హైదరాబాద్ అడ్రస్‌తో ఉంటే సరఫరా తెలంగాణ నుంచి జరుగుతున్నట్లు భావించాలి. కొంతమందికి ఆఫీస్ ఉండకుండా కేవలం నివాస గృహం నుంచి సర్వీస్‌లు అందిస్తుంటారు. వారికీ ఇదే నియమం వర్తిస్తుంది. ఇంకా సులభంగా చెప్పాలంటే సరఫరా ఏ రాష్ట్రంలో జరుగుతుందో, ఆ రాష్ట్రంలో సరఫరా అందించే వ్యక్తికి ఎలాంటి ఆఫీస్ లేదా ఫిక్స్‌డ్ ఎస్టాబ్లిష్‌మెంట్ గానీ లేకుంటే సరఫరా ఆ రాష్ట్రం నుంచి జరగడం లేదు. తన నివాసం లేదా ఆఫీస్ ఏ రాష్ట్రంలో ఉందో ఆ రాష్ట్రం నుంచి జరుగుతుందని భావించాలి. కాబట్టి సుందర్‌కు ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్‌లో రిజిస్ట్రేషన్ ఉండాలనే నిబంధన లేదు. అయితే, ఇలాంటి సందర్భాలలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకోవడానికి కొంత ఇబ్బంది ఉంటుంది. దీనికి కారణం ఒక రాష్ట్ర ఇన్‌వాయిస్‌లకు సంబంధించిన సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ క్రెడిట్ వేరొక రాష్ట్ర రిజిస్ట్రేషన్‌లో తీసుకోరాదు. అదే, ఐజీఎస్‌టీ క్రెడిట్ అయితే ఎలాంటి సమస్య ఉండదు. కనుక, ఇలాంటి సందర్భాలలో కేవలం రిజిస్ట్రేషన్ ఒక్క దాని గురించే కాకుండా మిగతా అంశాల గురించి కూడా సమగ్రంగా ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి.

అంతే కాకుండా కొంతమందికి ఒక రాష్ట్రంలో నివాసం లేదా వ్యాపారం ఉండగా మరొక రాష్ట్రంలో అద్దెలు వచ్చేటట్లు ఆఫీసులు, దుకాణాలు ఉంటాయి. వీటికి కూడా పైన చెప్పిన నిబంధనే వర్తిస్తుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

ఈవీ బ్యాటరీలకు ఆధార్ తరహా నంబరు

కేంద్ర రవాణా శాఖ ప్రతిపాదన



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాల (ఈవీ) బ్యాటరీలకు ఆధార్ తరహా విశిష్ట గుర్తింపు నంబరును కేటాయించాలని కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. దేశవ్యాప్తంగా ఈవీ బ్యాటరీల వినియోగం, రీసైక్లింగ్, భద్రతను పర్యవేక్షించేందుకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా తయారీదారులు, దిగుమతిదారులు తాము విక్రయించనున్న బ్యాటరీలకు 21 అంకెలతో కూడిన బ్యాటరీ ప్యాక్ ఆధార్ నంబర్(బీపీఏఎన్)ను కేటాయించడం కేంద్రం తప్పని చేయనున్నట్లు తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ముసాయిదాలో మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలాగే, బ్యాటరీల తయారీదారులు, దిగుమతిదారులు విక్రయించబోయే బ్యాటరీ ప్యాక్‌ల డైనమిక్ డేటాను అధికారిక బీపీఏఎన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అంతేకాదు, బ్యాటరీపై బీపీఏఎన్ స్పష్టంగా కన్పించాలి. వాహనంలో అమర్చాక ఆ నంబరును చూడగలిగే చోట, చెరిగిపోకుండా ఉండే చోట ముద్రించాల్సి ఉంటుందని ముసాయిదా మార్గదర్శకాల్లో మంత్రిత్వ శాఖ పేర్కొంది.

ఈవీ విక్రయాల్లో టెస్లాను దాటేసిన బీవైడీ



న్యూయార్క్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ వాహనాల(ఈవీ) కంపెనీ టెస్లా తన అగ్ర కిరీటాన్ని కోల్పోయింది. ప్రపంచంలో అత్యధిక ఈవీలు విక్రయిస్తున్న కంపెనీల జాబితాలో చైనాకు చెందిన బీవైడీ తాజాగా టెస్లాను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి చేరుకుంది. గత ఏడాదిలో టెస్లా 16.4 లక్షల ఈవీలను విక్రయించింది. 2024తో పోలిస్తే కంపెనీ సేల్స్ 9 శాతం తగ్గాయి. కాగా, 2025లో 22.6 లక్షల ఈవీల విక్రయాలతో బీవైడీ వరల్డ్ నం.1గా నిలిచింది. గత సంవత్సరంలో కంపెనీ ఈవీ సేల్స్ దాదాపు 28 శాతం పుంజుకున్నాయి. అమెరికా సుంకాల వడ్డింపుల నేపథ్యంలోనూ బీవైడీ అంతర్జాతీయంగా వేగంగా విస్తరించడం ఇందుకు దోహదపడింది. ప్రధానంగా యూరప్, ఆగ్నేయాసియా, పశ్చిమ ఆసియాలో మార్కెట్ వాటాను గణనీయంగా పెంచుకోగలిగింది.

భారత్‌లో చిక్కుకుపోయిన ఉద్యోగులకు అమెజాన్ వెసులుబాటు

మార్చి 2 వరకు రిమోట్ వర్కింగ్ అవకాశం

న్యూఢిల్లీ: అమెరికా వీసా జాప్యమైన కారణంగా భారత్‌లో చిక్కుకుపోయిన తన ఉద్యోగులకు అంతర్జాతీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఈ మార్చి 2 వరకు రిమోట్ వర్కింగ్ వెసులుబాటును కల్పించింది. అయితే, వారిని కోడింగ్, వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం, కస్టమర్లతో సంప్రదింపులు వంటి విధుల నుంచి నిషేధించింది. సాధారణంగా అమెజాన్ తన ఉద్యోగులకు వీసా రెన్యువల్ సమయాల్లో కేవలం 20 రోజులు మాత్రమే రిమోట్ వర్కింగ్‌కు అనుమతిస్తుంటుంది. కానీ, ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ వీసా నిబంధనలను కఠినతరం చేయడంతో వీసాల జారీ నెలల తరబడి జాప్యమవుతున్న నేపథ్యంలో అమెజాన్ ఈ నిర్ణయం తీసుకుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.